జులై
2024

219

సంపుటి : 20 సంచిక : 2 వెల రు. 15/-

## ఈ సంచికలో........

మోడీ నిరంకుశత్వానికి ప్రజా తిరస్కరణ
సాంస్కృతిక రంగంలో ప్రత్యామ్నాయ కృషి
స్వర్ణయుగంలో సామాన్యులు
నయా-ఉదారవాదం, నయా-ఫాసిజం
పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఏం జరుగుతోంది?
ఆర్ఎస్ఎస్ నాటకాలు
సంఖ్యలు కూడా అబద్ధాలు చెపుతాయి
కేరళ స్పార్టకస్ అయ్యం కాళీ

# స్ఫూర్తి కేరళ స్పార్టకస్ అయ్యం కాళీ

పిబి చారి

**18** వ శతాబ్దం రెండో భాగంలో నారా యణ గురు ప్రేరణతో కులాధిపత్యాన్ని, కుల వివక్షతకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుట ఎగరవేసిన గొప్ప సంఘసంస్కర్త అయ్యంకాళీ. ట్రావెన్ కోర్ సంస్థానంలో అణగారిన ప్రజల హక్కులు కొరకు వారి ఆత్మగౌరవం కోసం పోరాడిన నాయకుడు. అతను కుల వ్యవస్థ దాని వివక్ష విధానాలను సవాలు చేశాడు. అంటరాని కులాల్లో స్వాతంత్రేచ్ఛ, ఆత్మగౌర వం నింపడంతో పాటు స్త్రీల ఆత్మగౌరవం కోసం వారిని సాంస్కృతికంగా చైతన్యపరిచిన సంఘసంస్కర్త అయ్యంకాళీ. అయ్యాంకాళీ, జ్యోతిరావు పూలే కంటే 45 సంవత్సరాల చిన్నవాడు. పెరియార్ ఇ.వి రామస్వామి నాయకర్ కన్నా 16 ఏండ్ల పెద్దవాడు. పూలే, పెరియార్లు వివక్షత లేని సమాజం గురించి ఎలా పోరాటాలు చేశారో అలాగే అయ్యంకాళీ కేరళలో పోరాడాడు. ఈ పోరాటంలో కేరళలోని అగ్రవర్ణాల చేతిలో అనేక దాడులకు గురయ్యాడు. అయినప్పటికీ జంకకుండా తిరుగుబాటు జెండా ఎగరవేశాడు. అందుకే ఆయనను కేరళ "స్పార్టకస్"గా పిలుస్తారు.

అయ్యంకాళీ కేరళలోని తిరువనంతపురం దగ్గరలో ఉన్న "వెంగనూరు"లో అయ్యన్, మాల దంపతులకు 1863 ఆగస్టు 28న జన్మించాడు. వీరిది "పులయ"అనే అంటరాని కులం. వీరు వ్యవసాయ కూలీలుగా, బానిసలుగా పరిగ ణించబడే వారు. అయ్యంకాళీ నిరక్షరాస్యుడు. అయినప్పటికీ అణగారిన వర్గాల అక్షరాస్యతకు, అభ్యున్నతికి అనేక పోరాటాలు చేశాడు. చిన్న తనంలో ఇతర కులాలకు సంబంధించిన స్నేహితులతో కలిసి ఫుట్బాల్ ఆడేవాడు. ఆ ఆటలో అతను తన్నిన బంతి ఒక నాయర్ ఇంటి కప్పు మీద పడింది. వెంటనే ఆ నాయర్ బయటకు వచ్చి ఆ బంతిని తన్నిన అయ్యంకాళీని తిడుతూ ఇతర పిల్లలను ఈ అంటరాని వాడితో జట్టు కట్టి ఆడవద్దు అని హెచ్చరించాడు. నాయర్ చూపించిన కుల వివక్ష అయ్యంకాళీ లేత మనసును ఎంతగానో గాయపరిచింది. మనుషులంతా ఒక్కటే కదా ఈ ఈ కులం ఆ కులం ఏమిటి అన్న ప్రశ్న చిన్న వయసులోనే తనను కలచివేసింది. ఈ కులవివక్ష ఎంత దుర్మార్గమో అప్పుడప్పుడే అతనికి అర్థం అవుతూ వచ్చింది.

చిన్నతనంలో ఎదుర్కొన్న కుల వివక్ష పెరిగి పెద్దవాడైన తర్వాత అతనిని కుల



వ్యతిరేక ఉద్యమ నాయకుడిగా మార్చింది. ఆ రోజుల్లో అంటరానితనం అన్నది ఒక పెద్ద జబ్బుగా పరిణమించిన సమాజం. పులయ, పరియ కులస్తులను ఆనాటి ఆధిపత్య కులాల వారు సమాజంలో మనుషులుగా కూడా గుర్తించటానికి ఇష్టపడలేదు. సమాజంలో ఎన్ని వైరుధ్యాలు ఉన్నా, ఇతర కులాల మధ్య ఎన్ని విభేదాలు ఉన్నా, అంటరాని కులాల విషయానికి వచ్చేసరికి అందరూ ఒకటై తీవ్ర వివక్షను కనపరిచేవారు. దీనితో సంఘర్షణ అనివార్యమైంది. రక్తపాతం కూడా జరిగింది.

అస్పృశ్యులను ముఖ్యంగా పులయ కులానికి చెందిన వాళ్లను పురవీధుల్లోనూ, బహిరంగ బజారులోనూ నడవరాదు అనే ఆంక్షలు ఉండేవి. దీన్ని ఏమాత్రం ఇష్టపడని అయ్యంకాళీ ఈ వివక్షను సవాలు చేస్తూ, పురవీధులలోనూ, అన్ని రహదారుల్లోనూ "విల్లు వండి" (ఎద్దుల బండి) ఎక్కి అగ్రవర్ణాలు ధరించే వస్త్రధారణతో సవారీ చేశాడు. దళితుల ఆత్మగౌరవానికి, శతా బ్దాల కుల అణచివేతకు వ్యతిరేకంగా పురవీధు లన్నీ ఎద్దుల బండిపై ప్రయాణం చేయడం ఒక తిరుగుబాటుకు ప్రతీక అయ్యింది. దళితు లు కలలో కూడా ఊహించని ఈ పరిణామం తో వారిలో ఆత్మ విశ్వాసం పెరిగింది. అయ్యం కాళీ సాహసానికి అందరూ ఆశ్చర్యపోయారు. నిషేధించబడిన వీధులలో, ఒక దళితుడు సవర్ణుల వస్త్రధారణతో ఎద్దుల బండి మీద సవారీ చేయటం అవమానంగా భావించిన అగ్రవర్ణాల వాళ్ళు అయ్యం కాళీ మీద దాడి చేశారు. ఆ దాడిని అయ్యం కాళీ, అతని అనుచరులుతిప్పి కొట్టారు. అయ్యం కాళీ కుల వివక్షకు వ్యతిరేకంగా, అసమానతలకు వ్యతి రేకంగా కేరళలోని వివిధ దళిత కులాల మధ్య ఐక్యతను ఏర్పరిచాడు. ఉద్యమాన్ని మరింత సంఘటిత పరచటానికి అనేకమంది యువకు లతో ఆత్మ రక్షణ దళాలను ఏర్పాటు చేశాడు. "సాధుజన పరిపాలన సంఘాన్ని" స్థాపించా డు. సాధుజన పరిపాలన అనే మాస పత్రికను కూడా నడిపాడు. అదే భారతదేశంలో మొట్ట మొదటి దళిత పత్రిక.

అయ్యం కాళీ బలరామపురంలో అంట రాని వారి హక్కుల కోసం, అలానే పురవీధు లలో నడవటం గురించి పెద్ద ఊరేగింపుకు నాయకత్వం వహించాడు. ఆ ఊరేగింపు బలరాంపురం లోని "చెలియార్" బజారుకు చేరుకుంది. ఇది సహించలేని అగ్రవర్ణాలు ఆ ఊరేగింపుపై దాడి చేశారు. అనేకమందికి గాయాలయ్యాయి. పెద్ద యుద్ధమే జరిగింది. అనేకమంది నేలకొరిగారు. పెద్ద ఎత్తున రక్త పాతం జరిగింది. అయినప్పటికీ ధైర్యం వీడని అయ్యం కాళీ అతని యువ దళాలు, ఆధిపత్య కులాలను ఎదిరించి పోరాడారు. అయ్యం కాళీ నాయకత్వం వహించిన ఈ ఊరేగింపును "స్వేచ్ఛ కోసం నడక" అని తత్ ఫలితంగా జరిగిన అల్లర్లను "చెలియార్ అల్లర్లు" అని పిలుస్తారు. దీనిని కేరళలో అణగారిన వర్గాల వారు, అగ్రవర్ణాలతో తలపడిన మొదటి సాయుధ ఘర్షణగా చెప్తుంటారు. అయ్యం కాళీ నిర్వహించిన ఈ సాహసోపేతమైన ఉద్యమ ఫలితంగా 1900 లో అంటరాని వారు, దేవాలయాలు ఉన్న రోడ్లను మినహా ఇతర రోడ్లు చాలావరకు ఉపయోగించుకునే హక్కును పొందారు.

అణగారిన వర్గాలను, దళితులను బానిసలుగా చేసి వారి మీద పెత్తనం చెలా యిస్తున్న అగ్రవర్ణాల మీద తిరుగుబాటు చేసిన అయ్యం కాళీని కేరళ స్పార్ట కస్గా పిలవడం మొదలు పెట్టారు. ఆ రోజుల్లో పాఠశాలల్లో దళిత పిల్లలు చదువుకో టానికి కూడా అనుమతి ఉండేది కాదు. దళితుల అక్షరాస్యత కోసం, పాఠశాలల్లో దళిత పిల్లలు చదువుకునే అవకాశం ఉండా లని, ఆనాటి ట్రావెన్ కూర్ ప్రభుత్వానికి దరఖాస్తు చేశాడు అయ్యం కాళీ. ట్రావెన్కూర్ సంస్థానం దివాన్గా ఉన్న రాజగోపాలాచారి దళిత పిల్లలు చదువుకోవ డానికి సానుకూలం గా స్పందించి ఉత్తర్వులు ఇచ్చాడు. కానీ ప్రభుత్వ అధికారుల్లో కొందరు, అలాగే భూస్వా ములు, అగ్రకులాల వారు, ఆ ఉత్తర్వును అడ్డుకున్నారు. నిమ్న వర్గాల మీద దాడులు కూడా జరిపారు. దానితో ఆగ్రహోదగ్రుడైన అయ్యం కాళీ మీరు మా పిల్లలను పాఠశాలల్లో చదువుకోనీయకపోతే, మీ పొలాల్లో మేము పని చేయము. "మీ వరి పొలాల్లో పిచ్చి గడ్డి మొలు స్తుంది. మీ పొలాలు

**(మిగతా 35వ పేజీలో)**

## ఈ సంచికలో...

1. కేరళ స్పార్టకస్ అయ్యం కాళి
పిబి చారి........2

2. మోడీ నిరంకుశత్వానికి ప్రజా తిరస్కరణ
నిరుపమా సుబ్రమణియన్........4

3. సాంస్కృతిక రంగంలో ప్రత్యామ్నాయ కృషి
.......8

4. స్వర్ణయుగంలో సామాన్యులు
ఎంవిఎస్ శర్మ .......15

5. నయా-ఉదారవాదం, నయా-ఫాసిజం
ప్రభాత్ పట్నాయక్ ........19

6. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఏం జరుగుతోంది?
ఇఫ్తికర్ జిలానీ ........24

7. ఆర్ఎస్ఎస్ నాటకాలు
ఎ.కోటిరెడ్డి........29

8. సంఖ్యలు కూడా అబద్ధాలు చెపుతాయి
టికె రాజాలక్ష్మి.......32

సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్.వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org

# ప్రజా తీర్పు

2024 ఎన్నికల్లో ఓటర్లు అటు కేంద్రంలోనూ, ఇటు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనూ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తీర్పు చెప్పారు.'అబ్‌కీ బార్ 400 పార్' అనే నినాదంతో కేవలం మోడీ భరోసాతో (మోడీ కీ గ్యారంటీ) పూర్తి స్థాయి మెజారిటీ సాధించి భారత రాజ్యాంగాన్ని మార్చివేమాలనుకున్న బిజెపికి భారతీయ ఓటరు గట్టి గుణపాఠం చెప్పాడు. గతంలో దానికి ఉన్న 303 సీట్లను 240కి తగ్గించాడు. హిందూత్వ పురిటి గడ్డగా భావిస్తున్న ఉత్తర ప్రదేశ్‌లో రామమందిర నిర్మించిన బిజెపికి తిరుగులేదనుకున్న చోట దానికి కొర్రు కాల్చి వాతలు పెట్టాడు. చివరికి బాబ్రీమసీదు కూల్చిన చోట రామాలయం కట్టిన ఫైజాబాద్ నియోజకవర్గంలోనే మతతత్వ పార్టీని మట్టికరిపించాడు. పార్లమెంటు ఎన్నికలతోపాటు అసెంబ్లీకి ఎన్నికలు జరిగిన ఆంధ్ర ప్రదేశ్‌లో వైసిపి నియంతృత్వాన్ని ప్రజలు స్పష్టంగా తిరస్కరించారు. అయితే ఇక్కడ ప్రత్యామ్నాయ శక్తులు బలంగా లేకపోవడంతో నిరంకుశ బిజెపితో జతకట్టిన ఎన్డీఏ కూటమే తిరిగి అధికారంలోకి వచ్చింది.

కేంద్రంలో మిత్రపక్షాల మీద ఆధారపడి మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టినప్పటికీ రాజ్యాంగాన్ని ఇష్టారీతిన మార్చడానికి దానికి అవకాశం ఉండదు. దానికి తోడు 234 స్థానాలు గెలుచుకున్న ప్రతిపక్ష 'ఇండియా' కూటమి పార్లమెంటులోపలా, వెలుపలా గట్టి ప్రతిఘటన చూపించే అవకాశం ఏర్పడింది.

రెండోపక్క మిత్రపక్షాల అండతోనైనా మూడో సారి అధికారం చేపట్టిన బిజెపి దాని వెనుకనుండి కథ నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ తమ మతతత్వ-కార్పొరేట్ అనుకూల విధానాలను మానుకోవు సరికదా అధికారం అండతో వాటిని మరింత లోతుగా అమలు చేయడానికే ప్రయత్నిస్తాయి. ఎన్నికల్లో బిజెపి ఒరిస్సాలోనూ, దక్షిణాది రాష్ట్రాల్లోనూ మరింత లోతుగా చొచ్చుకు పోయింది. ఒరిస్సాలో 21 స్థానాలకు గాను, 20 స్థానాలు గెలుచుకోవడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని చేజిక్కించుకుంది. తెలంగాణాలో ఓట్లు, సీట్ల సంఖ్యను పెంచుకుంది. మిగిలిన అన్ని దక్షిణాది రాష్ట్రాల్లోనూ దాని ఓట్ల శాతం గణనీయంగా పెరిగింది. ఇది ప్రజాస్వామ్య వాదులకు పెద్ద హెచ్చరిక.

అందువల్ల 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి బలం తగ్గినప్పటికీ దేశానికి దాని నిరంకుశ, ఫాసిస్టు ప్రమాదం మాత్రం తగ్గలేదు. అమిత్ షా మళ్లీ హోమ్ మంత్రి అయ్యారంటే అర్థం కేంద్ర సంస్థలను గతంలో లాగే దుర్వినియోగం చేసి నిరంకుశాధికారాలను చెలాయిస్తారని. మళ్లీ ఆర్థిక మంత్రిగా ప్రమాణం చేసిన నిర్మలా సీతారామన్ వినాశనకరమైన ఆర్థిక సంస్కరణలను, ప్రయివేటీ కరణ విధానాలను కొనసాగిస్తామని ప్రకటించారు. కేంద్రంలోనిది ఎన్డీఏ ప్రభుత్వమే అయినప్పటికీ ముఖ్యమైన శాఖలన్నీ బిజెపి చేతుల్లోనే ఉన్నాయి. అందువల్ల కొత్త మంత్రివర్గం ఆర్ఎస్ఎస్ ఎజెండా నుండి వెనక్కు తగ్గుతుందనుకుంటే పొరపాటే అవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు ఎజెండాకు వ్యతిరేకంగా ఇండియా కూటమి పక్షాలు మరింత ఐక్యంగా, మరింత చురుకుగా ప్రజలను సమీకరించాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో వామపక్షాల బలం కొద్దిగా పెరిగినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదు. అయినప్పటికీ మారిన పరిస్థితుల్లో అవి మరింత చురుకుగా పోరాటాలు నిర్మించడానికి అవకాశాలు ఏర్పడ్డాయి.

రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యం, ఫెడరలిజం వంటి విస్తృత అంశాల్లో 'ఇండియా' కూటమి, ఐక్య ప్రతిపక్షం మరింత పెద్ద పాత్ర నిర్వహించాల్సి ఉంది. అదే సమయంలో వామపక్షాలు ప్రజలను దైనందిన సమస్యలపై పోరాటాల్లోకి కదిలిస్తూ ఈ పోరాటాలను నయాఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలతో లింకు చేయాల్సి ఉంది. ఆ విధంగా చేయడం ద్వారానే 2024 న్నికల ఫలితాలు సమకూర్చిన రాజకీయ అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు పురోగమించగలం.

**ఈ మాసం ముఖ్యాంశం**

# 2024 సార్వత్రిక ఎన్నికలు: మోడీ నిరంకుశత్వానికి ప్రజా తిరస్కరణ



రచయిత ప్రముఖ జర్నలిస్టు

**నిరుపమా సుబ్రమణియన్**

ఎన్నికలలో పోటి చేసిన ఏ పార్టీ స్పష్టమైన మెజారిటీని సాధించలేని ఎన్నికలను సాధారణంగా దృఢమైన తీర్పు ఇచ్చిన ఎన్నికలుగా పరిగణించరు. కాని ఇవి సాధారణమైన ఎన్నికలు కాదు. భారతదేశ ప్రజాస్వామిక హృదయం, ఆత్మను కాపాడటం కోసం జరిగిన ఎన్నికలు ఇవి. ఈ దృక్పథంతో చూసినపుడు 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికలు బిజెపిని మెజారిటీకి దూరంలో ఉంచటం ద్వారా ఆ పార్టీపై తమ వ్యతిరేకతను గట్టిగా చెప్పారు. పెరుగుతున్న నరేంద్ర మోడి నిర్వంకుశత్వాన్ని నిర్ద్వందంగా తిరస్కరించటం, మోడి–అమిత్‌షా ఇద్దరు నడిపే ప్రభుత్వాన్ని, వారి విచ్ఛిన్నకర రాజకీయాలను, సమాఖ్య వ్యతిరేక విధానాలను, సామాన్య ప్రజల జీవితాలను మెరుగు చేయకుండా అస్మదీయ పెట్టుబడిదారుల జేబులను నింపే "అభివృద్ధి" భావనను దృఢంగా తిరస్కరించారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో మరింత సమ్మిళితంగా వ్యవహరించే, మరింత ఎక్కువగా సంప్రదింపులు జరిపే ప్రభుత్వం కోసం, రాజ్యాంగం పవిత్రతను, అందులో ప్రజలకు కల్పించిన రక్షణలను కాపాడే ప్రభుత్వం కావాలన్న బలమైన కాంక్షతో ఓటు వేశారు.

అటల్ బిహారి వాజ్‌పాయ్ 2004లో ఊహించని విధంగా ఓడిపోయిన సందర్భంతో మోడి ఓటమిని కొందరు పోలుస్తున్నారు. కాని అంతకన్నా ఇంకా ముందుకుపోయి, 1977 ఎన్నికలతో పోల్చటం మరింత సమంజసంగా ఉంటుంది. అధికార కేంద్రీకరణ, సైనిక పాలనలో ఉన్న విధంగా ప్రజలపై నిఘా, అధికారంలో ఉన్నవారు భయపడటం, రాజకీయ ప్రత్యర్థులు, ప్రభుత్వాన్ని వ్యతిరేకించేవారిపై నిర్బంధాన్ని ప్రయోగించటం, మీడియాను ఉపయోగించుకోవటం తదితర విధానాల వలన గత 10 సంవత్సరాల పాలనను 1975–77 సంవత్సరాల మధ్య అమలు జరిగిన ఎమర్జెన్సితో పోలుస్తున్నారు. అందువలననే అత్యవసర పరిస్థితిని విధించినందుకు 1977లో జరిగిన ఎన్నికలలో ఇందిరాగాంధిని శిక్షించిన విధంగానే మోడిని శిక్షిస్తూ ఇచ్చిన ఈ తీర్పు చారిత్రాత్మకమైనది.

ఇందిరాగాంధిని అధికారం నుండి తొలగించిన విధంగా మోడిని అధికారం నుండి తొలగించలేదు. 240 స్థానాలలో గెలిచిన బిజెపి ఇప్పటికీ అతి పెద్ద పార్టిగానే ఉంది. కొన్ని పాత ప్రాంతాలలో ఓడిపోయినప్పటికీ కొత్తచోట్ల కొన్ని విజయాలు సాధించింది. గతంలో ఆ పార్టికి 37.3 శాతం ఓట్లు రాగా, ఇప్పుడు 0.73 శాతం ఓట్లను మాత్రమే కోల్పోయి, 36.57 శాతం ఓట్లు తెచ్చుకున్నది. తెలుగుదేశం, జనతాదళ్(యు), శివసేన, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, జనసేన, జనతాదళ్(ఎస్), లోక్ జనశక్తిపార్టీ (రామ్ విలాస్ పాశ్వాన్), ఇతర చిన్నపార్టిలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నది. ఈ పార్టీలన్నింటికీ కలిపి పార్లమెంటులో 293 స్థానాలు ఉన్నాయి.

### బిజెపి శక్తిని తగ్గించిన అంశాలు

బిజెపి గెలుపు వేరే విషయం. కాని ఆ పార్టీ పెట్టుకున్న టార్గెట్లు, మోడి బ్రాండ్‌ను ఓడించలేరని స్వంతడబ్బా కొట్టుకోవటం తదితరాలు దాని ఓటమి ప్రాధాన్యతను వెల్లడిస్తున్నాయి. వారు "ఈసారి 400 స్థానాలు దాటుతాం", "మోడి గ్యారంటి" లాంటి నినాదాలు ఇచ్చినా 543 మంది సభ్యులున్న సభలో బిజెపి సగం స్థానాలను–272– దాటలేకపోవటం గెలుపు, ఓటములకు కొత్త అర్థాలను ఇస్తున్నది.

ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్దిగంటలలోనే" ఎన్‌డిఎకు మూడవసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే చారిత్రాత్మక అవకాశాన్ని ఇచ్చారని" మోడి ప్రకటించారు. భారతదేశ చరిత్రలో ఒక నాయకుడు వరుసగా మూడవసారి ప్రధానిగా కొనసాగటం ఇది రెండవసారి మాత్రమే. 1962లో మూడవసారి ప్రధానిగా కొనసాగిన జవహర్‌లాల్ నెహ్రూ మొదటివాడు. మోడి నెహ్రూతో సమానమయ్యారు. కాని తన కూటమిలోని పార్టీల దయాదాక్షిణ్యాలతో మాత్రమే మూడవసారి కొనసాగనున్నారు. భారతదేశ ప్రథమ ప్రధాని 1962లో సాధించిన పెద్ద మెజారిటీతో దీనికి పోలికే లేదు. న్యూఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో లాంఛనంగా మాత్రమే సంబరాలు జరిగాయి. 2002లో గుజరాత్ ముఖ్యమంత్రి అయినప్పటి నుండి మెజారిటీ సాధించలేని షాక్‌లో ఉన్న మోడి "ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసినా బిజెపి గెలిచినన్ని స్థానాలలో విజయం సాధించలేదు" అని చెప్పారు. కానీ ఏ మాత్రం సంతోషం లేని బిజెపి అధ్యక్షుడు నడ్డా, హోంమంత్రి అమిత్‌షాల మొహాలు వాస్తవాలను వెల్లడిస్తున్నాయి. 2019లో 303 స్థానాలు గెలుచుకున్న బిజెపి పరిమాణాన్ని ఓటర్లు తగ్గించారు.

బిజెపికి తగ్గిన సీట్ల వివరాలు పరిశీలిస్తే అవి మోడి ప్రతిష్ఠను మరింత దెబ్బతీసేవిగా ఉన్నాయి. ఢిల్లీలో అధికారానికి

ఉత్తరప్రదేశ్ మీదుగా వెళ్ళాలని వారు చెబుతారు. అఖిలేశ్ యాదవ్ నాయకత్వం లోని సమాజ్‌వాది పార్టీ బిజెపి కోటగా ఉన్న ఉత్తరప్రదేశ్‌పై చేసిన దాడి ఇండియా కూటమి ఆ రాష్ట్రంలో 43 స్థానాలలో ఉత్తేజకరమైన విజయం సాధించటానికి దోహదం చేసింది. 2019లో 5 స్థానాలలో విజయం సాధించిన సమాజ్‌వాది పార్టీ ఇపుడు 37 స్థానాలలో విజయం సాధించగా, అపుడు ఒకస్థానం మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీ 6 స్థానాలలో విజయం సాధించింది. బిజెపి 2019లో సాధించిన వాటి కన్నా 29 స్థానాలు తక్కువ గెలిచింది. యుపిలో తిన్న ఈ దెబ్బతో ఢిల్లీలో ఆ పార్టీ శక్తి మరింతగా దిగజారిపోతుంది.

> ❝ అయోధ్య ఉన్న ఫైజాబాద్ నియోజక వర్గంలో రామ మందిరాన్ని ప్రారంభించి, రామరాజ్యంలోకి ప్రవేశించామని ప్రచారం చేసిన మోడిని ఈ పరిణామాలు మానసికంగా కుంగిపోయేలా చేశాయి. ఇక్కడ సమాజ్‌వాది పార్టీ తరపున పోటి చేసిన దళిత అభ్యర్థి అవదేశ్ ప్రసాద్ చేతిలో బిజెపి ఎంపి లల్లూసింగ్ 54,000 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. ❞

అయోధ్య ఉన్న ఫైజాబాద్ నియోజక వర్గంలో రామ మందిరాన్ని ప్రారంభించి, రామరాజ్యంలోకి ప్రవేశించా మని ప్రచారం చేసిన మోడిని ఈ పరిణా మాలు మానసికంగా కుంగిపోయేలా చేశాయి. ఎల్‌కె అద్వాని నాయకత్వంలో 1992లో హిందుత్వ కరసేవకులు కూల్చివేసిన 16వ శతాబ్దంనాటి బాబ్రిమసీదు స్థలంలోనే రామ మందిరాన్ని నిర్మిస్తామన్న వాగ్దానం అనేక దశాబ్దాల నుండి బిజెపి రాజకీయాలకు కేంద్రస్థానంలో ఉంది. ఇక్కడ సమాజ్‌వాది పార్టీ తరపున పోటి చేసిన దళిత అభ్యర్థి అవదేశ్ ప్రసాద్ చేతిలో బిజెపి ఎం పి లల్లూసింగ్ 54,000 ఓట్ల తేడాతో ఓడిపోయాడు. బిజెపికి బలమైన స్థావరంగా ఉన్న యుపిలో 2019లో ఆ పార్టీకి 52.8 శాతం ఓట్లు రాగా, ఈ ఎన్నికలలో 9 శాతం కోల్పోయింది. అక్కడికి 100 కిలోమీటర్ల దూరంలో, కాంగ్రెస్ జేబులో ఉన్న స్థానంగా భావిస్తున్న అమేథిలో 2019లో స్మృతి ఇరాని రాహుల్ గాంధిపై గెలిచి, గొప్ప నాయకురాలినని ప్రచారం చేసుకున్నారు. ఆ నియోజకవర్గానికి బయట ఎవరికీ తెలియని, కాంగ్రెస్‌కు అత్యంత విధేయుడైన కెఎల్ శర్మ చేతిలో ఈ ఎన్నికలలో ఆమె ఓడిపోయారు. దీనితో పాటు వారణాసి స్థానంలో చివరికి 1.5 లక్షల మెజారిటీతో గెలవటానికి ముందు మోడి మొదట కొన్ని రౌండ్లలో తన ప్రత్యర్థి కన్నా వెనుకబడ్డారు.




పశ్చిమబెంగాల్‌లో మోడి, షాలు అన్ని రకాలైన ప్రయత్నాలు చేశారు. అక్కడ పెద్ద విజయాలు సాధిస్తామనే నమ్మకంతో ఉన్నారు. మమతా బెనర్జి వారిని నిలువరించింది. తృణమూల్ కాంగ్రెస్ 2019 కన్నా 7 స్థానాలు అధికంగా గెలుచుకొని, మొత్తం 29 స్థానాలలో విజయం సాధించగా, బిజెపి 2019లో గెలిచిన 18 స్థానాలలో ఆరింటిని కోల్పోయి, 12 స్థానాలకే పరిమితమైంది.

### ఇండియా కూటమిదే నిజమైన గెలుపు

ఒడిశాలో తమకు ఏ మాత్రం అర్హత లేని విజయం సాధించిన మోడి, ఆయన సహచరులు సంబరాలు చేసుకుంటున్నారు. వృద్ధుడైన బిజు పట్నాయక్ కోటను బద్దలు కొట్టిన బిజెపి ఆ రాష్ట్రంలోని 21 స్థానాలలో 20 గెలిచింది. పావు శతాబ్దం పాటు ఆధిపత్యం చెలాయించిన బిజు జనతాదళ్ ఒక్కస్థానంలో కూడా గెలవలేదు. కాంగ్రెస్ ఒక స్థానంలో విజయం సాధించింది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 29 స్థానాలలో బిజెపి విజయం సాధించింది. అందుకు అవసరమైన కృషి చేసిన శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను 2023 అసెంబ్లి ఎన్నికలలో

**❝ ఇండియా కూటమి 234 స్థానాలు సాధించి ఓటమి పాలైంది. కాని అది సాధించిన కొన్ని విజయాలు దానిని నిజమైన విజేతగా నిలబెడుతున్నాయి. 2014 తర్వాత భారత దేశంలో బలమైన పార్లమెంటరీ ప్రతిపక్షం ఉండటం అన్నింటి కన్నా ప్రధానమైనది. బిజెపికి ధనబలం, దౌర్జన్యాలు చేసే అనుచరులు ఉన్నప్పటికీ దానిని ఓడించగలం అని రుజువు చేశారు. తమ చేతులలో ఒకదానిని వెనుక కట్టివేసినట్లు చేసినప్పటికీ వారు దీనిని సాధించారు. ❞**

విజయం సాధించిన తర్వాత హఠాత్తుగా పక్కన పెట్టారు. విదీశ స్థానాన్ని 8.2 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొంది, చౌహాన్ తన ప్రాభవాన్ని చాటుకున్నాడు. దానితో మోడి ప్రభ మరింతగా మసకబారింది.

ఇండియా కూటమి 234 స్థానాలు సాధించి ఓటమిపాలైంది. కాని అది సాధించిన కొన్ని విజయాలు దానిని నిజమైన విజేతగా నిలబెడుతున్నాయి. 2014 తర్వాత భారతదేశంలో బలమైన పార్లమెంటరీ ప్రతిపక్షం ఉండటం అన్నింటి కన్నా ప్రధానమైనది. బిజెపికి ధనబలం, దౌర్జన్యాలు చేసే అనుచరులు ఉన్నప్పటికీ దానిని ఓడించగలం అని రుజువు చేశారు. తమ చేతులలో ఒకదానిని వెనుక కట్టివేసినట్లు చేసినప్పటికీ వారు దీనిని సాధించారు. కూటమిలోని పార్టీలకు చెందిన ఇద్దరు ముఖ్యమంత్రులు–ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్–లపై కుంభకోణాలకు పాల్పడ్డారనే ఆరోపణలు చేసి, ఎన్నికలకు కొద్దిరోజులకు ముందు జైలులో నిర్బంధించారు.

మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సిపిలలో బిజెపి చీలికలు తీసుకొచ్చింది. ఉద్ధవ్ థాకరే, శరద్‌పవార్‌లు తమ పార్టీల ఎన్నికల గుర్తులను కూడా దక్కించుకోలేకపోయారు. ఇండియా కూటమికి కన్వీనర్‌గా ఉన్న జెడి(యు) నాయకుడు నితీశ్‌కుమార్ ఎన్నికలకు ముందు బిజెపి వైపుకు ఫిరాయించి, ప్రతిపక్ష కూటమిని నైతికంగా దెబ్బతీశాడు. ప్రతిపక్ష కూటమిని భయపెట్టటానికి, గందరగోళంలో ముంచటానికి ఐటి, ఇడి, సిబిఐ వంటి వాటిని నిరంతరం ఉపయోగించారు. ఐటి అధికారులు కాంగ్రెస్ పార్టీ నిధులను స్థంభింపజేశారు. సుప్రీంకోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేసిన తర్వాత మాత్రమే నిధులను విడుదల చేశారు. గొప్పదేశమైన భారతదేశ ఎన్నికలలో రిఫరీగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ మోడి, షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాద్‌లు ఎన్నికల నిబంధనలను, భారత శిక్షాస్మృతిని ఉల్లంఘించి, ముస్లింలపై వ్యతిరేకతను రెచ్చగొట్టటమే లక్ష్యంగా ప్రచారం చేసినప్పటికీ, వారిపై చర్య తీసుకోవటంలో విఫలమై అచేతనంగా ఉండిపోయింది.

మోడి కోసం, అధికార పార్టీ కోసం మాత్రమే ప్రచారం చేసే బాకాలుగా టివి ఛానళ్ళు పనిచేశాయి. ప్రతిపక్ష పార్టీలకు కొద్దిగా చోటిచ్చాయి లేదా ప్రతికూలంగా ప్రచారం చేశాయి. ఇండియా కూటమిలోని పార్టీలు–కాంగ్రెస్, డిఎంకె, శివసేన(ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే), ఎన్‌సిపి (శరద్‌చంద్రపవార్), సిపిఐ(ఎం), ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఆర్‌జెడి–ఈ ఆటంకాలను అధిగమించి మంచి విజయాలను సాధించాయి.

కాంగ్రెస్ పార్లమెంటు స్థానాలు 52 నుండి 99కి పెరిగాయి. రాహుల్‌గాంధీని బఫూనంటూ ముద్ర వేయటానికి బిజెపి దశాబ్దం నుండి ప్రయత్నం చేస్తున్నది. రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే బిజెపి వ్యతిరేక పోరాటాన్ని శక్తివంతంగా ప్రజలలోకి తీసుకుపోయారు. రాజ్యాంగాన్ని, సామాజిక న్యాయాన్ని రక్షించుకోవటం గురించి నొక్కి చెబుతూ, ప్రజలను ఒప్పించే విధంగా ప్రచారం చేశారు. ఇండియా కూటమిలోని నాయకులతో సమైక్యంగా పనిచేయటానికి వీలైన విధంగా చర్చలు చేశారు. రాహుల్‌గాంధీ భారత్ జోడోయాత్ర, న్యాయ్‌యాత్రలు ఎన్‌జివో టైపు యాత్రలని, అవి ఎన్నికలలో విజయం సాధించాల్సిన కృషి నుండి పార్టీని పక్కదారి పట్టిస్తాయని విమర్శకులు విమర్శించినప్పటికీ, పార్టీని ప్రజలతో పున:సంధానం చేయటంలో విజయం సాధించాయి.

**ప్రజల అవసరాలను తీర్చటం**

బిజెపికి ఆధిక్యం ఉన్న ఉత్తరాదిలోని హిందిప్రాంతం, దక్షిణాది రాష్ట్రాలలో ప్రతిపక్షాలకు స్థానాలు వచ్చాయి. కాంగ్రెస్ కర్ణాటకలో గౌరవప్రదమైన స్థాయిలో తొమ్మిది

---

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

స్థానాలలో గెలిచింది. 2019 నాటికన్నా ఎనిమిది స్థానాలు ఎక్కువ గెలిచింది. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్‌సిపి, శివసేన (యుబిటి)తో కూడిన మహా వికాస్ ఆఘాడి బిజెపి, దాని మిత్రుల-ఏక్‌నాథ్‌షిండే శివసేన, అజిత్‌పవార్ ఎన్‌సిపి-ను తుడిచిపెట్టింది. పార్టీలను(కుటుంబాలను) చీల్చే, బలవంతంగా ఫిరాయింపులు చేయించే బిజెపి విధానాలను ఓటర్లు ఆమోదించటం లేదని ఇపుడు స్పష్టమౌతున్నది. ఎంవిఎ 30 స్థానాలలో విజయం సాధించగా, అందులో కాంగ్రెస్ 13 స్థానాలలో గెలిచింది. అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ బారామతి నియోజకవర్గంలో లక్షకు పైగా ఓట్ల తేడాతో సుప్రియా సూలే చేతిలో ఓడిపోవటం ఆయనకు పెద్ద దెబ్బగా పరిణమించింది. ఆ పార్టీ నాలుగు స్థానాలకు పోటీచేయగా ఒక్కస్థానంలో మాత్రమే విజయం సాధించింది. ముఖ్యమంత్రి షిండే శివసేన 15 స్థానాలలో పోటీ చేయగా 7 స్థానాలలో విజయం సాధించింది.

తమిళనాడులోని 39, పుదుచ్చేరితో కలిపి 40 స్థానాలను గెలిచి, డిఎంకె, దాని మిత్రులు తమ కోటను కాపాడుకున్నారు. ఎఐఎడిఎంకె రెండవసారి ఒక్కస్థానం కూడా గెలవలేదు. మూర్ఖంగా వ్యవహరించే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె అన్నామలై తమ పార్టీ మూడు లేక నాలుగు స్థానాలను, 20 శాతం ఓట్లను గెలుస్తుందన్న ప్రచారం హోరెత్తించినప్పటికీ ఒక్కస్థానం కూడా గెలవలేదు. 2019 ఎన్నికలలో ఐదు స్థానాలలో పోటీ చేసిన బిజెపి 3.66 శాతం ఓట్లు పొందగా, 2024లో 23 స్థానాలలో పోటీచేసి,11.26 శాతానికి ఓట్లను పెంచుకుంది.

కాశ్మీర్‌లో బిజెపికి వ్యతిరేకంగా ఓట్లు వేశారని స్పష్టంగా కనిపిస్తున్నది. బిజెపికి అనుకూలంగా ఉన్నాయని భావించిన పార్టీలకు మంచి ఫలితాలు రాలేదు. గతంలో బిజెపితో మిత్రుత్వం నెరపిన కారణంగా పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాలు కూడా ఓడిపోయారు. ఇండియా కూటమిలో భాగంగా రెండు స్థానాలలో నేషనల్ కాన్ఫరెన్స్ విజయం సాధించినప్పటికీ, పిడిపి ఒక్క స్థానాన్ని కూడా గెలవలేదు. స్వతంత్రంగా రాజకీయాలలో పాల్గొంటూ 2019 నుండి జైలులో ఉన్న ఇంజనీర్ రషీద్ తాను గెలిస్తే స్వేచ్ఛను పొందుతాననే ఒకే అంశంపై ప్రచారం చేసి, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాను ఓడించాడు.

> **❝ ప్రజల నిత్యజీవితంలోని సమస్యలు హిందుత్వపై పైచేయి సాధించాయి. బిజెపి అతి విశ్వాసంతో దిగువస్థాయిలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరించింది. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం ద్వారా 80 కోట్లమందికి నెలకు 5 కిలోల చొప్పున ఇస్తున్న ఉచిత రేషన్ పథకం ఎన్నికలలో ఎదురులేని అస్త్రంగా పనిచేస్తుందని బిజెపి భావించింది. తాము బతకడం కోసం ఈ రేషన్‌పైనే ఆధారపడుతున్న కొందరి దుస్థితిని, ఆర్థికంగా వారి నిరాశను ఇది వ్యక్తం చేసింది. ❞**

ప్రజల నిత్యజీవితంలోని సమస్యలు హిందుత్వపై పైచేయి సాధించాయి. బిజెపి అతి విశ్వాసంతో దిగువస్థాయిలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరించిందని అనిపిస్తున్నది. కోవిడ్ సమయంలో ప్రవేశపెట్టి, 2023 నవంబర్‌లో మరో ఐదు సంవత్సరాలపాటు పొడిగించిన ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం ద్వారా 80 కోట్లమందికి నెలకు 5 కిలోల చొప్పున ఇస్తున్న ఉచిత రేషన్ పథకం ఎన్నికలలో ఎదురులేని అస్త్రంగా పనిచేస్తుందని బిజెపి భావించింది. తాము బతికి ఉండటం కోసం ఈ రేషన్‌పైనే ఆధారపడుతున్న కొందరి దుస్థితిని, ఆర్థికంగా వారి నిరాశను ఇది వ్యక్తం చేసింది. ప్రభుత్వం ప్రచారం చేస్తున్న "సమ్మిళిత అభివృద్ధి" దరిద్రాన్ని ఐదుశాతం కన్నా దిగువకు తగ్గించిందని, దాని ఇతర విధానాలు 125 కోట్లమందిని "బహువిధాలైన దరిద్రం" నుండి బయటపడవేశాయని బిజెపి భావించింది. భారత్‌లో చివరి సారిగా 2011-12లో ఖర్చు, వినియోగంలపై ఆధారపడిన జనాభా లెక్కలు జరగడం వలన వాస్తవంగా దేశంలో ఎంతమంది పేదలున్నారన్న అంశం స్పష్టంగా తెలియటం లేదు. అంకెలంటే ప్రభుత్వానికి ఉన్న భయం దశాబ్దానికొకసారి జరుగుతున్న జనాభా లెక్కలను వాయిదా వేయటానికి కూడా దారి తీయవచ్చు.

సెంటర్ ఫర్ డెవలపింగ్ సొసైటీస్-సిఎస్‌డిఎస్-లోక్‌నీతి సంస్థలు ఎన్నికల అనంతరం జరిపిన సర్వేలో 40 శాతం మంది మాత్రమే గత ఐదు సంవత్సరాలలో తమ ఆర్థిక పరిస్థితి మెరుగైనట్లు చెప్పారు. మిగతా వారి పరిస్థితి యథాతథంగా ఉండటం లేదా దిగజారిందని వెల్లడించారు. వారు ప్రతిపక్షాలకు ఓట్లు వేయటానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. నిరుద్యోగ సమస్య పట్ల ఏ మాత్రం లెక్క లేకుండా వ్యవహరించిన మోడి ప్రభుత్వం పట్ల ఆగ్రహం కూడా కనిపిస్తున్నది. ప్రభుత్వం స్వయం ఉపాధిని చూసుకోమని చెప్పటం, మహిళలకు తక్కువ ఇవ్వటం లేక అసలు ఇవ్వకపోవటం వారి జీవితాలను అభివృద్ధి చేయటానికి దోహదం చేయలేదు. మిలిటరీ లో చేరటం స్థిరమైన ఉద్యోగంతో పాటు హోదాగా కూడా తరతరాల నుండి పరిగణిస్తున్న ఉత్తరాదిలోని కొన్ని ప్రాంతాల వారికి అగ్నిపథ్ పథకం, కాంట్రాక్టు విధానంతో సైన్యంలో పనిచేయవలసి రావటం నిరాశను కలిగించాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలలో తక్కువ కాలం కాంట్రాక్టుకు పని చేయటం, అతి కొద్దిగా ప్రకటిస్తున్న ఉద్యోగా లకు అడ్మిషన్ పరీక్షలకు ముందు ప్రశ్నా పత్రాలు లీకవటం ప్రజల కోపాగ్నిని పెంచాయి.

హింది ప్రాంతంలో ప్రజలలో ఉన్న అభద్రత రాజ్యాంగాన్ని మార్చటం కోసం 400 కు పైగా స్థానాలతో మూడవ సారి మోడి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి దారితీస్తుందని కొందరు బిజెపి నాయకులు గొప్పగా చెప్పారు. అది ఆ పార్టీకి అతిపెద్ద స్వయం వినాశకర అంశంగా మారింది. ఇండియా కూటమి వేగంగా స్పందించి, బిజెపికి వ్యతిరేకంగా దీనిని తమ ప్రధాన ప్రచారాస్త్రంగా చేసుకుంది. రాజ్యంగ లౌకిక స్వభావాన్ని మార్చటం మాత్రమే కాక, రాజ్యాంగంలో గ్యారంటీ చేసిన రిజర్వేషన్లను కూడా రద్దు చేయటం బిజెపి పథకంలో భాగమని చేసిన ప్రచారం బిజెపిని తేరుకోకుండా చేసింది. ఆ పార్టీ ఏనాడూ లేనంతటి ఆత్మరక్షణలో పడిపోయింది.

**సమాజ్‌వాది పార్టీ**

ఇండియా కూటమి బాగా పనిచేసిన దానిలో మరొక ప్రధానాంశం బిజెపి,

**(మిగతా 34వ పేజీలో)**

సాంస్కృతిక రంగం

# సాంస్కృతిక రంగంలో ప్రత్యామ్నాయ కృషి

**సాంస్కృతిక రంగంలో పార్టీ అవగాహన కోసం ఇటీవల విజయవాడలో జరిగిన సదస్సులో సమర్పించబడిన పత్రాల్లో కొన్నిటిని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం**

**1. పాలక వర్గాల భావజాలపు ఆధిపత్యం:**

వర్గాలుగా చీలిపోయిన సమాజంలో పాలకవర్గ భావాలే ఆధిపత్య భావాలుగా, సమాజం మొత్తానికి చెందిన భావాలుగా చెలామణీ అవుతాయి. అందుచేత సాంస్కృతిక రంగంలో, ప్రజల అనుదిన జీవన విధానంలో వ్యాపించివుండే భావాలు, విలువలు ఎక్కువ భాగం పాలకవర్గ విలువలే, పాలకవర్గ భావాలే. సమాజంలో ఆధిపత్య సంస్కృతిదే అత్యధిక భాగం. దీనికి ప్రత్యామ్నాయం కాదగ్గ భావాలు, విలువలు అక్కడక్కడ వ్యక్తం అవుతూవుంటాయి. అవి కలగాపులగంగా కలిసిపోయివుంటాయి.

సామ్రాజ్యవాదం, పాలకవర్గాలు సంస్కృతి యావత్తూ ఒక్కటే అనే భావాన్ని కల్పిస్తాయి. తమ భావాలే విశ్వజనీనమైనవి అనిపించేలా చేస్తాయి. మనం ఆ వుచ్చులో పడిపోకూడదు.

కొన్ని ఆదర్శాల, భావాల సారాంశం ఆయా సందర్భాలను బట్టి మారుతూ వుంటుంది. ఉదా: ప్రజాస్వామ్యం. ఇదేమీ సార్వజనీన విలువ కాదు. ప్రపంచీకరణ కాలంలో పెట్టుబడిదారులకు ప్రపంచవ్యాప్త స్వేచ్ఛ కావాలి. అందుకు ఆటంకం కార్మికవర్గ సంఘటిత శక్తి, దాని పోరాటాలు, అందుచేత కార్మికవర్గ సమ్మెలు అప్రజాస్వామికం అని మీడియా గోల చేస్తుంది. అదే ప్రజాస్వామ్య భావన ఇదే పెట్టుబడిదారీ వర్గం చేతుల్లో ఫ్యూడల్ వ్యవస్థను కూలదోసే బూర్జువా విప్లవాలలో ఒక పురోగమన పాత్ర పోషించింది. 'భిన్నత్వం లో ఏకత్వం' అనే భావన కూడా అటువంటిదే. హిందూత్వ-కార్పొరేట్ ఆధిపత్యం మీద పోరాటంలో దీనిని ఒక సానుకూల అర్థంలో మనం వాడుతున్నాం. కాని అది ఒక శాశ్వతమైన విలువ కాదు. ఇప్పుడు ఉన్న భిన్నత్వంలో అంతర్లీనంగా అణచివేత, వివక్షత ఉన్నాయి. అవి అదే మాదిరిగా ఎల్లకాలమూ కొనసాగాలని మనం అనుకోము కదా. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్ర విజ్ఞానం పట్ల మన దృక్పథం కూడా అన్ని సందర్భాలలోనూ ఒకే విధంగా ఉండాలని భావించలేము. కొన్ని రకాల సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టం -దని ఉద్యమాలు కూడా జరువుతాం. 'కాలుష్యం' వంటివి వర్గాతీతంగా చూడవలసినవి కావు. స్వచ్ఛభారత్ నినాదం బహుళజాతి కంపెనీల హానికర కాలుష్యాన్ని కప్పిపుచ్చే నినాదం.

**2 సారం-రూపం**

ఆధిపత్య సంస్కృతి రూపానికి ప్రాధాన్యతనిస్తుంది. వ్యవస్థ మారినా సంస్కృతి రూపాలు కొనసాగుతాయి. వాటి మాటున పాలకవర్గాలు తమ వర్గ ఆధిపత్య సారాన్ని కప్పిపుచ్చుతాయి. ఉదా: అవినీతి అనేది ఏ సమాజంలోనైనా వ్యతిరేకించవలసినదే. కాని సమాజంలోని సమస్యలన్నింటికీ అవినీతే మూలం అయినట్టు 'భారతీయుడు' చిత్రం చూపిస్తుంది. దానిని నిర్మూలించితే అన్ని సమస్యలూ తీరిపోతాయని నమ్మిస్తుంది. సమస్యలకు మూలం అయిన వర్గ దోపిడీని కప్పిపుచ్చుతుంది. సమాజ సమస్యలకి మూలం చెడ్డ నాయకులేనని వారి స్థానంలో మంచి నాయకులొస్తే దేశం బాగుపడిపోతుందని చెప్పే సినిమాలు చాలానే వచ్చాయి. సమర్థుడైన పోలీస్ అధికారి దుర్మార్గాన్ని అంతం చేయగలడని, ఫ్యాక్షనిస్టులలో పేదలకు అనుకూలంగా ఉండేవారికి, పేదలకు అన్యాయం చేసేవారికి మధ్య ఘర్షణ జరుగుతుందని, మనం పేదల పక్షాన ఉండే ఫ్యాక్షనిస్టులను బలపరచాలని - ఇలా ఉంటాయి ఆ రూపాలు.

విదేశీ సంస్కృతి అంతా చెత్త అనో, స్వదేశీ సంస్కృతి అంతా బంగారం అనో చర్చ జరుగుతూ వుంటుంది. కాని సంస్కృతి లో విదేశీ, స్వదేశీ అనేవి కలగలిసిపోయే ఉంటాయి. వాటి రూపాలను బట్టి వివాదాలలోకి జారిపోవడం గాక, వాటి వర్గసారాన్ని బట్టి మన వైఖరి ఉండాలి. ఉదా: బ్రేక్ డాన్స్, పాప్ సంగీతం, భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం వంటివి వివిధ రూపాలు మాత్రమే. ఆ రూపాలను ఉపయోగించి ప్రజలకు అందించే భావజాలం స్వభావం ముఖ్యం.

కళారూపంలో రూపానికి, సారానికి మధ్య సమతుల్యత ఉండడం చాలా అవసరం. రూపం తగిన నాణ్యత కలిగివుండకపోతే ఎంత మంచి సారాన్ని చెప్పినా, జనం స్వీకరించరు. అదే సమయంలో రూపానికి అతిగా ప్రాధాన్యతనిచ్చి సారాన్ని విస్మరించితే ఆ కళారూపానికి ప్రయోజనమే ఉండదు.

కళారూపాలను రూపొందించడంలో మన పాత్ర ఉండాలి. ప్రత్యామ్నాయ భావజాలాన్ని బలంగా వాటిద్వారా తీసుకుపోగలుగుతాం. ప్రస్తుత పరిస్థితుల్లో లౌకిక భావాలు, ప్రజాస్వామిక విలువలు, సామాజిక వివక్ష సమస్యలు, పురుషాధిక్య భావజాలంతో ముడివడ్డ సమస్యలు, వినిమయతత్వం, వ్యక్తివాదంతో వచ్చే పర్యవసానాలు, స్వావలంబన ప్రాధాన్యత వంటి అంశాలు మన కళారూపాలలో వ్యక్తం కావాలి.

అభ్యుదయ భావాలను కలిగివుండే కళారూపాలను రూపొందించేవారు మన ఉద్యమ ప్రభావానికి వెలుపల చాలామందే ఉన్నారు. కమ్యూనిస్టు భావజాలంతో వారు ఏకీభవించకపోవచ్చు. కాని చాలా విషయాల్లో భావసారూప్యత కలవారు ఉన్నారు. వారందరినీ మనం భాగస్వాముల్ని చేయాలి.

**3. సాంస్కృతిక విమర్శ :**

సాంస్కృతికరంగంలో మనం జరిపే వర్గపోరాట లక్ష్యం ప్రజాసంస్కృతిని ఆధిపత్యస్థాయికి తీసుకురావడమే. ఈ కృషిలో ఒక ప్రధాన భాగం సాంస్కృతిక విమర్శ. పెట్టుబడిదారీ వ్యవస్థలోపలే మనం ప్రజా సంస్కృతిని ప్రధానరూపంగా చేయలేకపోవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థను బద్దలుకొట్టి ప్రజలందరినీ సమీకరించేకొద్దీ ప్రత్యామ్నాయాలు బలపడుకుంటూవస్తాయి. ఆ రకంగా పెట్టుబడిదారీ విధానాన్ని, దాని సంస్కృతిని బలహీనం చేయాలంటే ఆ సంస్కృతిని ఎండగట్టి, దానిలోని మంచి అంశాలేమైనా ఉంటే వాటిని బయటకు తీసేందుకు ప్రయత్నం చేయాలి. సాహిత్యం, సినిమాలు, నాటకాలు, పెళ్ళి, తంతులు– అన్నింటిపై విమర్శ ఉండాలి. మాటలద్వారా, రాతలద్వారా మాత్రమే కాదు, ప్రత్యామ్నాయ రూపాల సృష్టి ద్వారా కూడా విమర్శ చేయవచ్చు. ఉదాహరణకు: ప్రత్యామ్నాయ సినిమా తీయవచ్చు. అదే సమయంలో ప్రధానస్రవంతిగా ఉన్న సినిమాలమీద విమర్శ చాలా ముఖ్యం.

అంటే ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిపక్ష కృషిగా ప్రత్యామ్నాయ సాంస్కృతిక కృషి ఉండాలి. ఈ కృషి ద్వారా ప్రస్తుతం బలంగా ఉన్న ఆధిపత్య సాంస్కృతిక సంస్థలను బలహీనం చేయడం, బీజప్రాయంగా ఉన్న ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించుకుంటూ ముందుకు పోవడం జరగాలి. ఇందులో సమిష్టి సంస్కృతిని ప్రోత్సహించడం కూడా ఒక భాగం. ఉదా: రైతులకు, కార్మిక సంఘాలకు సహకార సొసైటీలు పెట్టడం, మనతో నిమిత్తం లేకుండానే ప్రజలు నిర్వహించుకునే సహకార కృషిలో భాగం కావడం.

సమాజంలో సాగుతున్న దోపిడీని, వివక్షతను, అణచివేతను ఎండగట్టడం, అసహనాన్ని, విద్వేషాన్ని ప్రతిఘటించడం, వినిమయతత్వాన్ని, వ్యక్తివాదాన్ని విమర్శించడం, సమిష్టి తత్వాన్ని, లౌకిక తత్వాన్ని, ప్రజాస్వామ్య విలువలను, స్వావలంబనను, వికేంద్రీకరణను బలపరచడం ప్రత్యామ్నాయ సంస్కృతి కోసం మనం జరిపే కృషి సారంగా

> **“ సాంస్కృతికరంగంలో మనం జరిపే వర్గపోరాట లక్ష్యం ప్రజాసంస్కృతిని ఆధిపత్యస్థాయికి తీసుకురావడమే. ఈ కృషిలో ఒక ప్రధాన భాగం సాంస్కృతిక విమర్శ. పెట్టుబడిదారీ వ్యవస్థ లోపలే మనం ప్రజా సంస్కృతిని ప్రధానరూపంగా చేయలేక పోవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థను బద్దలుకొట్టి ప్రజలందరినీ సమీకరించేకొద్దీ ప్రత్యామ్నాయాలు బలపడుకుంటూవస్తాయి. పెట్టుబడిదారీ విధానాన్ని, దాని సంస్కృతిని బలహీనం చేయాలంటే ఆ సంస్కృతిని ఎండగట్టి, దానిలోని మంచి అంశాలేమైనా ఉంటే వాటిని బయటకు తీసేందుకు ప్రయత్నం చేయాలి. ”**

అన్ని కళా, సాంస్కృతిక రూపాలనూ మనం ఉపయోగించాలి. వేటినీ పాలకవర్గ ఆధిపత్యానికి విడిచిపెట్టేయకూడదు. వాటిలోకి చొరబడి ప్రత్యామ్నాయ సంస్కృతిని బలపరచడానికి వాడుకోవాలి.

**4. ప్రజల భాగస్వామ్యం:**

సంఘంలోని ప్రతీ వ్యక్తికీ ప్రత్యక్షంగా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉండాలి. అలా ప్రతీ వ్యక్తీ భాగస్వామి అయితే ప్రతీ వ్యక్తీ సాంస్కృతిక సృష్టికర్త అయినట్లే. ప్రపంచీకరణ ప్రతీ వ్యక్తినీ సాంస్కృతిక వినియోగదారుడిగా మారుస్తోంది. దానికి విరుగుడుగా మనం ప్రతీ వ్యక్తినీ సాంస్కృతిక సృష్టికర్తగా మార్చాలి. మన జోక్యం రెండు రకాలుగా ఉండాలి.

**మొదటిది :** ప్రత్యామ్నాయ, ప్రజా సాంస్కృతిక భావజాలాన్ని వివిధ రూపాలలో ప్రజలలోకి తీసుకుపోవడం. ఇది ప్రధానంగా మన నాయకత్వంలోని వేదికలనుండి జరిగేది.

**రెండవది :** ప్రజలు పాల్గొనే అన్ని సాంస్కృతిక కార్యకలాపాలలోనూ, అన్ని వేదికలలోనూ మనం జోక్యం కల్పించుకుని ప్రజలకు దగ్గర కావడం, తద్వారా వారిని ప్రభావితం చేయడం. ప్రజల సాంస్కృతిక జీవితంలో మనం భాగస్వాములం కావాలి.

సాంస్కృతిక రంగంలో కృషి ప్రభావం విప్లవోద్యమాన్ని బలోపేతం చేయడానికి దోహదం చేస్తుంది. అదే విధంగా విప్లవోద్యమం బలపడేకొద్దీ సాంస్కృతిక రంగంలో మన భావజాల ప్రభావం బలపడుతుంది. ఈ రెండింటికీ ఉన్న గతితార్కిక సంబంధాన్ని గుర్తించాలి.

ప్రస్తుతం అంతర్జాతీయ ఉద్యమాల అనుభవాలు చూస్తే రెండు ధోరణులు కనిపిస్తున్నాయి.

**మొదటిది :** మితవాద శక్తుల ఆధ్వర్యంలో వ్యక్తం అయేవి. ప్రధానంగా పాలకవర్గాల ప్రోత్సాహంతో జరిగే వీటిలో విద్వేషం, హింస ప్రధానంగా కనిపిస్తున్నాయి. సాధారణ ప్రజానీకాన్ని భయభ్రాంతుల్ని చేస్తున్నాయి.

**రెండవది :** వివక్షత, అణచివేత, ప్రపంచీకరణ వంటి అంశాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలు, పోరాటాలు. వీటిలో వేల, లక్షల సంఖ్యలో ప్రజలు పాల్గొంటున్నారు. వారు కేవలం ప్రదర్శనలు, సభలు, బైఠాయింపులు, సమ్మెలు వంటి రూపాలకు మాత్రమే పరిమితం కావడం లేదు. వారి నిరసన వైవిధ్యభరితమైన సాంస్కృతిక రూపాలలో వ్యక్తం అవుతోంది. పాటలు, బొమ్మలు, కార్టూన్లు గీయడం, షార్ట్ ఫిల్ములు ప్రదర్శించడం, నృత్యాలు, కవి సమ్మేళనాలు, ఆటలు, సేవా కార్యకలాపాలు ఆ ఉద్యమాలలో అంతర్భాగం అయిపోతున్నాయి. ఆ ఉద్యమాలలో పాల్గొనేవారు భయాన్ని అధిగమించారు. మన దేశంలో సాగిన రైతు ఉద్యమంలో కూడా ఈ ధోరణిని మనం చూస్తాం. ఉద్యమాలు ఉత్సవాల మాదిరిగా సాగడం వర్తమాన ధోరణి. అరబ్బు దేశాలలో, లాటిన్ అమెరికా దేశాలలో సాగిన ఉద్యమాలలో ఈ ధోరణులు కనిపిస్తున్నాయి. వాల్ స్ట్రీట్ ముట్టడి సందర్భంలో యూరపియన్ కార్మికుల సమ్మెలలో కనిపించాయి. మన దేశంలో కూడా ఈ వరవడిని అందిపుచ్చుకోవాలి.

అన్ని కళా రూపాలలోనూ మనం జోక్యం చేసుకోవాలి. ఆధునిక సాంకేతికతతో ముందుకొస్తున్న నూతన రూపాలను అందిపుచ్చుకోవాలి. స్మార్ట్ ఫోన్లు అందరిదగ్గరా ఉన్నాయి కనుక అభిరుచులు ఉన్నవారిని గుర్తించి ఫొటోగ్రాఫర్లుగా, షార్ట్ ఫిలిం ప్రొడ్యూసర్లుగా ప్రోత్సహించాలి. ఆధునిక తరాన్ని ఆకట్టుకుంటున్న కొత్త కొత్త కళారూపాలను గుర్తించి ఆ రూపాలను ఉపయోగించి మన భావజాల సారాంశాన్ని వారివద్దకు తీసుకుపోయే మార్గాలను ఆవిష్కరించాలి.

> ❝ కొత్త సమాజపు విలువల్ని పాటిస్తూ జీవించే పద్ధతిని ప్రత్యామ్నాయ సంస్కృతి అంటాం. ప్రస్తుత వ్యవస్థలోనే ఆ సంస్కృతిని ముందుకు తీసుకుపోయే అవకాశాలను మనం పరిశీలించి అభి వృద్ధి చేయాలి. ఉదా : కార్మిక సంఘం. కొద్దిమంది నాయకులు మాత్రమే పని చేస్తూ సాధారణ కార్మికులకు ఏ పాత్రా లేని పద్ధతి పెట్టుబడిదారీ పద్ధతి. ఆ కార్మికులనందరినీ సంఘం నడపడంలో, నిర్ణయాలు చేయడంలో, నాయకత్వం వహించడంలో భాగస్వాముల్ని చేయడం, సమిష్టి తత్వాన్ని వారిలో ప్రోత్సహించడం ప్రత్యా మ్నాయ సంస్కృతి. ❞

కళా నైపుణ్యం ఉన్న వ్యక్తులమీద కన్నా, సాధారణ ప్రజలనుండి ముందుకు వచ్చి పాల్గొనే విధంగా ఉండే కళారూపాలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి. నాటికలు వంటివి చాలా శ్రమతో, ఖర్చుతో కూడుకునివుంటాయి. పైగా ప్రజలది ప్రేక్షక పాత్రే ఔతుంది. అదే కోలాటం, పాటలు, డాన్సులు, ఆటలు వంటివి నిర్వహిస్తే ఎక్కువమంది పాల్గొనడానికి ముందుకొస్తారు.

**5. ప్రత్యామ్నాయ సాంస్కృతిక రూపాలు:**

కొత్త సమాజపు విలువల్ని పాటిస్తూ జీవించే పద్ధతిని ప్రత్యామ్నాయ సంస్కృతి అంటాం. ప్రస్తుత వ్యవస్థలోనే ఆ సంస్కృతిని ముందుకు తీసుకుపోయే అవకాశాలను మనం పరిశీలించి అభివృద్ధి చేయాలి. ఉదా : కార్మిక సంఘం . కొద్దిమంది నాయకులు మాత్రమే పని చేస్తూ సాధారణ కార్మికులకు ఏ పాత్రా లేని పద్ధతి పెట్టుబడిదారీ పద్ధతి. ఆ కార్మికులనందరినీ సంఘం నడపడంలో, నిర్ణయాలు చేయడంలో, నాయకత్వం వహించడంలో భాగస్వాముల్ని చేయడం, సమిష్టి తత్వాన్ని వారిలో ప్రోత్సహించడం ప్రత్యామ్నాయ సంస్కృతి.

మేడే కార్మికుల పండగ. ఆ రోజున ప్రదర్శనలు, ఊరేగింపులు, సభలకే పరిమితం కాకుండా కార్మికులు తమ కుటుంబాలతో సహా ఒక పండుగ వాతావరణంలో మేడేను జరుపుకోవడం ప్రత్యామ్నాయ సంస్కృతి. సుందరయ్య వర్ధంతి, రెడ్‌బుక్ డే వంటి సందర్భాలను కూడా సాంస్కృతిక కార్యక్ర మంగా జరపాలి. సంఘాల మహాసభలను కూడా అదే విధంగా నిర్వహించాలి.

వివాహం, పుట్టుకలు, చావులు, పండుగలు వంటి సందర్భాలలో మన జోక్యంతో మూఢ ఆచారాలకు తావు లేని రీతిలో నిర్వహించుకునే వాతావరణాన్ని మన వర్గాల ప్రజల కుటుంబాలలో కల్పించేవిధంగా వారితో సంబంధాలు పెంపొందించుకోవాలి.

**6. సాంస్కృతిక కృషి – వివిధ ప్రదేశాలు:**

కేవలం ఆయా తరగతుల ప్రజలు పని చేసే ప్రదేశాలలో మన జోక్యం ఉంటే చాలదు. ప్రజల దైనందిన జీవితాన్ని అనునిత్యం స్పృశిస్తూ వారిని ప్రభావితం చేసే ప్రదేశాలు అన్నింటా మన సాంస్కృతిక జోక్యం ఉండాలి.

**(అ) కుటుంబం :** పుట్టుక, పెంపకం, పెళ్ళి (కట్నాలు, సాంప్రదాయాలు, కులం, మతం, ముహూర్తం వగైరా తిరోగమన భావాలు బలహీనపడేలా) చావు, పురుషా ధిక్యత, వినిమయ తత్వం, పోటీ ప్రపంచం వంటి భావాల ప్రభావం వగైరాలలో మన జోక్యం ఉండాలి.

ఇప్పుడు కుటుంబం పిల్లలను పెట్టుబడిదారీ వ్యవస్థకు అనుగుణంగా వ్యవహరించేవారిని తయారుచేసే పాత్ర పోషిస్తోంది. దానితోబాటు పితృస్వామిక భావజాలాన్ని పరిరక్షించే పని చేస్తోంది. కుల కట్టుబాట్లను, ఫ్యూడల్ సాంప్రదాయాలను కొత్త తరాలకు అందించే వాహకంగా ఉంది. మనం కుటుంబాలతో సన్నిహిత సంబంధాలు నెరపగలిగితే క్రమంగా మన జోక్యం పెరిగి అదే కుటుంబం నూతన విలువలను, పురోగామి భావాలను కొత్త తరాలకు అందించే యూనిట్‌గా మారుతుంది.

**(ఆ) పండుగలు, ఉత్సవాలు :** వీటిలో అత్యధికంగా ప్రజలు పాల్గొంటారు. ఆచారాలను, మూఢవిశ్వాసాలను, విద్వేష రాజకీయాలను, ఆధిపత్య భావజాలాన్ని ఆ సందర్భంలో ప్రజల్లో జొప్పించడానికి పాలకవర్గాలు వీటిని ఉపయోగించు కుంటాయి. మనం జోక్యం చేసుకుని ఆ సందర్భాలను హేతువాదం, సామరస్యాన్ని, సేవాదృక్పధాన్ని, ఇతర పురోగామి విలువలను ప్రజలకు అందించే ప్రయత్నం చేయాలి. ఈ సందర్భాలను పెద్ద వ్యాపారంగా మార్చి సొమ్ము చేసుకుంటున్న వ్యవహారాన్ని ఎండగట్టాలి.

**(ఇ) కులం :** కుల వ్యవస్థలోని అసమానత్వాన్ని, వివక్షతను, అణచివేతను, దోపిడీని, శ్రామిక తరగతుల పట్ల ద్వేషాన్ని ఎండగట్టాలి. మెరిట్ పేరుతో సామాజిక న్యాయాన్ని వ్యతిరేకించే వాదనల సారాన్ని బట్టబయలు చేయాలి. అంబేద్కర్, ఫూలే, వీరబ్రహ్మం, వేమన, గోరా, కందుకూరి, గురజాడ, కుసుమ ధర్మన్న వంటి సంస్కర్తల పేర సాంస్కృతిక కార్యక్రమాలు విశాల ప్రాతిపదికన జరపాలి. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి (నవంబరు 11) అన్ని యూనివర్సిటీలలోనూ పాటిస్తారు. అది మొక్కుబడి కార్యక్రమంలా సాగుతుంది. మన విద్యార్థి, అధ్యాపక, ఉద్యోగ సంఘాలు చొరవచేసి సాంస్కృతిక కృషి చేపడితే ఇతరులతోబాటు మైనారిటీ విద్యార్థులను, ఉద్యోగులను ఉమ్మడి సెక్యులర్ వేదికలవైపు ఆకర్షించగలుగుతాం.

అంబేద్కర్, ఫూలే, గాంధీ, నెహ్రూ, అల్లూరి, కొమురం భీం, తదితర నేతల జయంతులు, వర్ధంతులు మొక్కుబడి సభలలాగో. లేక విగ్రహాలకు దండలు వేయడానికి పరిమితం చేసో కాకుండా, మన సాధ్యాసాధ్యాలను బట్టి సాంస్కృతిక ఉత్సవాలుగా జరపాలి. ఆయా పేటల్లో, విద్యా సంస్థల్లో, దళిత, గిరిజన తరగతులలోకి చొరబడడానికి, వారికి తగిన ప్రాధాన్యత కల్పించడానికి వీలౌతుంది.

**(ఈ) విద్య :** నైపుణ్యాన్ని కొత్త తరాలకు అందించడంతోబాటు పెట్టుబడి దారీ, ఆధిపత్య విలువలను కూడా అందించే సాధనంగా పాలకవర్గాలకు సాధనంగా ఉపయోగపడుతోంది. దానితోబాటు విద్య ఒక సరుకుగా మారి కార్పొరేట్ల దోపిడీకి ఒక మార్గం అయింది. కాషాయీకరణకు ఒక సాధనం అయింది.

విద్య అనేది ఒక సామాజిక హక్కు అని, సమాజ పురోగమనానికి అది దోహదం చేసేదిగా ఉండాలే తప్ప దోపిడీకి తోడ్పడేదిగా ఉండకూడదని తెలియజెప్పే విధంగా, ప్రత్యామ్నాయ విద్య ఏవిధంగా ఉండాలో వివరించే విధంగా మన జోక్యం ఉండాలి. దానితోబాటు విద్యా బోధనకు మనం కృషి చేయాలి. ప్రత్యామ్నాయ విద్యాసంస్థలను వీలైనచోట్ల ఏర్పాటు చేయాలి. పేదవారి కాలనీలలో ఉచిత ట్యూషన్లు, కోచింగ్ సెంటర్లు నడపాలి.

బాలల రంగంలో మన జోక్యం ఉండాలి. వారికి ప్రత్యామ్నాయ విలువలను నేర్పాలి.

మన రాష్ట్రంలో ప్రభుత్వం తెలుగు మాధ్యమంలో బోధనను ఎత్తివేసి ఆ స్థానంలో ఇంగ్లీషు మీడియంను ప్రవేశపెడుతోంది. ఇప్పుడు ఏ మాధ్యమం సరైనది అన్న చర్చ మాత్రమే జరుగుతోంది. ఇది పాక్షికమే. బోధనలో, వాడకంలో ఇంగ్లీషు అవసరం లేని స్థాయికి తెలుగు భాషను అభివృద్ధిపరచడం ఎలా అన్న చర్చ జరిపితేనే పరిష్కారం దొరుకుతుంది. గతంలో తెలుగును అభివృద్ధి చేసేలా వాడుకభాషా ఉద్యమం జరిగినట్టే ఇప్పుడూ తెలుగు భాష ఆధునీకరణ కోసం ఉద్యమం జరగాలి.

**(ఉ) సినిమా, టివి, ఇంటర్నెట్** వంటి వేదికలద్వారా ప్రజలకు అందుతున్న భావాల, సిద్ధాంతాల సారాంశాన్ని బహిర్గతం చేయాలి. ప్రత్యామ్నాయ సినిమాలను ప్రదర్శించాలి. అందుకు అనునిత్యం మనకు పలు సందర్భాలు వస్తాయి. వాటిని ఉపయోగించుకోవాలి.

**(ఊ) భాష :** ప్రపంచీకరణ వ్యవస్థలో పెరిగిపోతున్న వ్యక్తివాదం, వినిమయ తత్వం, వాటితోబాటు విద్యావ్యవస్థలో భాషాధ్యయనానికి తగ్గిపోయిన ప్రాధాన్యత – అన్నీ కలిసి నూతన తరాల ప్రజలను భావవ్యక్తీకరణ విషయంలో బలహీనులుగా చేస్తున్నాయి. తెలుగు భాషను ఆధునిక అవసరాలకు తగ్గట్టు పెంపొందించే ఉద్యమాన్ని నిర్మించడం, ఏ భాషలోనైనా సరే తమ భావాలను స్పష్టంగా వ్యక్తం చేసేవిధంగా యువతకు శిక్షణ, చర్చావేదికలు, ఇష్టాగోష్టులు వంటివి నిర్వహించడం అవసరం.

**(ఎ) సేవారంగం :** పాలకవర్గాలు ఈ రంగం ద్వారా తమ దోపిడీ లోని అమానవీయతను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తారు. దోపిడీవర్గపు దయ, సౌజన్యాలపై పేదవారు ఆధారపడి ఎల్లకాలమూ వారికి ఊడిగం చేస్తూ వారి దయ కోసం అర్రులు చాచేలా ఉండాలని వారు కోరుకుంటారు. దానికి భిన్నంగా కష్టాల్లో ఉండే శ్రమజీవులు ఒకరికొకరు తోడుగా నిలిచే ఉమ్మడి సంస్కృతిని ముందుకు తేవాలంటే ఈ రంగంలో మనం జోక్యం చేసుకోవాలి. అదే సమయంలో ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం వంటివి మానవుల కనీస హక్కులని, ఆ హక్కులను అమలు జరిపే బాధ్యత ప్రభుత్వానిదేనని వారికి తెలియజెప్పాలి. ప్రపంచీకరణ శకంలో ప్రభుత్వం తన సామాజిక బాధ్యతనుండి వైదొలగుతోంది. శ్రామిక వర్గాల ప్రజలు, పేదలు రాను రాను నిస్సహాయులుగా మిగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో సేవారంగం ప్రాధాన్యత పెరిగింది.

**❝ నేటి యువతలో సామాజిక చైతన్యం ఉన్నవారు వివిధ సందర్భాలలో స్వచ్ఛందంగా సేవా తత్పరతను ప్రదర్శిస్తున్నారు. కరోనా సమయంలో ఇది బాగా వ్యక్తం అయింది. ఉద్యమాల ఉధృతి, పోరాటాల పట్ల విశ్వాసం సన్నగిల్లిన నేపథ్యంలో సమాజానికి ఏదో చాతనైనది చేయాలన్న ఆకాంక్షలు, తపన ఉన్నవారందరికీ మనం వేదికలు కల్పించాలి. పాత దుస్తులను, వాడని ఔషధాలను, పాఠ్య పుస్తకాలను సేకరించి అవసరమైనవారికి పంచి పెట్టే కార్యక్రమం వంటివి, ఉచిత వైద్య శిబిరాలు, పారిశుధ్యం, ఉచిత అంబ్యులెన్స్ సర్వీసు వంటివి నిర్వహించాలి. ❞**

నేటి యువతలో సామాజిక చైతన్యం ఉన్నవారు వివిధ సందర్భాలలో స్వచ్ఛందంగా సేవా తత్పరతను ప్రదర్శిస్తున్నారు. కరోనా సమయంలో ఇది బాగా వ్యక్తం అయింది. ఉద్యమాల ఉధృతి, పోరాటాల పట్ల విశ్వాసం సన్నగిల్లిన నేపథ్యంలో సమాజానికి ఏదో చాతనైనది చేయాలన్న ఆకాంక్షలు, తపన ఉన్నవారందరికీ మనం వేదికలు కల్పించాలి. పాత దుస్తులను, వాడని ఔషధాలను, పాఠ్య పుస్తకాలను సేకరించి అవసరమైనవారికి పంచి పెట్టే కార్యక్రమం వంటివి, ఉచిత వైద్య శిబిరాలు, పారిశుధ్యం, ఉచిత అంబ్యులెన్స్ సర్వీసు వంటివి నిర్వహించాలి. రక్తదానం, దేహదానం ప్రాధాన్యతలను ప్రజలకు వివరించి ప్రోత్సహించాలి.

జాతీయోద్యమంలో ప్రజా ఉద్యమాల వెల్లువ వెనుకపట్టు పట్టిన ప్రతీ సందర్భంలోనూ గాంధీజీ ప్రజలలో సామ్రాజ్యవాద వ్యతిరేకతను పెంపొందించడానికి సేవా కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. వయోజన విద్య, ఖాదీ వడకడం వంటివి జాతీయోద్యమానికి ఎంతో బలం చేకూర్చాయి.

**(ఏ) క్రీడలు, వ్యాయామం,** ఆరోగ్య పరిరక్షణ, యోగా శిక్షణ, వాకర్స్ సంఘాలు వంటివి అన్ని వయస్సుల ప్రజలలోకీ చొచ్చుకుపోడానికి తోడ్పడతాయి. వారిని ప్రభావితం చేయడానికి అవకాశాలు ఇస్తాయి.

**(ఐ) పిక్నిక్‌లు, వన భోజనాలు :** సమిష్టి, ప్రజాసంస్కృతిని ప్రజల్లో బలంగా పెంచడానికి ఇవి మంచి సాధనాలు. నివాస ప్రాంతాల్లో స్నేహ సంబంధాలు పెంపొందించడానికి, కులదురభిమానాలను, పురుషాధిక్య ధోరణులను, పేకాట, తాగుడు వంటి దురలవాట్లను విడనాడేలా ప్రజలను ప్రోత్సహించడానికి ఇవి తోడ్పడతాయి. వీటిని రెగ్యులర్‌గా నిర్వహించాలి. నిర్వహణలోనూ ప్రజలను భాగస్వాముల్ని చేయాలి.

**7. జానపద సంస్కృతి – మన జోక్యం:** జానపద కళారూపాలు సామాన్య ప్రజానీకం నుండి పుట్టినవే. వాటిని మొత్తంగా పాలకవర్గ ఆధిపత్య సంస్కృతి అని ముద్రవేయలేం. అలాగని వాటిని యధాతథంగా కొన సాగించనూలేం. మన పురాణాలు రామాయణం, మహాభారతం వంటివి కూడా ముందు గాథలుగా సామాన్య ప్రజలలోనే బయులుదేరాయి. ఆ ప్రజలకు ఆనాటి వర్గసమాజపు ధోరణులు, పరిమితులు ఉంటాయన్నది మనకు గమనంలో ఉండాలి. ఆ తర్వాత వాటిని ఆధిపత్య వర్గాలు స్వాధీనం చేసుకుని వాటి రూపాలను పాండితీప్రకర్షతో మార్చారు. ఇది ఒక మన దేశంలో మాత్రమే జరిగినది కాదు. ప్రపంచం యావత్తూ ఉన్న ప్రాచీన ప్రసిద్ధ కావ్యాలన్నింటి విషయంలోనూ ఇదే మాదిరిగా జరిగింది. ఆ పండితులంతా దాదాపుగా అగ్రకులాలకు చెందినవారే. ఆ తర్వాత మధ్య యుగాలలో వారికి తోడు ముస్లిం లేదా పర్షియన్ కులీన సంస్కృతికి ప్రతినిధులైనవారు తోడయ్యారు. ఈ కావ్యాలను గాని, ప్రాచీన కళారూపాలను (సంగీతం, నృత్యం, చిత్రకళ, శిల్పం వంటివి) గాని దోపిడీవర్గ సృష్టిగా తోసిపారేయకూడదు. సమాజం ఎప్పుడూ కొనసాగుతూనే వుంటుంది. దానితోబాటు సంస్కృతి కూడా కొనసాగుతూ వుంటుంది. ఐతే అది అప్పుడప్పుడు గతం నుండి విడగొట్టుకుని కొత్త ధోరణులు తలెత్తడానికి ఆస్కారం ఇస్తూవుంటుంది. ఈ విధంగా కొనసాగింపుతోబాటు విడగొట్టుకోవడం కూడా ఒక పరస్పర గతితార్కిక సంబంధంలో ఉంటాయి.

ప్రస్తుతం మానవసమాజపు అత్యున్నతస్థాయి ప్రతినిధిగా ఆధునిక కార్మికవర్గం ఉంది. అందుచేత మన సంస్కృతి,

> **"దేవాలయాలు, మసీదులు, చర్చిలు వంటివి మన జానపద కళలకు, సంస్కృతికి కేంద్రాలుగా ఇప్పుడు ఉంటున్నాయి. ప్రజలు వాటిలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. మనం ఆ ప్రజానీకాన్నే ప్రభావితం చేయాల్సివుంది. ఆ ప్రజలనుండి వేరుపడిపోతే మనం వారిని ప్రభావితం చేయలేం. పైగా, వారిని పాలకవర్గాల ప్రభావానికే మొత్తంగా వదలిపెట్టినవాళ్ళం అవుతాం. అందుచేత మనం ప్రజలతోబాటు పాల్గొంటూనే, ఆ సాంస్కృతిక రూపాల ద్వారా వ్యక్తమయే భావాలను ప్రజలను చైతన్యపరిచే విధంగా మలచడానికి ప్రయత్నించాలి."**

సాంప్రదాయాలలో అతి విలువైనవాటన్నింటికీ అది ప్రతినిధిగా ఉంటుంది. దానితోబాటు గత స్థాయి నుండి సంస్కృతిని పెంపొందించి మరింత ఉన్నత స్థాయికి కొనిపోయే కర్తవ్యం కూడా కార్మికవర్గం మీదనే ఉంది.

దేవాలయాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనాస్థలాలు మన జానపద కళలకు, సంస్కృతికి కేంద్రాలుగా ఇప్పుడు ఉంటున్నాయి. ఆ సంస్కృతిలో పాలకవర్గాలు చాలా మార్పులు చేశాయి కూడా. కాని ప్రజలు వాటిలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. మనం ఆ ప్రజానీకాన్నే ప్రభావితం చేయాల్సివుంది. ఆ ప్రజలనుండి వేరుపడిపోతే మనం వారిని ప్రభావితం చేయలేం. పైగా, వారిని పాలకవర్గాల ప్రభావానికే మొత్తంగా వదలిపెట్టినవాళ్ళం అవుతాం. అందుచేత మనం తగు ఎత్తుగడలు అనుసరించాలి. ప్రజలతోబాటు పాల్గొంటూనే, ఆ సాంస్కృతిక రూపాల ద్వారా వ్యక్తమయే భావాలను ప్రజలను చైతన్యపరిచే విధంగా మలచడానికి ప్రయత్నించాలి.

జానపద కళాకారులను, కళారూపాలను మనం ప్రోత్సహించాలి. మన ప్రజా ఉద్యమాలు, సంఘాలు ఆ కళలకు పోషకులుగా మారాలి. ఆ కళారూపాలను సంస్కరించుకుని, వాటి సారాంశాన్ని మార్చి ఉపయోగించుకోవాలి. దళితులు, వృత్తిదారులు, గిరిజనులు పాత సాంప్రదాయాలలో పాడిన పాటలను, ఆడిన ఆటలను అభివృద్ధి చేయాలి. పండుగలలో, జాతరలలో పాల్గొనాలి. పూజా కార్యక్రమాన్ని పక్కన పెడితే తక్కినవన్నీ సాంస్కృతిక కార్యక్రమాలే. ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ పండుగలలో కూడా మనం చురుకుగా జోక్యం చేసుకోవాలి.

భక్తి ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించిన సంస్కర్తల బోధనలలో పరిమితంగానైనా ఉన్న పురోగామి భావాలను మనం బలంగా ఫోకస్ చేయాలి. అందుకు అనువైన సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించాలి. వాటికి ప్రత్యేక వేదికలను, సంస్థలను కూడా ఏర్పాటు చేయాలి. (అన్నమయ్య సేవాపీఠం, భజన కళాకారుల సంక్షేమ సంఘం వగైరా) మత సామరస్యానికి, ప్రజల ఐక్యతకు, ప్రతీకలుగా ఉండే సాంప్రదాయాలను పుచ్చుకుని నూతన పరిస్థితులకు అనుగుణంగా వాటిని ఉపయోగించాలి.

**8. ప్రజా రంగాలు సాంస్కృతిక కృషి :**

సాంస్కృతిక రంగంలో కృషి అంటే కేవలం ప్రజానాట్యమండలి బాధ్యత అనో, సాహిత్య రంగం బాధ్యత అనో, విజ్ఞాన కేంద్రాల బాధ్యత అనో భావించరాదు. సాంస్కృతిక రంగంలో మన ఆధ్వర్యంలో కాకుండా వెలుపల కృషి చేస్తున్నవారు చాలా మంది ఉన్నారు. వివిధ వేదికలలో వారంతా కృషి చేస్తున్నారు. వారిలో అనేకులు మన ఆధ్వర్యంలోని ప్రజాసంఘాలలో సభ్యులుగానో, ప్రజాసంఘాల సభ్యుల కుటుంబాలకు చెందినవారుగానో ఉన్నారు. వారందరినీ విశాల వేదికలమీదకు సమీకరించాలి. ఇది అన్ని ప్రజాసంఘాలూ చేయవలసిన కర్తవ్యం. ప్రజాసంఘాలు తమ తమ సభ్యుల ఆర్థిక సమస్యలమీద ఎంత కృషి చేస్తున్నా, పాలకవర్గాల భావజాల ఆధిపత్యం వారిమీద బలంగా కొనసాగడానికి కారణం ప్రజా సంఘాల సాంస్కృతిక జోక్యం లేకపోవడమే, తమ సభ్యులను పాలకవర్గ సాంస్కృతిక ఆధిపత్యానికి వదలిపెట్టడమే. అందుచేత సాంస్కృతిక రంగం మీద అందరూ ఉమ్మడిపట్టు పట్టాలి.

(అ) ప్రతీ ప్రజాసంఘం తన సభ్యుల సాంస్కృతిక జీవితాలను సన్నిహితంగా పరిశీలించాలి. ఆ సభ్యులలో కళాభినివేశం ఉన్నవారిని, వివిధ రకాల నైపుణ్యం ఉన్నవారిని గుర్తించాలి. వారందరికీ తమ నైపుణ్యాలను ప్రదర్శించే కార్యక్రమాలను, వేదికలను రూపొందించాలి.

గతంలో ఉపాధ్యాయ రంగంలో జిల్లా మహాసభలు ఉత్సవాలమాదిరిగా జరిగేవి. అనేకమంది ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు తమ తమ కళానైపుణ్యాలను ప్రదర్శించేవారు. ఇప్పుడు ఆ వరవడిని మళ్ళీ పునరుద్ధరించాలి. ఇతర ఉపాధ్యాయ సంఘాలలోని కళాకారులను కూడా భాగస్వాముల్ని చేయడానికి ప్రయత్నించాలి.

ఏడాదిలో ఏదో ఒక సందర్భంలో మాత్రమే నిర్వహించేమరొక కార్యక్రమంలా సాంస్కృతిక కృషిని చూడవద్దు. పాలకవర్గ సంస్కృతి అనునిత్యమూ చురుకుగా ఉంది. దానిని దృష్టిలో పెట్టుకుని ప్రతీ ప్రజాసంఘం తన కార్యకలాపాలతో సాంస్కృతిక కృషిని ఎలా మేళవించాలో ఆలోచించాలి. ఉద్యమంలోని ప్రతీ సందర్భానికీ తగిన విధంగా ఈ మేళవింపు ఉండేలా చూడాలి.

బాలలు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, దళితులు, గిరిజనులు, విభిన్న ప్రతిభావంతులు, లైంగిక అస్తిత్వ సమస్యలున్నవారు (ఎల్‌జిబిటిక్యు వగైరా) – ఈ అన్ని తరగతులలోనూ సాంస్కృతిక సైన్యాన్ని నిర్మించాలి.

**(ఆ) సోషల్ మీడియా:** ఇది చాలా భారీ స్థాయిలో సాంస్కృతికంగా భావజాలవ్యాప్తికి తోడ్పడుతుంది. ప్రస్తుతం మనం సోషల్ మీడియాలో చాలా పరిమితమైన పాత్ర కలిగివున్నాం. మనం చేస్తున్న కార్యకలాపాలను పోస్టు చేయడానికి, లైక్ కొట్టి షేర్ చేయడానికి మాత్రమే పరిమితం ఔతున్నాం. చాలామంది అదికూడా చేయడం లేదు. చిన్న చిన్న స్కిట్ లను, కామెడీ షోలను, కథలను, కార్టూన్లను, ఇంకా అనేక రూపాలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నవారు చాలామంది ఉన్నారు. వారిలో చాలామంది అభ్యుదయ భావజాలంతో ఉన్నవారు కూడా ఉన్నారు. వివిధ కళారూపాలద్వారా మన భావజాలాన్ని పోస్టు చేయడంతోబాటు, వారందరినీ కలుపుకుని విశాల ప్రాతిపదికన నిర్వహిస్తే అనేక రకాల సోషల్‌మీడియా వేదికలను ఎక్కడికక్కడ నడపవచ్చు.

**(ఇ) పత్రికలు :** మన పార్టీ, ఆయా ప్రజాసంఘాలు నడిపే పత్రికలు బులెటిన్‌ల మాదిరిగా కాకుండా సాంస్కృతిక పోరాటాన్ని నిర్వహించే వేదికలుగా అభివృద్ధి చేయాలి. ప్రజల నిత్య సాంస్కృతిక జీవితంలో వారిని

స్పృశించే అన్ని అంశాల మీదా పత్రిక స్పందించాలి. విమర్శించాలి. చర్చావేదికగా వ్యవహరించాలి.

దాదాపు అన్ని ప్రజాసంఘాలూ మాస లేదా త్రైమాసిక పత్రికలను నడుపుతున్నాయి. అన్నింటి సర్క్యులేషన్ కలిపితే రెండు లక్షలకు పైబడే ఉంటుంది. ఆయా సంఘాల్లో ఉండే సభ్యులు, వారి కుటుంబ సభ్యులు తమ సాంస్కృతిక శక్తిసామర్థ్యాలను వ్యక్తం చేయడానికి అనువుగా ఈ పత్రికలను నిర్వహించాలి. అందుకు తగిన సామర్థ్యాలు ఉన్నవారిని ఎడిటోరియల్ టీములలో చేర్చుకోవాలి.

మరింతమంది ఎక్కువ రచయితలను, రచయిత్రులను – ముఖ్యంగా యువతరాన్ని భాగస్వాములను చేయడం, సాంస్కృతిక పేజీలను కొత్త దనం ఉండే విధంగా పెంపొందించడం, వెబ్ పత్రికను యువతరానికి వేదికగా అభివృద్ధి చేయడం వంటి ప్రయత్నాలు ప్రజాశక్తి దినపత్రిక చేయాలి.

ప్రతీ బుక్‌హౌస్ బ్రాంచి స్థానిక రచయితలకు, మేథావులకు, ఔత్సాహికులకు కేంద్రబిందువుగా పెంపొందేలా ఏడాది పొడవునా కార్యక్రమాలను డిజైన్ చేసి అమలు చేయాలి.

**(ఈ) సైన్స్ రంగం :** శాస్త్రీయ భావజాలం వ్యాప్తి చెందకుండా ప్రత్యామ్నాయ సంస్కృతి బలపడదు. ఈ విషయంలో ప్రజాసైన్స్ రంగం పాత్ర చాలా ముఖ్యమైనది. సామాన్య ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థులలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం గురించి, ప్రకృతి పరిణామాలగురించి తెలుసుకోవాలనే సహజమైన ఉత్సుకతను ఉపయోగించి సైన్స్‌ఎగ్జిబిషన్లద్వారా, ప్రయోగాలు చేయించడం ద్వారా, మేజిక్ షో వంటి కార్యక్రమాలద్వారా శాస్త్రీయ భావజాలాన్ని వ్యాప్తి చేయడం జరగాలి. ఈ విషయంలో మనతో కలిసివచ్చేవారు చాలామందే ఉంటారు. మతపరమైన కార్యక్రమాలలో పాల్గొనే ప్రజల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ కృషికి చాలా ప్రాధాన్యత ఉంది.

**9. విశాల ప్రాతిపదిక :**

సాంస్కృతిక రంగంలో మన భావజాలంతో ఏకీభవించకపోయినా, వారి వ్యక్తిగత ప్రమాణాలు బలహీనంగా ఉన్నా మనం వారిని దూరం పెట్టే ధోరణి ఉంది. సాంస్కృతిక రంగం అంటేనే సృజనాత్మకతతో కూడుకుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పార్టీయేతరులతో తగువిధంగా వ్యవహరించాలి. ఉపయోగపడేమేరకు వారిని కలుపుకుపోవడమెలా అన్నది ఆలోచించాలి.

అభ్యుదయ భావాలను కలిగివుండే కళారూపాలను రూపొందించేవారు మన ఉద్యమ ప్రభావానికి వెలుపల చాలామందే ఉన్నారు. చాలా విషయాల్లో భావసారూప్యత కలవారు ఉన్నారు. వారందరినీ మనం భాగస్వాముల్ని చేయాలి.

**“ సాంస్కృతిక రంగంలో మన భావజాలంతో ఏకీభవించక పోయినా, వారి వ్యక్తిగత ప్రమాణాలు బలహీనంగా ఉన్నా మనం వారిని దూరం పెట్టే ధోరణి ఉంది. సాంస్కృతిక రంగం అంటేనే సృజనాత్మకతతో కూడుకుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పార్టీయేతరులతో తగువిధంగా వ్యవహరించాలి. ఉపయోగ పడేమేరకు వారిని కలుపుకుపోవడమెలా అన్నది ఆలోచించాలి. అభ్యుదయ భావాలను కలిగివుండే కళారూపాలను రూపొందించేవారు మన ఉద్యమ ప్రభావానికి వెలుపల చాలామందే ఉన్నారు. వారందరినీ మనం భాగస్వాముల్ని చేయాలి. ”**

వివిధ సామాజిక తరగతులలో పని చేస్తున్న సాంస్కృతిక కార్యకర్తలు ఉన్నారు. వాని కలుపుకుపోవడమెలా అన్నది ఆలోచించాలి. అందుకోసం అవసరమైన కొత్త వేదికలను, కొత్త ఈవెంట్స్‌ను రూపొందించుకోవాలి.

మనం నడిపే వేదికలే కాకుండా వివిధ సంస్థలు ఇతరుల నాయకత్వలో నడుస్తున్నవి చాలా ఉన్నాయి. ఈ సంస్థలతో సంబంధాలను పెంపొందించుకోవాలి. పరస్పర సహకారంతో, సమన్వయంతో పని చేసే వరవడిని పెంపొందించాలి. వివిధ సందర్భాలలో ఉమ్మడిగా కార్యక్రమాలు జరపడానికి ప్రయత్నించాలి. ఇతరుల అటువంటి విషయాల్లో చొరవ ప్రదర్శిస్తే దానిని స్వాగతించి సహకరించాలి.

**10. కేంద్రీకరణ :**

మన సాంస్కృతిక కృషిలో ప్రధాన కేంద్రీకరణ యువజనులమీద, విద్యార్థులమీద, చిన్నపిల్లల మీద ఉండాలి. వారిని భాగస్వాములను చేయడమూ తేలిక. వారిమీద అభ్యుదయ భావజాలప్రభావం ముందునుంచీ పెడితే అది ఉద్యమానికి చాలా కీలకంగా ఉపయోగపడుతుంది.

మనం విద్యా సంస్థలలో, దళిత పేటలలో, అపార్టుమెంట్లవద్ద ఎక్కువగా కేంద్రీకరించడం ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికే వాటిలో సాంస్కృతిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. మనం జోక్యం చేసుకోగలిగితే ఎక్కువ ఫలితం రాబట్టవచ్చు.

**11. పెడధోరణులు :**

ఈ కృషిలో మన పనిలో రెండు పెడధోరణులు తలెత్తకుండా మనం జాగ్రత్త వహించాలి.

(అ) మన గతకాలపు సంస్కృతి చాలా ఘనమైనది అనే భావన చాలా మంది ప్రజానీకం మనస్సుల్లోకి చొరబడింది. చాలా మంది మేధావులు ఈ అంశాన్ని పాక్షికంగానే చూస్తున్నారు. మన

**‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**"పరిమితమైన దాతలమీద ఆధారపడినంత కాలమూ ఇదొక పెద్ద సమస్యగా కనిపిస్తుంది. కాని ప్రజలను వీక్షకుల పాత్రకు పరిమితం చేయకుండా భాగస్వాముల్ని చేయగలిగితే వనరుల సమీకరణ ఒక సమస్యగా ఉండదు. ప్రతీ కార్యక్రమం సందర్భంగానూ ఆర్థికవనరులను సమీకరించడం ఒక వరవడిగా మారాలి. ప్రజాకళలను, ప్రజా ఉద్యమాలను ప్రజలే పోషించుకోవాలి. రక్షించుకోవాలి అన్న చైతన్యం కల్పించడం చాలా కీలకం. ఈ పనిని ఆయా ప్రజా రంగాలకు మాత్రమే విడిచిపెడితే ప్రయోజనం ఉండదు. పార్టీ ఆ వరవడిని తీసుకురావడంలో చోదక శక్తిగా వ్యవహరించాలి."**

భారతీయ సమాజం ఎదుగూ బొదుగూ లేకుండా స్తంభించి పోవడం, దిగజారిపోతూ వుండడం చాలా కాలం క్రితమే మొదలైందని, ఆ కారణంగానే మనం విదేశీయుల పెత్తనం కింద రెండు శతాబ్దాలపాటు మగ్గ వలసివచ్చిందని మరిచి పోతున్నారు. మనం సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటూ ప్రజాస్వామ్యాన్ని బలప రుచుకోవాలంటే సామాజిక-సాంస్కృతిక పునర్నిర్మాణం అవసరం అని గుర్తించడం లేదు. గతంలోని గొప్పలతో, గత వారసత్వాన్ని కాపాడుకోవడమనే దృష్టితో మాత్రమే వ్యవహరించడం తప్పు.

(ఆ) రెండో ప్రమాదకరమైన ధోరణి గత సంస్కృతి మొత్తాన్ని తిరస్కరించడం. ఈ ధోరణి మన గతంలోని అమూల్యమైన అంశాలను గుర్తించ నిరాకరిస్తుంది. ఆ సంస్కృతిని రూపొందించడంలో ప్రజానీకం నిర్వహించిన పాత్రను విస్మరిస్తుంది. దానిని పాలకవర్గాలు తమ ఆధిపత్యం కిందకు తెచ్చుకున్నాయన్న వాస్తవాన్ని, ఆ ఆధిపత్యం నుండి గత సంస్కృతిలోని పురోగమన అంశాలను కాపాడుకోవాలన్న కర్తవ్యాన్ని విస్మరిస్తుంది.

ఈ రెండు పెడధోరణులూ తలెత్తకుండా జాగ్రత్త పడాలి. వర్తమానాన్ని అర్థం చేసుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలంటే అందుకు మన గతాన్ని అధ్యయనం చేయడం చాలా ముఖ్యం. గత సంస్కృతిలోని ఏయే పురోగామి అంశాలు మన దేశపు సంస్కృతిని గతంలో ఒక ఉన్నత స్థాయికి చేర్చాయో తెలుసుకోవాలి. అదే విధంగా గత సంస్కృతిలోని ఏయే తిరోగామి అంశాలు మన సమాజాన్ని ఎదుగూ బొదుగూ లేకుండా ఉండేలా, దిగజారిపోయేలా చేశాయో వాటినీ గుర్తించాలి. మనం గర్వపడదగ్గ అంశాలు గతంలో ఏమున్నాయో, మనం ఏయే హానికర ధోరణులను అంతమొందించాలో ప్రజానీకానికి వివరించగలగాలి.

**12. ఆర్థిక వనరులు :**

ఇది చాలా ముఖ్యమైన అంశం. పరిమితమైన దాతలమీద ఆధారపడినంత కాలమూ ఇదొక పెద్ద సమస్యగా కనిపిస్తుంది. కాని ప్రజలను వీక్షకుల పాత్రకు పరిమితం చేయకుండా భాగస్వాముల్ని చేయగలిగితే వనరుల సమీకరణ ఒక సమస్యగా ఉండదు. ప్రతీ కార్యక్రమం సందర్భంగానూ ఆర్థికవనరులను సమీకరించడం ఒక వరవడిగా మారాలి. ప్రజాకళలను, ప్రజా ఉద్యమాలను ప్రజలే పోషించుకోవాలి. రక్షించుకోవాలి అన్న చైతన్యం కల్పించడం చాలా కీలకం. ఈ పనిని ఆయా ప్రజా రంగాలకు మాత్రమే విడిచిపెడితే ప్రయోజనం ఉండదు. పార్టీ ఆ వరవడిని తీసుకురావడంలో చోదక శక్తిగా వ్యవహరించాలి.

**13. పార్టీ కమిటీల ప్రత్యేక కృషి :**

ప్రతీ పార్టీ కమిటీ తమ పరిధిలో కల్చరల్ మ్యాపింగ్ చేపట్టాలి.

(అ) తమ పరిధిలో సాంస్కృతిక వనరులను గుర్తించాలి. కళాకారులు, రచయితలు, సాంస్కృతిక సంస్థలు, బృందాలు ఏమేమి, ఎవరెవరు ఉన్నారో క్షుణ్ణంగా సర్వే చేయాలి. వారిలో అత్యధికులను మనం ఏ విధంగా ఉపయోగించుకోగలుగుతామో ఒక అంచనాకు రావాలి.

(ఆ) తమ ప్రాంతంలో జరిగే వివిధ సాంస్కృతిక కార్యకలాపాలను, వాటిలో ప్రతీ ఏడూ జరిగేవాటిని గమనించాలి. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా స్థలాలు, గ్రంధాలయాలు, కాలేజీలు, ఇతర విద్యా సంస్థలు – ఇవన్నీ సాంస్కృతిక కార్యక్రమాలను చేపడుతున్నాయి. వాటిని పరిశీలించాలి. అందులో ముఖ్యంగా ఎటువంటి కార్యక్రమాల్లో యువత, చిన్నపిల్లలు, మహిళలు ఎక్కువగా భాగస్వాములౌతున్నారో గుర్తించాలి. కార్మికులు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో, స్లమ్స్‌లో జరిగే పండుగలు, ఉత్సవాలను గుర్తించాలి.

(ఇ) ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి ఉత్సాహంగా ముందుకు వచ్చేవారు అనేకులు ఉన్నారు. వారితో సంబంధాలు ఏర్పరచుకునే మార్గాలను అన్వేషించాలి. అందుకోసం ఏయే రకాల వేదికలను ఏర్పరచాలో, ఏయే వేదికలలో మనం కూడా చేరి పని చేయాలో నిర్ణయించుకోవాలి.

(ఈ) సాంస్కృతిక, సేవా కార్యక్రమాలకు ఆర్థికంగా తోడ్పాటు ఇవ్వడానికి ముందుకొస్తున్నవారు చాలామంది ఉన్నారు. వారి సహకారం, ఆర్థిక సహాయం పొందేందుకు ప్లాను రూపొందించాలి.

(ఉ) పార్టీ కమిటీ పరిధిలో ప్రతీ ప్రజాసంఘమూ, ప్రతీ సంస్థా సాంస్కృతిక క్యాలెండర్ రూపొందించుకుని అమలు చేయడానికి అనువుగా తోడ్పడాలి. ప్రోత్సహించాలి.

(ఊ) కంటెంట్ ను రూపొందించేవారిని అభివృద్ధి చేయాలి. ఇప్పటికే ఆ పనిలో ఉన్నవారితో నెట్‌వర్క్ నిర్మించాలి. ఇతరులలో ఉపయోగపడేవారిని కూడా ఈ నెట్‌వర్క్‌కు తోడు చేయాలి. వారికి తరచూ వర్క్‌షాప్‌లు, అవగాహనా తరగతులు నిర్వహించాలి. ❄

చరిత్ర

# స్వర్ణయుగంలో సామాన్యులు

**ఎంవిఎస్ శర్మ**



రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

**తొ**లి మధ్యయుగాల కాలం ( క్రీ.శ.300-600) అంతా చాలా గొప్పగా నడిచిందని, ముఖ్యంగా గుప్తుల కాలం స్వర్ణయుగం అని కొందరు చరిత్రకారులు ఇప్పటికీ వర్ణిస్తూంటారు. అందుకు దాఖలాగా ఆ కాలంలో గొప్పగా రూపొందిన కళలను, సాహిత్యాన్ని, గణితశాస్త్రాన్ని, ఖగోళ శాస్త్రాన్ని చూపిస్తూంటారు. ఇక ఆరెస్సెస్, సంఘపరివారం దానికి తమ పైత్యాన్ని జోడించి ప్రాచీన కాలం నుండి - అంటే వేద యుగాలనుండి క్రీ.శ. 8వ శతాబ్దం దాకా మన ఉపఖండంలో సాగిన పాలన అంతా స్వర్ణయుగమేనని, ప్రపంచానికి మనమే జ్ఞానభిక్ష పెట్టామని, ఆ తర్వాత పరాయివారు మన దేశం మీదపడి కొల్లగొట్టి, పెత్తనం చెలాయించడంతో చీకటియుగంలోకి జారిపోయామని చెప్పేస్తూంటారు. కాని చరిత్రను నిర్ధారించడానికి ఆధారాలు, రుజువులు అవసరం. పుక్కిటి పురాణాలు, కట్టుకథలు చరిత్ర కావు.

ఇక యూరపియన్ చరిత్ర కారులు ఓరియంటల్ డెస్పాటిజమ్ ప్రాచీన కాలం నుండీ నాగరికత ఉన్న తూర్పు ప్రాంతాలలో, ముఖ్యంగా ఆసియా దేశాలలో కొనసాగిన నిరంకుశ పాలన అని, మొత్తం ఆసియా ఖండం అంతా ఒకే తరహాలో పెట్టుబడిదారీ-పూర్వ వ్యవస్థ నడిచిందని, యూరప్ నుండి వచ్చి ఆక్రమించుకున్న పెట్టుబడిదారులు ఈ ప్రాంతాలను అభివృద్ధి చేసి ముందుకు నడిపించారని చెప్పుకోడానికి వీలుగా 'ఆసియా తరహా సమాజం' అని చరిత్రను రూపొందించారు. దీనినే 'స్వయంసంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ' అని కూడా చెప్పారు. ఈ వ్యవస్థలో ఏ మార్పులూ లేనట్టు, జడత్వంతో సమాజం ఎదుగూ బొదుగూ లేకుండా ఉండిపోయినట్టు వారు భావించారు. మార్క్స్ భారతదేశం గురించి రాసిన తొలి వ్యాసాలలో సైతం ఇదే అవగాహన ప్రతిబింబించింది. ఐతే, ఆ తర్వాత మార్క్స్ ఇక్కడి ప్రత్యేకతలను లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరాన్ని గుర్తించాడు.

భారతదేశ చరిత్రను అధ్యయనం చేసేవారు ఇక్కడి ఫ్యూడల్ లేదా భూస్వామ్య వ్యవస్థకు ఉన్న ప్రత్యేకతలను గమనించాలి. మామూలుగా ఉత్పత్తి సాధనాలమీద పూర్తి అధికారం కలిగినవారంతా ఒక వర్గం గాను, వాటిమీద ఏ అధికారమూ లేకుండా కేవలం తమ శ్రమను మాత్రమే వెచ్చించి మనుగడ కొనసాగించేవారిని వేరే వర్గం గాను పరిగణిస్తాం. ఐతే ఇటువంటి స్పష్టమైన వర్గ విభజన ఒక పూర్తి స్థాయిలో రూపొందిన పెట్టుబడిదారీ వ్యవస్థలో మాత్రమే మనకు కనిపిస్తుంది. ఇదే ప్రాతిపదికన మనం పెట్టుబడిదారీ దశకు ముందున్న సమాజాలను పరిశీలించడానికి పూనుకుంటే అది గందరగోళానికి దారి తీస్తుంది. ఆ సమాజాల్లో ఉత్పత్తి అయే సంపద పంపిణీలో ఉండే అసమానతలను బట్టి, ఆ అసమానతలను సమర్ధించే ఆచార, సాంప్రదాయాలను, కట్టుబాట్లను, సైద్ధాంతిక భావనలను, అప్పటి చట్టాలను బట్టి మనం పాత సమాజాల్లో వర్గ వైరుధ్యాలను అర్ధం చేసుకోగలుగుతాము.

**యూరప్ కి, భారతదేశానికి తేడా:** యూరప్‌లో ఫ్యూడల్ ప్రభువులు స్వంత భూములను కలిగివుంటూ, అందులో కొంత భూమిని 'భూదాసులకు' కేటాయించేవారు. అందుకు ప్రతిఫలంగా ఆ భూదాసులు భూస్వాముల భూముల్లో ఎటువంటి ప్రతిఫలమూ లేకుండా చాకిరీ చేయాలి. అదే మన భారతదేశంలో ఫ్యూడల్ సమాజంలో రాజు తన రాజ్యంలోని భూములను అన్నింటినీ కొందరికి పెత్తనం నిమిత్తం అప్పజెప్పి వాటిపై శిస్తు వసూలు చేసి తనకు చెల్లించే షరతును ఆ పెత్తందారులకు విధించాడు. భూములమీద వ్యవసాయం చేసే రైతులనుండి శిస్తులు వసూలు చేయడంతోబాటు, వారిని భూములనుండి వెళ్ళగొట్టే అధికారం, వారిచేత నిర్బంధంగా వెట్టి చాకిరీ చేయించే అధికారం ఈ పెత్తందారులకు ఉండేవి. వారే ఫ్యూడల్ భూస్వాములయారు.

మరి ఆసియా తరహా సమాజం అని గతంలో చరిత్రకారులు వర్ణించిన వ్యవస్థ ఏ విధంగా ఉండేది? రాజు భూమిమీద సర్వాధికారి. ఆర్థిక వ్యవస్థ గ్రామాల ప్రాతిపదికన నడిచేది. ప్రతీ గ్రామంలోనూ 12-15 రకాల వృత్తులవారు ఉండేవారు. కరణం, మునసబు, తలయారీ, పురోహితుడు, రైతు, కమ్మరి, కుమ్మరి, సాలె, మేదరి, గొర్రెలామేకల కాపరి, చాకలి, మంగలి.. ఇలా వృత్తులు ఉండేవి. వృత్తులు పుట్టుకను బట్టి నిర్ణయించబడేవి. ఆ గ్రామంలోని ప్రజల అవసరాలన్నీ తీరే విధంగా ఎవరి వృత్తిని వారు చేసేవారు. గ్రామం తరఫున కొంత శిస్తు రాజుకు చెల్లించేవారు. గ్రామంలో డబ్బుతో నిమిత్తం లేకుండా ఎవరి వృత్తి వారు చేసి ఎవరికి అవసరమైనవి వారు పొందేవారు. ఇటువంటి సమాజ వ్యవస్థ గ్రామాల్లో ఎటువంటి మార్పూ లేకుండా శతాబ్దాలపాటు కొనసాగింది....ఇదీ ఆ చరిత్రకారుల అభిప్రాయం.

ఈ మాదిరి సమాజం ఎక్కడైనా కొన్ని చోట్ల తెగల రాజ్యాల దశలో (అంటే భూస్వామ్య వ్యవస్థకు మునుపటి దశ) కొంతకాలం ఉండివుండొచ్చేమో గాని, ఆధునిక భారతీయ చరిత్రకారుల అధ్యయనం భారతదేశంలో ఫ్యూడల్ సమాజం ఆసియా తరహా సమాజానికి భిన్నమైన లక్షణాలతో ఉండినట్టు నిర్ధారించింది. ఆ సమాజంలో వర్గ వైరుధ్యాలూ స్పష్టంగా వ్యక్తం అయ్యాయి.

**ఫ్యూడల్ వ్యవస్థ ప్రధాన లక్షణాలు:** భారత ఉపఖండంలోని ఫ్యూడల్ వ్యవస్థలో ప్రధానంగా భూస్వాములు అనే వర్గం, వారికి లోబడివుండే రైతులు అనే వర్గం ప్రధానంగా

> "గుప్తుల కాలంలో సాహిత్యం, కళలు, శాస్త్ర విజ్ఞానం వంటి రంగాలలో చెప్పుకోదగ్గ పురోగతి నమోదు అయినమాట వాస్తవం. సమకాలీన ప్రపంచంలోని ఇతర రాజ్యాలతో పోల్చితే మన ఉపఖండంలో ఈ రంగాలలో జరిగిన పురోగతి గొప్పదే. కాని ఆ కాలంలోని సామాజిక వైరుధ్యాలను పరిశీలించకపోతే ఆ స్వర్ణయుగ ఫలితాలను ఎవరు అనుభవించారో, అందుకు ఎవరు మూల్యం చెల్లించవలసి వచ్చిందో మనకు అర్థం కాదు."

ఉండేవి. ఆ వ్యవస్థ ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడిన వ్యవస్థ. ఈ ఫ్యూడల్ వ్యవస్థ ప్రారంభం అయే సమయానికి అంతవరకూ వాణిజ్యం ప్రధానంగా ఏర్పడిన పట్టణాలు క్రమంగా బలహీన పడుతూ వచ్చాయి. పట్టణాలలో ప్రధానంగా కేంద్రీకరించబడిన చేతివృత్తులు అనివార్యంగా గ్రామాలకు తరలిపోవలసి వచ్చింది. వాణిజ్యం క్షీణించడంతో నాణేల కొరత పెరిగింది.

ఈ వ్యవస్థలో అధికారంలో అత్యున్నత స్థానం రాజుది. రాజుకు దిగువన పురోహితులు, మఠాలు, విహారాలు (బౌద్ధ, జైన), దేవాలయాలు, అగ్రహారాలు వంటివి అధికార వ్యవస్థలుగా ఏర్పడ్డాయి. వీటి ద్వారా రాజ్యంలోని భూమి మీద, చేతివృత్తులమీద శిస్తులు వసూలు చేయడం జరిగేది. భూమి మీద పెత్తనం చెలాయించే వర్గం– దానినే భూస్వామ్యవర్గం అంటాం– రాజ్యం అంతటా ఉండేది. ఆ వర్గానికి భూమి మీద అధికారం రాజ శాసనాల ద్వారా సంక్రమించింది. అంతే గాని వాళ్ళు కష్టపడి సాగులోకి తెచ్చినదేమీ కాదు. తమ అధీనంలో ఉండే భూమి మీద వ్యవసాయం, పశుపెంపకం, తోటల పెంపకం, ఇతర పద్ధతుల్లో ఉత్పత్తి చేస్తూ జీవించే రైతాంగం మీద భూస్వాములకు సకల అధికారాలూ ఉండేవి. వారినుండి శిస్తు వసూలు చేయడం, నప్పకపోతే భూములనుండి వెళ్ళగొట్టడం, వారి చేత నిర్బంధంగా ఉచిత వెట్టి చాకిరీ చేయించడం వంటిరూపాలలో ఈ అధికారం ఉండేది.

ఈ అధికారానికి రైతాంగం తలొగ్గి ఉండడానికి ప్రధాన సాధనంగా మతాన్ని ఉపయోగించుకున్నారు. మతక్రతువులు, ఆచారాలు, కట్టుబాట్లు అన్నీ ధర్మశాస్త్రాల పేరుతో నడిచేవి. వీటికి తోడు పురాణాలు, భగవద్గీత ప్రవచనాలు వంటివి నిత్యం ప్రచారంలో ఉంటూ ప్రజలను సైద్ధాంతికంగా ఫ్యూడల్ వ్యవస్థకు అనుకూలంగా ఉండేలా చేసేవి. ఈ ధోరణులు గుప్తుల కాలంలో స్పష్టంగా వ్యక్తం అయాయి.

**గుప్తుల స్వర్ణయుగం**

గుప్తుల కాలంలో సాహిత్యం, కళలు, శాస్త్ర విజ్ఞానం వంటి రంగాలలో చెప్పుకోదగ్గ పురోగతి నమోదు అయినమాట వాస్తవం. సమకాలీన ప్రపంచంలోని ఇతర రాజ్యాలతో పోల్చితే మన ఉపఖండంలో ఈ రంగాలలో జరిగిన పురోగతి గొప్పదే. కాని ఆ కాలంలోని సామాజిక వైరుధ్యాలను పరిశీలించకపోతే ఆ స్వర్ణయుగ ఫలితాలను ఎవరు అనుభవించారో, అందుకు ఎవరు మూల్యం చెల్లించవలసి వచ్చిందో మనకు అర్థం కాదు.

ఒకటవ చంద్రగుప్తుడు గుప్త సామ్రాజ్యాన్ని స్థాపించినది క్రీ.శ.319–20 లో. అతడి తర్వాత సముద్రగుప్తుడు, అనంతరం క్రీ.శ. 375 నుండి 415 వరకు రెండవ చంద్రగుప్తుడు, తర్వాత క్రీ.శ.454 వరకూ కుమారగుప్తుడు పాలించారు. అనంతరం స్కందగుప్తుడు అధికారంలోకి వచ్చిన తర్వాతనుండీ గుప్తుల సామ్రాజ్యం పతనం కాసాగింది. అందుకు కారణాలను ఇదివరకే చెప్పుకున్నాం. మొత్తం మీద సుమారు 150 సంవత్సరాలపాటు గుప్త సామ్రాజ్యం అవిచ్ఛిన్నంగా కొనసాగింది.

అధికారం, పరిపాలన వికేంద్రీకరించడం, పట్టణాలు క్షీణించడం ఈ కాలపు లక్షణాలు. మరి స్వర్ణయుగపు వైభవం ఎక్కడ ఉంది? అది ప్రధానంగా సాహిత్య, కళా, శాస్త్ర విజ్ఞాన రంగాలలో మనకు కనిపిస్తుంది. ముందు ఆ వైభవాన్ని గురించి చర్చిద్దాం.

ఆ కాలంలో గాని, అంతకు ముందు గాని కళలు ప్రధానంగా మతం నుండి ప్రేరణ పొందాయి. బౌద్ధం మౌర్యుల కాలం నుండి గుప్తుల కాలం దాకా సుమారు 800 సంవత్సరాల కాలం పాటు గొప్ప కళారూపాల సృష్టికి ప్రేరణ అయింది. కొండలను తొలిచి పెద్ద పెద్ద గుహలను నిర్మించడం, వాటిలో చిత్రాలను, శిల్పాలను తీర్చిదిద్దడం, పెద్ద పెద్ద రాతి స్థాపాలను నిర్మించడం, బుద్ధ విగ్రహాలను పెద్ద పెద్ద సైజుల్లో చెక్కడం వంటివి జరిగాయి. ఒక దగ్గర 25 మీటర్ల ఎత్తు ఉన్న బుద్ధవిగ్రహాన్ని తాను దర్శించినట్టు ఫాహియాన్ తన డైరీలో రాసుకున్నాడు.(చూ. చిత్రం–బుద్ధ విగ్రహం) ఈ క్రమంలో మన చిత్రకళ, శిల్పకళ ఉన్నతస్థాయిని చేరుకున్నాయి. ముఖ్యంగా అజంతా గుహలలోని చిత్రాలు క్రీ.శ.1వ శతాబ్దంనుండి 7వ శతాబ్దం వరకూ ఉన్న కాలానికి చెందినవి. వీటిలో ఎక్కువ భాగం గుప్తుల పాలనాకాలంలో చిత్రించినవే. వాటికి అద్దిన రంగులు ఇన్ని వందల సంవత్సరాల తర్వాత కూడా మసకబారలేదు. ఐతే, గుప్త రాజులు ఈ అజంతా చిత్ర కళను ప్రోత్సహించినట్టు ఎక్కడా దాఖలాలు లేవు. (చూ. అజంతా చిత్రం)

కంచు, ఇనుము లోహాలతో నిర్మించిన విగ్రహాలు, స్తంభాలు ఈ కాలంనాటివి. అంటే లోహాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం ఆనాటికి పురోగమించిందని భావించవచ్చు. డిల్లీ సమీపంలో మెహరౌలీ వద్ద ఉన్న ఇనుపస్తంభం ఆనాటి లోహకారుల కౌశలానికి అద్దం పడుతుంది. పశ్చిమ దేశాలలోని ఫౌండ్రీలలో అటువంటి స్తంభాలను తయారు చేయడం అక్కడికి 1400 సంవత్సరాల తర్వాత గాని సాధ్యం కాలేదు. క్రీ.శ.4 వ శతాబ్దం నాటి ఆ ఇనుపస్తంభానికి గత 16 శతాబ్దాలుగా తుప్పు పట్టనేలేదు. ఐతే ఆ కౌశలం తదనంతర కాలంలోని లోహకారులకు అబ్బలేదు. (చూ. చిత్రం)

భవన నిర్మాణంలో గుప్తుల కాలంలో పెద్దగా చెప్పుకోదగ్గవి లేవు. ఇటుకలతో నిర్మాణం జరిగేది. అప్పుడు ఇటుకలతో నిర్మించిన దేవాలయాలు ఉత్తరప్రదేశ్‌లో నేటికీ కొన్ని ఉన్నాయి. 5వ శతాబ్దంలో స్థాపించిన నలంద విశ్వవిద్యాలయం (బీహార్) ఇటుకలతో నిర్మించినదే. ఇది ప్రధానంగా బౌద్ధ భిక్షువులకు శిక్షణా కేంద్రంగా ఉండేది.

సాహిత్యం: పురాణ, తాత్విక సాహిత్యంతోబాటు సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించే కాల్పనిక సాహిత్యం గుప్తుల కాలంలో బాగా పెంపొందింది. శూద్రకుడు రచించిన ప్రసిద్ధ నాటకం మృచ్ఛకటికం (మట్టిరథం) ఒక సంపన్న వర్తకుడికి, ఒక అందమైన వేశ్య కుమార్తెకు మధ్య నడిచిన ప్రేమ గాథను ఇతివృత్తంగా తీసుకుని రచించినది. ప్రసిద్ధ నాటక రచయిత భాసుడు 13 నాటకాలను రచించాడు. కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం ప్రపంచ సాహిత్యంలోని

అత్యుత్తమ రచనలలో ఒకటిగా పేరు పొందింది. ఈ నాటకాలన్నీ సుఖాంతాలే తప్ప విషాదాంతాలేవీ లేవు. వీటిలోని పాత్రధారులలో పాలకవర్గాలకు చెందిన పాత్రధారులంతా సంస్కృతంలో సంభాషించినట్టు ఉంటుంది. అదే దిగువ వర్గాల ప్రజలు, స్త్రీలు మాత్రం ప్రాకృతంలో సంభాషణలు జరుపుతారు.

రామాయణం, మహాభారతం క్రీ.శ,4వ శతాబ్దం నాటికి గ్రంధరూపం తీసుకోవడం పూర్తయింది. అంతకు ముందునుంచీ రాముడు, కృష్ణుడు వంటి స్థానిక హీరోల వీరోచిత గాధలు సామాన్య ప్రజలలో ప్రచారంలో ఉన్నాయి. ఆ గాధలనే ఇతివృత్తాలుగా తీసుకుని రామాయణం, మహాభారతం గ్రంధాలుగా రూపొందాయి. మహాభారతం కన్నా రామాయణం సమాజం మీద ఎక్కువ ప్రభావం చూపింది. దక్షిణాది భాషలలో దీనిని రచించడమే గాక దక్షిణాసియా దేశాలలో కూడా రకరకాల రామాయణాలు తయారయ్యాయి. మహా భారతంతో బాటుగా రచించబడిన భగవద్గీత కూడా ఈకాలం నాటిదే. దానిని భారతయుద్ధ సమయంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించినట్టు చెప్పి సాక్షాత్తూ భగవంతుడే బోధించిన ధర్మంగా ప్రజానీకంలో విశ్వసనీయత పొందడానికి ప్రయత్నం చేశారు.

పురాణాలన్నీ కల్పిత గాధలతో, స్థానిక హీరోల గాధలతో నిండివుంటాయి. వాటితోబాటు నీతిసూత్రాలను, ధర్మ సూత్రాలను జాగ్రత్తగా కలగలిపి రచించారు. సామాన్య ప్రజానీకాన్ని ప్రభావితం చేయడం దీని వెనుక ఉన్న అసలు లక్ష్యం. గుప్తుల కాలంలోనే శ్లోకాల రూపంలో ఉండే ధర్మ సూత్రాలను వచన రూపంలో వివరించి వాటికి పాలకవర్గాల భాష్యాలను జోడించారు.


పాణిని, పతంజలి సంస్కృత భాషకు వ్యాకరణాన్ని రూపొందించినది, అమర సింహుడు అమరకోశాన్ని రచించినది ఈ కాలంలోనే.

ఆర్యభట్టు గుప్తుల కాలం నాటివాడు. గణితశాస్త్రాన్ని, ఖగోళ శాస్త్రాన్ని పెంపొందిచడంతో ప్రసిద్ధిపొందాడు. అనంతరం వరాహమిహిరుడు కూడా ఈ శాస్త్రాలను అభివృద్ధి చేశాడు. గణితంలో దశాంశ పద్ధతి (డెసిమల్ సిస్టం) ప్రపంచంలో తొలుతగా ప్రవేశపెట్టింది గుప్తుల కాలంలోనే. ఖగోళ శాస్త్రానికి ఆద్యులు గ్రీకులు. వారివద్ద నేర్చుకుని ఆర్యభట్టు, వరాహమిహిరుడు దానిని సుసంపన్నం చేశారు. ఖగోళ శాస్త్రంతోబాటు అశాస్త్రీయమైన జ్యోతిషాన్ని కూడా ఒక శాస్త్రంగా వీరు ముందుకు తెచ్చారు.

రెండవ చంద్రగుప్త విక్రమాదిత్యుని ఆస్థానంలో కాళిదాసు వంటి పండితులు, వివిధ రంగాలలో నిష్ణాతులుగా పేరు గడించినవారు నవరత్నాలుగా ప్రసిద్ధికెక్కారు.

గుప్తుల కాలంలోని ఒక పార్శ్వాన్ని ఇంతవరకూ చూశాం. ఇక రెండో పార్శ్వాన్నో

**“ రామాయణం, మహాభారతం క్రీ.శ,4వ శతాబ్దం నాటికి గ్రంధరూపం తీసుకోవడం పూర్తయింది. అంతకు ముందునుంచీ రాముడు, కృష్ణుడు వంటి స్థానిక హీరోల వీరోచిత గాధలు సామాన్యప్రజలలో ప్రచారంలో ఉన్నాయి. ఆ గాధలనే ఇతివృత్తాలుగా తీసుకుని రామాయణం, మహాభారతం గ్రంధాలుగా రూపొందాయి. మహాభారతం కన్నా రామాయణం సమాజం మీద ఎక్కువ ప్రభావం చూపింది. దక్షిణాది భాషలలో దీనిని రచించడమే గాక దక్షిణాసియా దేశాల్లో కూడా రకరకాల రామాయణాలు తయారయ్యాయి. ”**



ఢిల్లీ సమీపంలోని ఇనుప స్తంభం

> **❝ కుల వ్యవస్థ బలపడడంతోబాటు శూద్రులమీద వివక్షత కూడా పెరిగింది. శూద్రులు చదువుకోడానికి అనర్హులయారు. వారు స్వంత ఆస్థిని కూడా కలిగివుండేందుకు అనర్హులు. అంట రానితనం బాగా పెరిగింది. ఆ కులాలవారిని ఆనాటి శాసనా లలో, ఇతర సాహిత్యంలో చాలా నీచంగా ప్రస్తావించారు. వారు అపవిత్రులని, దొంగలని, అబద్ధాలకోరులని, దురాశాపరులని, వికారంగా ఉంటారని - ఇలా వర్ణించారు. ❞**

అంటే, ఆర్థిక, సామాజిక పునాదిలో ఆయా తరగతుల, వర్గాల ప్రజల స్థితిగతుల్ని చూద్దాం.

బానిసల ప్రస్తావన గుప్తుల శాసనాలలో వచ్చినది తక్కువ. ఉత్పత్తి రంగంలో బానిసలను వినియోగించినట్లు ఎక్కడా దాఖలాలు లేవు. నారద స్మృతిలో ఆ కాలంలో 15 రకాల బానిసలు ఉన్నట్టు పేర్కొన్నారు. కాని వారంతా ప్రధానంగా పాలకవర్గాల ఇళ్ళల్లో చేసే రకరకాల పనుల్లో మాత్రమే నియోగించబడ్డారు. ఇళ్ళు, లోగిళ్ళు, రహదారులను ఊడవడం, శుభ్రం చేయడం, పారిశుద్య పని చేయడం, అంట్లు తోమడం, యజమానుల ఒళ్ళు మాలిష్ చేయడం, తలంటు పోయడం వంటి పనులు మాత్రమే నారద స్మృతిలో ప్రస్తావనకు వచ్చాయి. వ్యవసాయం, చేతివృత్తులు వంటి 'పవిత్ర'మైన పనులను చేయడానికి బానిసలు అర్హులు కారని అపవిత్రమైన పనులకు మాత్రమే వారిని వినియోగించాలని నారదుడు పేర్కొన్నాడు.

రైతుల స్థాయి గుప్తుల కాలంలో దిగజారింది. వారిమీద వివిధ రకాల పన్నులను, శిస్తులను విధించడంతోబాటు వెట్టి చాకిరీ పద్ధతిని కూడా అమలు చేయసాగారు. మౌర్యుల కాలంలో బలవంతపు చాకిరీ అనేది బానిసలకు, వేతనానికి కూలి చేసేవారికి మాత్రమే పరిమితంగా ఉండేది. గుప్తుల కాలంనాటికి ఇది రైతాంగం అందరికీ విస్తరించింది. రైతు స్త్రీలు భూస్వాముల ఇళ్ళల్లో ధాన్యం దంచడం, తిరగలితో పిండి విసరడం వంటిపనులతో బాటు అనేక రకాల చాకిరీ చేయవలసివచ్చేది. అందుకు ప్రతిఫలం ఏమీ ముట్టేది కాదు. అధికారులు గాని సైన్యం గాని గ్రామం మీదుగా పోతూన్నప్పుడు వారి అవసరాలన్నింటినీ గ్రామస్తులే తీర్చవలసి వచ్చేది. వారు వస్తురూపేణా వసూలు చేసే శిస్తులను రవాణా చేయడానికి బళ్ళను పూని సరుకులను చేరవేయవలసివచ్చేది. అధికారులకు కానుకలను ఇచ్చుకోడానికి అయ్యే



అజంతా చిత్రం

ఖర్చు కూడా రైతులమీదనే మోపేవారు. ఈ భారాలన్నీ భూస్వాములు రైతులమీదనే మోపేవారు.

అంతకు ముందు, పట్టణాల్లో చేతివృత్తులు, వాణిజ్యం బాగా కొనసాగిన కాలంలో, చేతివృత్తుల సంఘాలకు (గిల్డులు) స్వపరిపాలనాధికారం ఉండేది. ప్రభుత్వం వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకునేది. వాణిజ్యం క్షీణించాక చేతివృత్తుల ప్రాధాన్యత తగ్గిపోయింది. గ్రామాలకు తరలిపోయాక వారు కూడా రైతులతోబాటు అన్ని రకాల పీడనలకూ గురి కాసాగారు.

పట్టణాలు క్షీణించినప్పటికీ, పూర్తిగా అదృశ్యం అయిపోలేదు. అవి ఆధిపత్య వర్గాలకు విలాస కేంద్రాలుగా కొనసాగాయి. వ్యభిచారం, జూదం, విచ్చలవిడితనం బాగా పెరిగాయి.

గుప్తుల కాలంలో మహిళల స్థితి బాగా దిగజారింది. వారు విద్యకు అనర్హులయారు. బాల్య వివాహాలు పరిపాటి అయాయి. కాలక్రమేణా అది విధిగా పాటించవలసిన ఆచారం అయిపోయింది. వితంతువులు ఎటువంటి సౌకర్యాలూ పొందకూడదని, వారు మళ్ళీ వివాహం చేసుకోడానికి అనర్హులని నిర్ణయించారు. సతీ సహగమనం బాగా ప్రచారం పొందింది. ఐతే ఈ దురాచారం ప్రధానంగా ఆధిపత్య వర్గాల వారికి మాత్రమే పరిమితంగా ఉండేది. స్త్రీలకు ఆస్తి హక్కు లేదు. పైగా స్త్రీలనే ఆస్తిగా పరిగణించేవారు.


గుప్తుల కాలంలో కుల వ్యవస్థ చిలవలు, పలవలుగా విస్తరించింది. వాయవ్య భూభాగం నుండి దండెత్తి వచ్చి ఇక్కడ భూభాగాలపై ఆధిపత్యం సంపాదించిన హూణులు, గుర్జర్లు వంటి తెగల పాలకులు ఇక్కడికి వచ్చాక క్షత్రియులుగా, రాజపుత్రులుగా రూపాంతరం చెందారు. అంతవరకూ అడవులలో జీవిస్తూవచ్చిన తెగలు వ్యవసాయ సమాజంలో అంతర్భాగం అయాక తెగకో కులంగా మారి అందరూ శూద్రులుగా పరిగణించబడ్డారు. చేతివృత్తులు కూడా కులాలుగానే పరిగణించబడ్డాయి. భూశాస నాల జారీ పెరిగి, శిస్తుల వసూలు కూడా పెరగడంతో వాటన్నింటినీ లిఖితపూర్వ కంగా నమోదు చేసేవారు ఒక కులంగా పరిగణించబడ్డారు.( కాయస్తులు, కరణాలు, పట్నాయిక్‌లు వగైరా)

కుల వ్యవస్థ బలపడడంతోబాటు శూద్రులమీద వివక్షత కూడా పెరిగింది. శూద్రులు చదువుకోడానికి అనర్హులయారు. వారు స్వంత ఆస్థిని కూడా కలిగివుండేందుకు అనర్హులు. అంటరానితనం బాగా పెరిగింది. ఆ కులాలవారిని ఆనాటి శాసనాలలో, ఇతర సాహిత్యంలో చాలా నీచంగా ప్రస్తావించారు. వారు అపవిత్రులని, దొంగలని, అబద్ధాలకోరులని, దురాశాపరులని, వికారంగా ఉంటారని – ఇలా వర్ణించారు.

(మిగతా 23వ పేజీలో)

ఈ మాసం ప్రత్యేకం

# నయా-ఉదారవాదం నయా-ఫాసిజం



ప్రభాత్ పట్నాయక్

**(జూన్ 13,14 తేదీల్లో కేరళలోని త్రిస్సూర్‌లో 2024 కామ్రేడ్ ఇఎంఎస్ నంబూత్రిపాద్ స్మారక ఉపన్యాసంలో "నయా-ఉదారవాదం, నయా-ఫాసిజం" అనే అంశంపై ప్రముఖ మార్క్సిస్టు ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్ చేసిన ప్రసంగాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.... సంపాదకుడు)**

ఈ రోజున ప్రపంచ వ్యాపితంగా ఫాసిస్టు ఉద్యమాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన యూరోపియన్ యూనియన్ ఎన్నికల్లో నయా-ఫాసిస్టులు పెద్ద ఎత్తున విజయాలు సాధించారు. ఈ ఉద్యమాలను లిబరల్ పత్రికలు ఫాసిస్టు ఉద్యమాలుగా పేర్కొనడం లేదు. లిబరల్ ఆలోచనాపరులందరిలో ఒక సారూప్యం కనిపిస్తోంది. వారంతా ఈ ఉద్యమాలను ఫాసిస్టు ఉద్యమాలు అని కాకుండా జాతీయవాద ఉద్యమాలు, తీవ్ర జాతీయవాద ఉద్యమాలు అంటున్నారు. ఇంకొందరు పాపులిస్టు, మితవాద పాపులిస్టు ఉద్యమాలు అని అంటున్నారు. కానీ ఎవరూ కూడా వీటిని ఫాసిస్టు ఉద్యమాలు అని మాత్రం పేర్కొనడం లేదు. రెండవ అంశం ఏమంటే ఈ ఫాసిస్టు ఉద్యమాలు ఉద్భవించడానికి వాళ్ళు రాజకీయ కారణాలు మాత్రమే చూపిస్తున్నారు. మన దేశంలో కూడా ఇదే ధోరణిని మనం చూడవచ్చు. మోడీ అధికారంలోకి రావడానికి కారణం బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత అద్వానీ రథయాత్రతో బిజెపి ఒక ప్రధాన శక్తిగా ముందుకు రావడం అని చెబుతున్నారు. ఈ కారణాల గురించి చెప్పడం తప్పని నేను అనను కానీ వీళ్లు అసలు లోతుల్లోకి వెళ్లడం లేదు. ఇటువంటి ఉద్యమాలు ప్రపంచమంతటా ఎందుకు తలెత్తుతున్నాయన్న విషయం జోలికి వీళ్లు వెళ్లడం లేదు.

ఇటలీలో ఫాసిజానికి ప్రతినిధి అయిన మెలోనీ ఈనాడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. జర్మనీలో ఫాసిస్టు శక్తి అయిన ఎఎఫ్‌డి (ఆల్టర్‌నేటివ్ ఫోర్స్) అనేది ఆ దేశంలో నేడు రెండవ ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగింది. అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చారు, తరువాత అధికారం నుండి తొలగించబడినా కూడా ఈ నాడు మళ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీదారుగా ఉన్నారు. టర్కీలో ఇటువంటి లక్షణాలే ఉన్న ఎర్డొగాన్ ప్రధాన శక్తిగా కొనసాగుతున్నాడు.


అందువల్ల ఫాసిస్టు శక్తులు ముందుకు రావడం అనేది ఒక్క భారత దేశంలోనే కాదు, మొత్తం ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్నది. ఇదో ప్రపంచ వ్యాపిత దృగ్విషయంగా తయారైంది. మరి ఇది ప్రపంచ వ్యాపిత దృగ్విషయం అయినప్పుడు దీనికి ఒకానొక దేశంలో ఒక రాజకీయ ఉద్యమం ఆధారంగా వివరణ ఇవ్వలేం. ఈ ఉద్యమాలు ఎంతమేరకు పెరిగాయి అని వివరించడానికి ఈ రాజకీయ ఉద్యమాలు తోడ్పడతాయన్న దాంట్లో సందేహం లేదు. అయితే ఈ ఉద్యమాలు ప్రపంచ స్వభావం కలిగి ఉన్నాయని మనం గుర్తుంచుకోవాలి.

ఈ ఉద్యమాలను ఫాసిజం అని అనకపోవడం చూస్తే మనకు ఆశ్చర్యం వేస్తుంది. ఎందుకంటే 1930వ దశకంలోని ఫాసిజంలో కనిపించే లక్షణాలన్నీ మనకు ఈ ఉద్యమాల్లో వివిధ స్థాయిల్లో కనిపిస్తాయి. ఈ లక్షణాలేమిటి? మొదటిది, ఒక అభాగ్యులైన మైనారిటీ గ్రూపును లక్ష్యం చేసుకోవడం. అది ముస్లిం మైనారిటీలు కావచ్చు లేక వలస వచ్చిన వారు కావచ్చు లేక నల్లజాతి వారు కావచ్చు లేకుంటే మైనారిటీ జాతులవారు కావచ్చు. ఇటువంటి ఒక అభాగ్యులైన మైనారిటీ గ్రూపుపై విద్వేష ప్రచారం చేస్తారు. వీరికి వ్యతిరేకంగా మెజారిటీ ప్రజానీకాన్ని సమీకరించి దాడులకు పాల్పడతారు. ఇది ఫాసిజపు ప్రాథమిక లక్షణం. రెండవ అంశం ఇది ఒక అణచివేతకు పాల్పడే నిరంకుశ రాజ్యాన్ని ఏర్పరుస్తుంది. మూడవది, ఇటువంటి అణచివేతకు పాల్పడే నిరంకుశ రాజ్యం ప్రజల మీద రాజ్యాన్ని ప్రయోగించి మాత్రమే అణచివేతకు పాల్పడదు. నిరంకుశత్వానికీ, ఫాసిజానికీ ప్రాథమిక బేధం ఒకటి ఉంది. నియంతృత్వం రాజ్యపు అణచివేత శక్తిని మాత్రమే ఉపయోగిస్తుంది. కానీ ఫాసిజం రాజ్యపు అణచివేతతో పాటు తన కింద పనిచేసే గూండా గుంపులను కూడా అణచివేతకు ఉపయోగిస్తుంది. ఎబివిపి గూండాలు విద్యాలయాల మీద దాడులకు పాల్పడే తీరు దీనికి మంచి ఉదాహరణ. వీళ్లు విద్యాలయాలమీదనే కాదు, ఇళ్లమీద కూడా దాడులు చేసి ప్రజలను వేధిస్తుంటారు. ఇటువంటి వీధి గూండాలను పోషించడం, ప్రజలను అణచివేయడానికి వారిని ఉపయోగించడం ఫాసిజం లక్షణాల్లో ముఖ్యమైనది. నాల్గవది, గుత్తపెట్టుబడిదారీ వర్గానికీ, ఫాసిజానికీ మధ్య సన్నిహిత సంబంధం ఉండడం ఒక ముఖ్యమైన లక్షణం. ఒక వ్యక్తి చుట్టూ అంతా తిరగడం, వ్యక్తి ఆరాధన పెంచడం చివరి లక్షణం. ఈ దృగ్విషయాన్ని మనం మన దేశంలో కూడా చూస్తున్నాం.

వాస్తవానికి భారతీయ ఫాసిజంలో మనకు ఫాసిజపు ప్రాథమిక లక్షణాలన్నీ కనిపిస్తాయి. 1930వ దశకం ఫాసిజంలో కనిపించే అన్ని లక్షణాలూ మన దేశంలోని ఫాసిజంలో ఉన్నాయి. ఒకనాడు హిట్లరు వెయ్యి సంవత్సరాల పగ గురించి మాట్లాడినట్లే ఇక్కడ మోడీ వెయ్యి సంవత్సరాల ప్రతీకారం గురించి మాట్లాడుతున్నారు. 1930వ దశకపు ఫాసిజంలో మనకు గుత్తపెట్టుబడిదారీ వర్గంతో

**"ప్రశ్న ఏమిటంటే, ప్రస్తుత తరుణంలో ఈ విధంగా ప్రపంచ వ్యాపితంగా ఫాసిజం ఎందుకు తలెత్తుతోంది? ఆధునిక సమాజాలన్నిటిలోనూ ఫాసిస్టు శక్తులు ఎల్లప్పుడూ ఉంటునే ఉంటాయి. అయితే అవి అక్కడక్కడా ఉంటాయి. వాటికి మీడియా మద్దతు, గుత్తపెట్టుబడి దారీ వర్గంలో ముఖ్యంగా కొత్త సెక్షన్ల మద్దతు లభించి నప్పుడు అవి ప్రాముఖ్యంలోకి వస్తాయి.  పెట్టుబడిదారీ వ్యవస్థ గుత్తపెట్టుబడిదారీ దశలో సంక్షోభంలో పడ్డప్పుడు గుత్తపెట్టుబడి దారులు అక్కడక్కడా ఉన్న ఇటువంటి ఫాసిస్టు శక్తులకు మద్దతిచ్చి కేంద్ర స్థానానికి తెస్తాయి."**

నయా-ఫాసిజం అనేది నయా-ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో పడినప్పుడు తలెత్తుతుంది. ఫాసిజం యొక్క రాజకీయ అంశాల మీద మాత్రమే కేంద్రీకరించే లిబరల్ ఆలోచనాపరులు నయా-ఫాసిజానికీ, నయా-ఉదారవాద ఆర్థిక విధానాలకూ మధ్య నున్న లింకును చూడ నిరాకరిస్తారు. నయా-ఉదారవాదం మంచిదే, ఫాసిజం మాత్రం చెడ్డది అని వారంటుంటారు.



**మితవాద తానులో గుడ్డలు: ట్రంప్ (అమెరికా), మోడీ (భారత్) మెలోనీ (ఇటలీ) ఎర్డొగాన్ (టర్కీ)**

ఫాసిజం మిలాఖత్ అవడమే కాడు గుత్తపెట్టుబడిదారుల్లో ఒక కొత్త సెక్షన్‌తో ఫాసిజానికి సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డం కనిపిస్తుంది. జర్మనీలో ఫాసిస్టులకు ఇనుము, ఉక్కు, ఆయుధాల వ్యాపారం చేసే గుత్త కంపెనీలతో సన్నిహిత సంబంధాలుండేవి. పారిశ్రామిక సంస్థలు నడిపే సంప్రదాయ గుత్తపెట్టుబడిదారులు ఫాసిస్టులతో అంత సిన్నిహిత సంబంధాలుండేవి కావు. జపాన్‌లో పాత ఐబత్సు గుత్త సంస్థల్లో ఒక కొత్త సెక్షన్ ఏర్పడింది. దాన్ని షింకో ఐబత్సు అనేవారు. నిస్సాన్ వంటివి ఈ సెక్షన్‌కు చెందినవి. వీటికి జపాన్ సైనిక ఫాసిజంతో అత్యంత సన్నిహిత సంబంధాలుండేవి. అదేవిధంగా భారత దేశంలో కూడా పాత గుత్తపెట్టుబడిదారీ వర్గం కాకుండా గుత్తపెట్టుబడిదారీ వర్గంలోని కొత్త సెక్షన్ భారతీయ ఫాసిస్టులతో అత్యంత సన్నిహిత సంబంధాలు నెరుపుతున్నారు. ఈ గుత్తపెట్టిబడిదారులెవరో నిత్యం ప్రజలు చర్చించుకుంటూనే ఉన్నారు.

ప్రశ్న ఏమిటంటే, ప్రస్తుత తరుణంలో ఈ విధంగా ప్రపంచ వ్యాపితంగా ఫాసిజం ఎందుకు తలెత్తుతోంది? ఆధునిక సమాజాలన్నిటిలోనూ ఫాసిస్టు శక్తులు ఎల్లప్పుడూ ఉంటునే ఉంటాయి. అయితే అవి అక్కడక్కడా ఉంటాయి. అయితే వాటికి మీడియా మద్దతు, గుత్తపెట్టుబడిదారీ వర్గంలో ముఖ్యంగా కొత్త సెక్షన్ల మద్దతు లభించినప్పుడు అవి ప్రాముఖ్యంలోకి వస్తాయి. ఒకానొక సమయంలో గుత్తపెట్టుబడిదారులు అక్కడక్కడా ఉన్న ఇటువంటి ఫాసిస్టు శక్తులకు ఎందుకు మద్దతిచ్చి కేంద్ర స్థానానికి తెస్తాయి? పెట్టుబడిదారీ వ్యవస్థ గుత్తపెట్టుబడిదారీ దశలో సంక్షోభంలో పడ్డప్పుడు ఈ పనిచేస్తాయి. 1930వ దశకం అటువంటి ఒక సంక్షోభ కాలం. అప్పుడు తీవ్రమైన ఆర్థిక మాంద్యం ఏర్పడింది. నిరుద్యోగం పెద్ద ఎత్తున పెరిగింది. ఇటువంటి పరిస్థితుల్లో తన ఆధిపత్యానికి ఎదురైన సవాలను అధిగమించడం కోసం గుత్త పెట్టుబడిదారీ వర్గం ఫాసిస్టులతో జతకలిసింది. బడావ్యాపార వర్గానికీ, ఫాసిస్టు శక్తులకూ మధ్య భాగస్వామ్యం వల్ల 1930నాటి ఫాసిజం ఏర్పడిందని మార్క్సిస్టు ఆర్థిక వేత్త మిఖాయిల్ కెలెన్‌స్కీ చెప్పారు. ఇటువంటి పరిస్థితే నేడు ప్రపంచ వ్యాపితంగా నెలకొని ఉంది. ఈ రోజున నయా-ఉదారవాద పెట్టిబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో పడింది. అందువల్లనే నేడు నయా-ఫాసిజం ముందుకు వచ్చింది. దీన్ని నేను నయా-ఫాసిజం అంటున్నాను. అలా ఎందుకంటున్నానో తరువాత వివరిస్తాను.

వాస్తవానికి నేను భావించేదేమంటే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 7వ మహాసభలో కామ్రేడ్ జార్జి డిమిట్రోవ్ చెప్పినట్లు సంక్షోభ సమయంలోనే ఫాసిజం తలెత్తుతుంది. ఫాసిజం అంటే ద్రవ్య పెట్టుబడి యొక్క అత్యంత అభివృద్ధి నిరోధక శక్తుల బహిరంగ ఉగ్రవాదం అని ఆయన నిర్వచించాడు.

నయా-ఉదారవాదం నేడు సంక్షోభంలో పడ్డది అన్న విషయం అందరికీ తెలుసు. అమెరికాలో గృహనిర్మాణ బుడగ బద్దలై సంక్షోభం ఏర్పడిన విషయాన్ని చూసినా, లేక రెండో ప్రపంచ యుద్ధం తరువాత దశాబ్దాల వారీగా ఆర్థికాభివృద్ధిని గమనించినా మనకు ఈ విషయం తెలుస్తుంది. ఈ అన్ని దశాబ్దాల్లోనూ అత్యంత తక్కువ అభివృద్ధి నమోదయింది 2019కి ముందటి దశాబ్దంలో మాత్రమే. ఈరోజు ప్రపంచంలో నిరుద్యోగం తీవ్రంగా ఉంది. మరోవైపు ఆర్థికాభివృద్ధి క్రమంగా మందగిస్తోంది. ఇటువంటి పరిస్థితి ఏర్పడ్డం మనకు ఆశ్చర్యం కలిగించదు. ఎందుకంటే నయా-ఉదారవాదం సృష్టించిన తీవ్రమైన అసమానతలు మనల్ని ఈ స్థితికి తెచ్చాయి. శ్రామికుల నిజవేతనాలు పడిపోతున్నాయి. బాగా అభివృద్ధి చెందిన అమెరికాలో కూడా

వారి శ్రామిక వేతనాలను నిరుద్యోగం బాగా ప్రబలిన వర్ధమాన దేశాల శ్రామికుల వేతనాలతో ముడిపెట్టారు. దాంతో అక్కడ కూడా నిజవేతనాలు తీవ్రంగా పడిపోతున్నాయి. మరోవైపు ట్రేడ్ యూనియన్ ఉద్యమం బాగా బలహీన పడిపోయింది. అమెరికా కార్మికులు సమ్మెచేస్తే తాము పరిశ్రమను ఇండోనేషియాకు తరలిస్తామని యజమానులు బెదిరిస్తున్నారు. అందువల్ల పెట్టుబడి దారులు ఒక దేశంలోని కార్మికులను మరో దేశంలోని కార్మికులతో పోటీపెట్టడం ద్వారా వారి నిజవేతనాలు తగ్గించేస్తున్నారు. అందువల్ల నిరుద్యోగ సైన్యం పెరగడం, మరోవైపు అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా నిజవేతనాలు తగ్గిపోవడం జరుగుతోంది. నోబుల్ బహుమతి పొందిన ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిట్జ్ వేసిన లెక్కల ప్రకారం 2011లో ఒక సగటు పురుష అమెరికన్ కార్మికుని నిజవేతనం 2016 నాటికి పెరగకపోగా, కొంచెం తగ్గింది. దీన్ని బట్టి కార్మకుల వేతనాల్లో ఎటువంటి స్తంభన ఏర్పడిందో మనకు అర్థమవుతుంది.

అన్ని చోట్లా కార్మికుని ఉత్పాదకత పెరుగుతోంది, కానీ నిజవేతనాలు స్తంభించిపోయాయి. ఉత్పాదకత పెరుగుతూ దాని వల్ల లభించే మిగులు కార్మికులకు చేరకపోవడంతో ఉత్పాదకత పెరగడం వల్ల వచ్చే మిగులు అంతా పెట్టుబడిగా మారిపోతోంది. ఈ విధంగా మిగులు పెరిగిపోవడం అంటే అర్థం కార్మికుల కొనుగోలు శక్తి పడిపోవడం, మార్కెట్‌లో గిరాకీ తగ్గిపోవడం. ఎందుకంటే కార్మిక ప్రజలకు వచ్చే ఆదాయం అంతా ఖర్చయిపోతోంది, కానీ మిగులుగా తేలినదాన్లో కొద్దిగా మాత్రమే ఖర్చవుతూ ఎక్కువ భాగం పొదుపులోకి పోతోంది. అందువల్ల పెట్టుబడిదారీ వ్యవస్థలో అసమానతలు పెరుగుతున్న కొద్దీ అధికోత్పత్తి సమస్య ముందుకొస్తుంది. అయితే ఈ ధోరణిని కొన్ని రకాల ఆస్తుల ధరల పెరుగుదల బుడగలను సృష్టించడం ద్వారా కొంతవరకు నియంత్రించ గలిగారు. అమెరికాలో వివిధ రకాల ఆస్తుల కృత్రిమ పెరుగుదల దీనికి ఒక ఉదాహరణ, మొదట అక్కడ డాట్ కామ్ బూమ్ బుడగ వచ్చింది. డాట్ కామ్ కంపెనీల ఈక్విటీ ధరలు విపరీతంగా పెరిగాయి. అందువల్ల ప్రజలు తాము ధనవంతులమైపోయామని భావించి, మార్కెట్‌లో ఖర్చు చేయడం ప్రారంభించారు. డాట్ కామ్ బుడగ పేలిపోయిన తరువాత స్టాక్ మార్కెట్లు పడిపోవడం ప్రారంబించాయి. దాంతో

> **❝ సాధారణ ఫాసిజం అధికారంలోకి వచ్చాక ఉపాధిని పెంచింది. జపాన్‌లో మిలిటరీ ఫాసిస్టు ప్రభుత్వం తొలిసారిగా మహా మాంద్యం నుండి దేశాన్ని బయటపడేసింది. నిజానికి ఫాసిస్టు పాలనలో జపాన్ పూర్తి స్థాయి ఉపాధి సాధించింది. జర్మనీలో హిట్లరు అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి స్థాయి ఉపాధిని సాధించింది. వారు ప్రభుత్వ రుణాలు సేకరించి సైనిక వ్యయం పెంచడం ద్వారా దాన్ని సాధించారు. ఇదంతా నాటి ఫాసిస్టు ప్రభుత్వాల హయాంలో జరిగింది. ❞**




నయా-ఉదారవాదం, నయా-ఫాసిజం అనే అంశంపై
కామ్రేడ్ ఇఎంఎస్ స్మారకోపన్యాసం చేస్తున్న ప్రభాత్ పట్నాయక్

అమెరికా ఫెడరల్ రిజర్వు అధిపతి అలెన్ గ్రీన్‌స్పాన్ స్వయంగా మరో బుడగను ప్రారంభించాడు. అది హౌసింగ్ బుడగ. ఈ బుడగ అమెరికా ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కొంతకాలం ముందుకు పోవడానికి దోహదపడింది. ఈ బుడగలన్నీ చేసే పని ఏమిటంటే అవి కొన్ని రకాల ఆస్తుల విలువలను కృత్రిమంగా పెంచుతాయి. దాంతో ఆ ఆస్తులను కలిగిన ప్రజలు తాము ధనవంతులమైనట్లు భావించి ఖర్చుచేయడం ప్రారంభిస్తారు. తద్వారా మార్కెట్‌లో గిరాకీ సృష్టంచబడుతుంది.

హౌసింగ్ బుడగ తరువాత అమెరికా వడ్డీ రేట్లు బాగా తగ్గించినప్పటికీ, ఒక విధంగా చెప్పాలంటే సున్నా వడ్డీకి తగ్గించినప్పటికీ మరో బుడగను సృష్టించలేకపోయారు. ఎందుకంటే గత బుడగల కాలంలో ప్రజలు అసలు విషయం తెలుసుకున్నారు. కనుక వారిలో ఈ బుడగల పట్ల భ్రమలు తొలగిపోయాయి. స్పెక్యులేషన్స్ పట్ల వారు మరింత జాగ్రత్త వహించడం ప్రారంభించారు. అందువల్ల బుడగలను ఎల్లకాలం సృష్టించడం సాధ్యం కాదు, ఎందుకంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ స్తంభించి పోయిన దశకు చేరుకున్నది. అందువల్ల ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయిన ఈ కాలంలో సహజంగానే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యానికి సవాళ్లు ఎదురవుతాయి. ప్రజలు నిరుద్యోగాన్ని ప్రశ్నిస్తారు. సంక్షేమ వ్యవస్థలు కుప్పకూలిపోతాయి. అందువల్ల సంక్షేమ రాజ్యవ్యవస్థ కావాలని డిమాండ్ చేస్తారు. ప్రభుత్వ వ్యయం ద్వారా గిరాకీని సృష్టించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతారు. ఇటువంటి పరిస్థితిని ఎదుర్కొనడానిక గుత్త పెట్టుబడి ఇష్టపడదు. ఈ పరిస్థతి రాకూడదని, నయా-ఉదారవాద వ్యవస్థకు ఎటువంటి ప్రమాదం రాకూడదని కోరుకుంటుంది. సోషలిస్టు వ్యవస్థనుండి పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రమాదం మాట అటుంచండి తను సృష్టించిన నయా-ఉదారవాద వ్యవస్థకు కూడా ప్రమాదం రాకూడదని కోరుకుంటుంది. చాలామంది అడుగుతుంటారు. ప్రపచంలో కొద్దిపాటి సోషలిస్టు దేశాలున్నప్పటికీ పెట్టుబడిదారీ వ్యవస్థకు 1930వ దశకంలో సోవియట్

**"అందువల్ల సాధారణ ఫాసిజానికి సంక్షోభం నుండి గట్టెక్కించే లక్షణం ఉంది. అందుకనే 1933లో పూర్తి స్థాయి ఉపాధి కల్పించడం, 1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడానికి మధ్య ఫాసిస్టులు ప్రజల్లో మద్దతు కూడగట్టుకోగలిగారు. ఆ విధంగా వారు మహా మాంద్యం నుండి బయట పడ్డారు. కానీ నేటి ఫాసిజం ఆ పనిచేయగలిగే స్థితిలో లేదు."**

యూనియన్ నుండి వచ్చినట్లు సోషలిస్టు వ్యవస్థ నుండి ప్రమాదం లేదు కదా, అలాంటప్పుడు దానికి ఫాసిజాన్ని కోరితెచ్చుకోవలసిన అవసరం ఏమిటి అని.

ప్రస్తుతం సోషలిస్టు దేశాల నుండి లేక సోషలిస్టు ప్రపంచం నుండి పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రమాదం లేదన్న మాట నిజమే కానీ ప్రజలు ఈ నయా-ఉదారవాద వ్యవస్థ నుండి విముక్తి కావాలని కోరుకుంటే దాన్ని పెద్ద ప్రమాదంగా నయా-ఉదారవాదం భావిస్తుంది. ఎందుకంటే ప్రస్తుతం అది నయా-ఉదారవాదాన్ని వదులుకోగల స్థితిలో లేదు. అందువల్ల నయా-ఉదారవాద ఆధిపత్యాన్ని అంగీకరించబోమని ప్రపంచ ప్రజలు డిమాండు చేస్తారేమోనని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి భయపడుతోంది. అందుకనే వాళ్లు నయా-ఫాసిజంతో జట్టుకడుతున్నారు. నయా-ఫాసిజంతో జట్టు కడితే అది ప్రజల మననులను అనలు నమన్యలనుండి మళ్లించేస్తుంది. ప్రజలు నిరుద్యోగం, అధిక ధరలు, ద్రవ్యోల్బణం, లేక ప్రజల జీవన ప్రమాణాలు వంటి అంశాల మీద మాట్లాడకుండా యూదులపై విద్వేషం, ముస్లింలపై విద్వేషం, నల్లజాతి వారిపట్ల విద్వేషం లేక వలన వచ్చిన ప్రజల పట్ల విద్వేషం వెళ్లగక్కుతుండేట్లు చేస్తారు. కార్మికవర్గంలో పెరిగే ప్రతి విద్వేషం కార్మికుల దృష్టిని ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం నుండి పక్కకు మళ్లిస్తుంది.

ఇక్కడే సాధారణ ఫాసిజానికీ నయా-ఫాసిజానికీ మధ్య తేడా కనపడుతుంది. అందుకే నేను దీన్ని నయా-ఫాసిజం అంటున్నాను. అయితే ఈ పదాన్ని నేను సృష్టించలేదు. దీన్ని ఇటీవలి కాలంలో బాగా ఉపయోగిస్తున్నారు. సాధారణ ఫాసిజానికీ, నయా-ఫాసిజానికి మధ్య తేడా ఏమిటి?

సాధారణ ఫాసిజం అధికారంలోకి వచ్చాక ఉపాధిని పెంచింది. జపాన్‌లో మిలిటరీ ఫాసిస్టు ప్రభుత్వం తొలిసారిగా మహా మాంద్యం నుండి దేశాన్ని బయటపడేసింది. నిజానికి ఫాసిస్టు పాలనలో జపాన్ పూర్తి స్థాయి ఉపాధి సాధించింది. జర్మనీలో హిట్లరు అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి స్థాయి ఉపాధిని సాధించింది. వారు ప్రభుత్వ రుణాలు సేకరించి సైనిక వ్యయం పెంచడం ద్వారా దాన్ని సాధించారు. ఇదంతా నాటి ఫాసిస్టు ప్రభుత్వాల హయాంలో జరిగింది. ఫాసిస్టు ప్రభుత్వాలు సైనిక రంగాన్ని పెంచి పోషించడం వల్ల అనివార్యంగా యుద్ధానికి దారితీసింది. అందువల్ల ఆ ఫాసిజం ఒక ప్రత్యేక పద్ధతిని అనుసరించడం ద్వారా అంటే సైనికీ కరణ ద్వారా ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించగలిగింది. అదే నమయంలో అప్పుడు నిరుద్యోగాన్ని అధిగమించడానికి మరో ప్రత్యామ్నాయ మార్గం కూడా అనుసరించబడింది. అది అమెరికాలో అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ హయాంలో అమలు చేసిన "న్యూ డీల్". రూజ్‌వెల్ట్ ప్రభుత్వం న్యూ డీల్ ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని పెంచింది. సైనిక వ్యయం ఒక్కటే కాదు, రోడ్లు నిర్మిండం, సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టుడం వంటి వాటి ద్వారా ప్రభుత్వ వ్యయం చేసింది. అయితే అమెరికా గుత్త పెట్టుబడిదారీ సంస్థలు వెనువెంటనే 'న్యూ డీల్'ను వ్యతిరేకించాయి. దాంతో దాన్ని వెంటనే ఉపసంహరించు కోవడం కూడా జరిగింది. దాంతో 1937లో అమెరికాలో మరో సంక్షోభం తలెత్తింది. చివరికి లిబరల్ పెట్టుబడిదారీ ప్రపంచం రెండవ ప్రపంచ యుద్ధం తరువాత మాత్రమే మహా మాంద్యం నుండి బయటపడగలిగింది.

అందువల్ల సాధారణ ఫాసిజానికి సంక్షోభం నుండి గట్టెక్కించే లక్షణం ఉంది. అందుకనే 1933లో పూర్తి స్థాయి ఉపాధి కల్పించడం, 1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడానికి మధ్య ఫాసిస్టులు ప్రజల్లో మద్దతు కూడగట్టుకోగలిగారు. ఆ విధంగా వారు మహా మాంద్యం నుండి బయట పడ్డారు.

కానీ నేటి ఫాసిజం ఆ పనిచేయగలిగే స్థితిలో లేదు. దానికి కారణం ఏమంటే... ఇప్పుడు ప్రభుత్వం గనుక గిరాకీ పెంచాలనుకుంటే అది ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రజలనుండి అదనపు పన్నులు వసూలు చేయకుండా, వారి కొనుగోలు శక్తిని తగ్గించకుండా ప్రభుత్వ వ్యయం పెంచడానికి కున్న ఏకైక మార్గం ద్రవ్య లోటును పెండం మాత్రమే. అలా కాకుండా పెట్టుబడిదారులపైనా, లేక ప్రజల పైన పన్నులు వేయడం ద్వారా కూడా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవచ్చు. పెట్టుబడిదారుల పై లేక ధనికులపై అదనపు పన్నులు వేస్తే వారి ఖర్చులు కొంచెం తగ్గుతాయి అంతే. ఉదాహరణకు పెట్టుబడిదారులకు వందరూపాయలు ఆదాయం వస్తే వారు అంతా ఖర్చు చేయరు. సగం పొదుపు చేస్తారు అనుకుందాం. ప్రభుత్వం వారిపై పన్నువేస్తే వారి ఖర్చులు సగం మాత్రమే తగ్గుతాయి. అందువల్ల గిరాకీ సగం పెరుగుతుంది. కానీ ప్రభుత్వం ఇప్పటికే తమ ఆదాయాన్నంతటినీ వ్యయం చేసేస్తున్న శ్రామికులపై పన్నులు పెంచితే అప్పుడు శ్రామికుల నుండి గిరాకీ ఏమాత్రం పెరగదు. ఎందుకంటే వారి దగ్గర అదనపు మిగులు ఏమీ ఉండదు కనుక. అందువల్ల ప్రభుత్వం సృష్టించిన అదనపు గిరాకీ మేరకు కార్మికుల నుండి గిరాకీ తగ్గిపోతుంది. దాని వల్ల మొత్తం గిరాకీ పెరిగడం జరగదు. అందువల్ల ప్రభుత్వం వ్యయం ద్వారా గిరాకీ పెంచాలంటే రెండే మార్గాలున్నాయి. ఒకటి ద్రవ్య లోటు పెంచడం. లేక ధనికులపై పన్నులు వేయడం. ద్రవ్య పెట్టుబడి ముందు ఈ రెండు వాస్తవిక పరిస్థితులున్నాయి.

జాతి రాజ్యం ఈ రెండు మార్గాల్లో ఏది ఎన్నుకోవాలన్నా దాని పైన ఉన్న అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలకు లోబడి చేయాలి. లేకుంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆ దేశాన్ని వదిలి పారిపోతుంది. అయితే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ధనికుల మీద పన్ను వేయడానికి అంగీకరించదు, అదే నమయంలో ద్రవ్యలోటు పెంచడాన్నీ అంగీకరించదు. అందువల్లనే జాతి రాజ్యాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఒక దేశంలో లిబరల్ బూర్జువా ప్రభుత్వం ఉన్నా లేక నయా-ఫాసిస్టు ప్రభుత్వం ఉన్నా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలను పాటించాల్సిందే లేకుంటే ద్రవ్య పెట్టుబడి దేశం విడిచి

పారిపోతుంది గనుక అవి సంక్షోభాన్ని ఎదుర్కొనక తప్పదు. ఈ లక్షణం వల్లనే నేను ప్రస్తుతం పెరుగుతున్న ఫాసిజాన్ని నయా-ఫాసిజం అంటున్నాను. ఇది గతంలో లాంటి సాధారణ ఫాసిజం కాదు. యుద్ధం ద్వారా ఇది సంక్షోభాన్ని అదిగమించలేదు. కాకపోతే ఎన్నికల్లో ఓటమి పొందొచ్చు. అమెరికా ఎన్నికల్లో ట్రంప్ ఓటమి పాలైనట్లు. అయితే ఓడిపోయిన నయా-ఫాసిస్టులు తరువాత మళ్లీ అధికారంలోకి వస్తారు.

అందువల్ల ఈ నయా-ఫాసిజం గతంలోని సాధారణ ఫాసిజం అంత ప్రమాదకారి కాకపోవచ్చు, అనివార్యంగా యుద్ధాలకు దారితీయకపోవచ్చు కానీ ఇది నయా-ఉదారవాదం యొక్క ఉత్పత్తి అనేది స్పష్టం. ఈ నయా-ఫాసిజం అనేది నయా-ఉదారవాద ప్రభుత్వపు అంతిమ వ్యక్తీకరణ. ఈ నయా-ఫాసిజాన్ని శాశ్వతంగా ఓడించగలమా అంటే ఓడించగలం. శాశ్వతంగా ఓడించడం అంటే అర్థం ఎన్నికల్లో ఓడించడం కాదు. ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారి అది తిరిగి లేస్తూనే ఉంటుంది. నయా-ఉదారవాదాన్ని శాశ్వతంగా ఓడించినప్పుడు మాత్రమే నయా-ఫాసిజాన్ని శాశ్వతంగా మట్టుబెట్ట గలం. నయా-ఉదారావాదాన్ని శాశ్వతంగా ఓడించాలంటే మనం మన ప్రత్యామ్నాయ విధానాన్ని ప్రజల ముందుంచాలి. అంటే సోషలిజాన్ని తక్షణం ప్రజల ముందు ప్రత్నాయాంగా ఉంచాలని నేను అనను. ఉపాధికల్పించే, సంక్షేమాన్ని సమకూర్చే విధానాలను ప్రజల ముందుంచాలి. ఈ పనిచేసే క్రమంలోనే పెట్టుబడిపై నియంత్రణ, వాణిజ్యంపై నియంత్రణ జరుగుంది. ఈ క్రమంలోనే దేశం యొక్క స్వయం ప్రతిపత్తి పునరుద్ధరించబడుతుంది. అంటే ప్రజల స్వావలంబన పున:ప్రతిష్టాపించబడుతుంది. ఈ పనులన్నీ చేసే క్రమంలోనే దేశం సోషలిజంవైపు పయనిస్తుంది.

> **❝ నయా-ఉదారావాదాన్ని శాశ్వతంగా ఓడించాలంటే మనం మన ప్రత్యామ్నాయ విధానాన్ని ప్రజల ముందుంచాలి. అంటే సోషలిజాన్ని తక్షణం ప్రజల ముందు ప్రత్నాయాంగా ఉంచాలని నేను అనను. ఉపాధికల్పించే, సంక్షేమాన్ని సమకూర్చే విధానాలను ప్రజల ముందుంచాలి. ఈ పనిచేసే క్రమంలోనే పెట్టుబడిపై నియంత్రణ, వాణిజ్యంపై నియంత్రణ జరుగుంది. ఈ క్రమంలోనే దేశం యొక్క స్వయం ప్రతిపత్తి పునరుద్ధరించబడుతుంది. ఈ పనులన్నీ చేసే క్రమంలోనే దేశం సోషలిజంవైపు పయనిస్తుంది. ❞**

అందువల్ల నేడు పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రతిష్టంభనలో పడింది, ఫాసిజం అనేది ఈ ప్రతిష్టంభన యొక్క వ్యక్తీకరణ. ఈ ప్రతిష్టభనను ఛేదించడం పెట్టుబడిదారీ వ్యవస్థ వల్ల కాదు. సోషలిజం వల్లనే సాధ్యమవుతుంది. ❋

# స్వర్ణయుగంలో సామాన్యులు

**(18వ పేజీ తరువాయి)**

కుల వ్యవస్థకు శూద్రులనుండి ఎదురవుతున్న వ్యతిరేకతను ఒక ముప్పుగా పరిగణిస్తూ, ఆ వ్యతిరేకతను అధర్మం అని వర్ణిస్తూ మహా భారతం శాంతి పర్వంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. అనుశాసనపర్వం లో శూద్రులు రాజు వినాశనాన్ని కోరుతారని, ధర్మాన్ని ధిక్కరిస్తారని నిందించారు. ఈ ప్రస్తావనలు అప్పటి సమాజంలో పాలకులకు శూద్ర కులాలకు నడుమ పెరుగుతున్న వైరుధ్యాన్ని సూచిస్తున్నాయి.

సమాజంలో పాలకులకు ఎదురయే సవాళ్ళను అదుపు చేయడానికి మతాన్ని ఒక సాధనంగా ఉపయోగించారు. భగవద్గీత ఇందుకు తార్కాణం. కర్మసిద్ధాంతం పేరుతో కుల వ్యవస్థను సమర్థించడం, వర్ణ వ్యవస్థను గనుక ధిక్కరించి ఉల్లంఘిస్తే ఆ పాపానికి శిక్షగా వచ్చే జన్మలో మనింత నీజమైన పుట్టుక ప్రాప్తిస్తుందంటూ పునర్జన్మ అనే భావనను ప్రచారం చేయడం భగవద్గీతతో తేలికగా సాధ్యపడింది.

భక్తి అనే భావనను బలంగా ప్రచారం చేసి దైవాన్ని ఆరాధించి తమకు ముక్తి ప్రసాదించమని వేడకోవడం ఒక్కటే పరిష్కారంఅంటూ శూద్రులను అదుపులో ఉంచారు. తద్వారా తమ ఆధిపత్యాన్ని శూద్రులు సవాలు చేయకుండా జాగ్రత్త పడ్డారు. భక్తి ప్రచారం ప్రాధ్యానత పెరగడంతో బౌద్ధం, జైనం వెనక్కు నెట్టబడ్డాయి. వైష్ణవం, శైవం ప్రధానంగా ముందుకొచ్చాయి. అవి పాలకుల విశేష ఆదరణతో బలపడ్డాయి. దశావతారాల గురించి, పాపం పండితే ఆ పాపులను శిక్షించడానికి దేవుడే స్వయంగా అవతారం ఎత్తి భూమిమీద పాపుల్ని శిక్షంచడానికి వస్తాడని, అప్పటికవరూ పది అవతారాలను ఎత్తాడని, తర్వాత అవతారంగా కల్కి రూపంలో వస్తాడని- ఇలా ప్రచారం చేశారు. దాని ప్రభావాని లోనైన వారు తమపై సాగే అణచివేతను గుర్తించినా, అణచివేతకు పాల్పడుతున్నవారి పాపం పండి వారిని శిక్షంచడానికి దైవం ఎప్పుడు అవతరిస్తాడా అని ఎదురు చూడడం మొదలైంది. శూద్ర ప్రజల మనోభావాలను ఈ విధంగా నియంత్రించడం జరిగింది. ఈ ప్రచారం ప్రధానంగా వైష్ణవ మతం ద్వారా జరిగింది. ఆ తర్వాత శివుడు కూడా 23 అవతారాలు ఎత్తాడంటూ శైవులు ప్రచారం అందుకున్నారు కాని ఆ ఫార్ములా వారికి పెద్దగా పని చేయలేదు. శూద్రుల మత విశ్వాసాలమీద కూడా వైష్ణవం, శైవం ప్రభావం చూపాయి. వివిధ తెగలుగా ఉన్నకాలం నుంచీ ఎక్కడికక్కడ గ్రామ దేవతలను కొలుస్తూ వచ్చారు శూద్రులు. ఇప్పటికీ ఆ ఆనవాయితీ కొనసాగుతోంది. ఐతో ఒకప్పుడు స్వతంత్ర దేవతలుగా, వైదిక, బ్రాహ్మణ మతంతో సంబంధం లేకుండా ఉన్న ఆ గ్రామ దేవతలు కాస్తా ఇప్పుడు పార్వతీదేవి అవతారాలుగానో, లక్ష్మీదేవి అవతారాలుగానో మారిపోయి వైదిక, బ్రాహ్మణ మతంలో అంతర్భాగం అయిపోయారు. ఆ విధంగా శూద్రుల మతాచారాలపై బ్రాహ్మణ మతం ఆధిపత్యం సాధించింది. రాజును ధిక్కరించడం దైవ ధిక్కరణతో సమానం అని, రాజు దైవాంశతో పుట్టినవాడని భక్తి ఉద్యమం ప్రచారం చేసింది.

బౌద్ధం, జైనం శాఖోపశాఖలుగా చీలిపోయి బలహీనపడ్డాయి. గుప్తుల కాలం నాటికే భారత ఉపఖండంలోకి క్రైస్తవం ప్రవేశించింది. మలబారు ప్రాంతంలో ఒక సిరియన్ చర్చిని స్థాపించారు.

ఈ రెండో పార్శ్వాన్ని కూడా పరిశీలించాక, గుప్తుల కాలం పాలక ఫ్యూడల్ వర్గాలకు స్వర్ణ యుగం గాను, పాలితులకు శ్రమజీవులకు నరకప్రాయంగాను ఉన్నట్టు అర్థం అవుతుంది. శూద్రులను అణచివుంచడంలో పాలకులకు ప్రధాన సాధనంగా మతం పోషించిన పాత్ర కూడా బోధపడుతుంది. ❋

# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఏం జరుగుతోంది?



రచయిత ప్రముఖ
పాకిస్తానీ పాత్రికేయుడు

**ఇఫ్తికర్ జిలాని**

పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె)లో కొంత కాలంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. ఈ ఆందోళనలపై భిన్న ప్రచారం సాగుతోంది. పిఓకెను తిరిగి స్వాధీనం చేసుకుంటామని కొందరు భారతీయ నాయకులు ప్రకటిస్తున్నారు. దీనికోసం పాకిస్తాన్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలని కూడా అక్కడి ప్రజలకు వారు పిలుపునిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు పిఓకెలో ఏం జరుగుతోంది అన్న విషయం తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది.

జమ్మూ కాశ్మీర్ ... సుందరమైన ప్రాంతం, కానీ, ఈ ప్రాంతం తరచు రాజకీయంగా అల్లకల్లోలానికి గురవుతుంటుంది.

ఇక్కడ చరిత్ర ఒక క్రమ పద్ధతి ప్రకారం పునరావృత్తమవుతుంటుంది. ఇప్పుడు కూడా అటువంటి పరిస్థితే. అయితే, ఈ సారి ఆ అస్థిరత, అశాంతి పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో చెలరేగాయి. రాజకీయ భ్రమలు, ఆర్థిక అసమానతలు ఈ ఆందోళనలకు మూలం.

**1987లో భారత్ భూభాగంలో....**


1987లో జమ్మూకాశ్మీర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున రిగ్గింగ్ జరిగిందన్న విమర్శలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో గెలిచిన ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ కూటమి విద్యుత్ రంగ సంస్కరణలను చేపట్టింది. సంస్కరణల్లో భాగంగా విద్యుత్ ఛార్జీలను పెంచింది. దీంతో ప్రజల నుండి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. శ్రీనగర్‌లోని పాత నగరంలో తీవ్ర స్థాయిలో నిరసనలు చోటుచేసుకున్నాయి. పోలీసులు కాల్పులు జరపడంతో నలుగురు వ్యక్తులు మరణించారు. ఈ నిరసనలు చాలా వేగంగా కాశ్మీర్ అంతా వ్యాపించాయి. అజాదీ (స్వేచ్ఛ) కోసం డిమాండ్ చేయడానికి దారి తీశాయి. మూడు దశాబ్దాల కాలంగా పాకిస్తాన్ మద్దతుతో కొనసాగిన ఆందోళనలు, ఘర్షణలకు ఇది నాంది!

**ఇప్పుడు పిఓకెలో**

పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె)లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు అప్పటి భారత్‌లో జరిగిన సంఘటనలనే గుర్తు చేస్తున్నాయి. పాకిస్తాన్‌లో ప్రస్తుతం ద్రవ్యోల్బణం 17శాతం దాటి పరుగులు పెడుతోంది. అదే సమయంలో ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచాలని నిర్ణయించింది. ఈ చర్యను స్థానికులు వ్యతిరేకించారు. పెద్ద ఎత్తున రోడ్లలోకి వచ్చారు. నిరసనలు కొనసాగడంతో ప్రభుత్వం తన బలగాలను రంగంలోకి దించింది. ఫలితంగా నలుగురు వ్యక్తులు మరణించారు. పౌరహక్కుల ఉద్యమం తన తక్షణ డిమాండ్లను సాధించే క్రమంలో పాలన, ఆర్థిక అస్థిరతతో కొనసాగుతున్న సమస్యలను చర్చనీయాంశం చేయడం సహజమే!

70శాతం జనాభాతో ఉన్న 55 శాతం జమ్మూకాశ్మీర్ భూమిని భారత్ నియంత్రిస్తుంటే, మరో 30శాతం భూమిని పాకిస్తాన్ నియంత్రిస్తోంది. ఈ భూభాగమంతటికీ ప్రత్యేక పరిపాలనా వ్యవస్థను పాక్ నాయకత్వం ఏర్పాటు చేసింది. దీనిని మిగిలిన ప్రాంతం నుండి వేరు చేసింది. మిగిలిన 15 శాతం భూ భాగం చైనా నియంత్రణలో ఉంది. ఈ భూభాగంలోనే అక్సాయ్ చిన్‌తో పాటు ఎక్కువ జనావాసాలు లేని ట్రాన్స్-కోరకం ప్రాంతాలు ఉన్నాయి.

## పాక్ పార్లమెంటులో మాకు స్థానం లేదు




**జస్టిస్ (రిటైర్డ్) సయ్యద్ మంజూర్ హుస్సేన్ గిలానీ**

పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె) మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సయ్యద్ మంజూర్ హుస్సేన్ గిలానీ ఈ ప్రాంతంలో చోటుచేసుకున్న పరిణామాల గురించి ఇటీవల మాట్లాడారు. జమ్మూకాశ్మీర్ సరిహద్దు ప్రాంతమైన కర్నాహ్‌లో పుట్టి పెరిగిన ఆయన జీవిత కథ బాలీవుడ్ చిత్రం మాదిరి ఉంటుంది. ఆయన తల్లితండ్రులు పిఓకె కి 1947లో వెళ్లారు. అప్పటికి గిలానీకి రెండు సంవత్సరాల వయసు మాత్రమే ఉండటంతో ఆయన్ను తాత సంరక్షలో ఉంచారు. యుద్ధం ప్రారంభం కావడంతో వారు తిరిగి

2019 ఆగస్టు 5న భారత్ వైపు ఉన్న ప్రాంతాన్ని జమ్మూ-కాశ్మీర్, లడక్‌గా రెండు వేర్వేరు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించారు. కాశ్మీర్ లోయలోని కుప్వారా, బారాముల్లా జిల్లాల సరిహద్దుల్లో పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పిఓకె)లోని నీలమ్, ముజఫరాబాద్ ప్రాంతాలు ఉన్నాయి. భాగ్, పాలింద్రి, రావల్‌కోట్, కోట్లి, మీర్‌పూర్, బాంభర్‌తో సహా మరికొన్ని ప్రాంతాలు జమ్ము డివిజన్‌కు అవతలివైపున ఉన్నాయి. భారతదేశం, పాకిస్తాన్‌ల నియంత్రణలో ఉన్న భూ భాగాల్లో జాతి, భాష వంటి వాటిల్లో కొంతమేర పోలికలు ఉన్నాయి. ఇవి 1846 నాటి అమృత్‌సర్ ఒప్పందం (మొదటి ఆంగ్లో -సిక్కు యుద్ధం తరువాత, జమ్మూ రాజు గులాబ్‌సింగ్‌కు ఈస్ట్ ఇండియా కంపెనీకి మధ్య కుదిరిన ఒప్పందం)లో భాగంగా గీసిన సరిహద్దుల ద్వారా అనుసంధానింపబడి ఉన్నాయి. ఇది ఇప్పటికీ అధికారక మ్యాపుల్లో కనిపిస్తుంది. నియంత్రణ రేఖ (లైన్ ఆఫ్ కంట్రోల్ -ఎల్ఓసి) అంతటా నివసించే వ్యక్తులు ఒకరి వ్యవహారాల పట్ల మరొకరు ఉదాసీనంగా వ్యవహరిస్తారు. అయితే, వారి రాజకీయ భవిష్యత్తు మాత్రం వారి భూభాగంపై అక్కడి ప్రభుత్వాలు చేసే వాద, ప్రతివాదనలపై ఆధారపడి ఉన్నాయి. చారిత్రాత్మకంగా చూస్తే పిఓకె రాజకీయ అశాంతికి కేంద్రంగా లేదు. 1992లో అక్కడ చివరిసారిగా పెద్ద ఆందోళన జరిగింది. నియంత్రణ రేఖ దాటాలని జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ ప్రజలకు ఇచ్చిన పిలుపు హింసాత్మక సంఘటనలకు దారి తీసింది. పాక్ సైన్యంతో జరిగిన ఘర్షణల్లో 12 మంది పౌరులు మరణించారు. 150 మంది గాయపడ్డారు. ఆ తరువాత ఆ ప్రాంతంలో తీవ్ర స్థాయి నిరసనలేవి నమోదు కాలేదు.

> **❝2021 సార్వత్రిక ఎన్నికల నుండి పిఓకె ముగ్గురు ప్రధాన మంత్రులను చూసింది. 2021లో అప్పటి పాకిస్తాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ పార్టీ మెజార్టీ సాధించిన తరువాత సర్దార్ అబ్దుల్ ఖయ్యూమ్ నియాజీ ప్రభుత్వాధినేతగా నియమితు లయ్యారు. అయితే, తక్కువ కాలంలోనే ఆయనను తొలగించి వ్యాపారవేత్త తన్వీర్ ఇలియాస్‌ను నియమించారు. ఒక సంవత్సరం తరువాత ఖాన్ పార్టీకే చెందిన చౌదరీ అన్వర్ ఉల్ హక్ ఆ పార్టీ నుండి బయటకు వచ్చి ప్రధాన రాజకీయ పార్టీల మద్దతుతో ప్రధాని పదవిని చేపట్టారు.❞**



పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజా నిరసన

**నాలుగేళ్లలో ముగ్గురు ప్రధానులు**

2021 సార్వత్రిక ఎన్నికల నుండి పిఓకె ముగ్గురు ప్రధానమంత్రులను చూసింది. 2021లో అప్పటి పాకిస్తాన్ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ పార్టీ మెజార్టీ సాధించిన తరువాత సర్దార్ అబ్దుల్ ఖయ్యూమ్ నియాజీ ప్రభుత్వాధినేతగా నియమితులయ్యారు. అయితే, తక్కువ కాలంలోనే ఆయనను తొలగించి వ్యాపారవేత్త తన్వీర్ ఇలియాస్‌ను నియమించారు. ఒక సంవత్సరం తరువాత ఖాన్ పార్టీకే చెందిన చౌదరీ అన్వర్ ఉల్ హక్ ఆ పార్టీ నుండి బయటకు వచ్చి ఇమ్రాన్

రాలేకపోయారు. గిలానీ బారాముల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివాడు. అలీఘర్ ముస్లిం యూనివర్శిటీలో న్యాయవిద్య అభ్యసించాడు. 1970వ దశకం చివర్లో మొదటిసారి తన తల్లితండ్రులను ఆయన కలిశాడు. అప్పుడు ఆయనను తమతో పాటే ఉండాలని వారు ఒప్పించారు. గిలానీ అడ్వకేట్ జనరల్, యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, చీఫ్ జస్టిస్ వంటి పదవులను నిర్వహించారు. ఐదు పుస్తకాలను రచించారు. ఇటీవల ముజఫరాబాద్ నుండి ఫ్రంట్‌లైన్‌తో పిఓకెలో పరిస్థితి గురించి మాట్లాడారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు :

**ప్ర : పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో సంక్షోభం ఒక్కసారిగా ఎందుకు పెరిగింది?**

జ: అన్ని ప్రాంతాలకు సమానంగా సబ్సిడీలు ఇవ్వాలన్న ప్రజల డిమాండ్‌ను ప్రభుత్వం విస్మరించింది. ముఖ్యంగా పిండి ధరల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపింది. పూంచ్‌లోని రావల్‌కోట్‌కు చెందిన అవామీ యాక్షన్ కమిటీ 2023 మే 8న ఈ విషయమై బహిరంగ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇది తక్షణం ఉద్రిక్తతలకు దారి తీసింది. అదే విధంగా ఆగస్టు 2023లో విద్యుత్ బిల్లులపై ప్రభుత్వం కొత్త పన్నులను విధించింది. ఇది పరిస్థితిని మరింత దిగజార్చింది. విద్యుత్ భారాలకు నిరసనగా ముజఫర్ యూనివర్శిటీ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. వారికి స్థానిక వ్యాపారులు మద్దతు పలికారు. ఈ ఆందోళనలు నీలం-జీలం జలవిద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన అనేక అంశాలను కూడా చర్చనీయాంశం చేశాయి. దీంతో ప్రభుత్వం అదే ఏడాది సెప్టెంబర్‌లో పలువురిని అరెస్ట్ చేసింది. ఆందోళన చేస్తున్న ప్రజలను చెదరగొట్టేందుకు ఒక

**❝ అన్వర్-ఉల్-హక్ ప్రభుత్వం పాలనాపరమైన అనేక సంస్కరణలను తీసుకువచ్చింది. రహస్య నిధులను రద్దు చేయడం, ఎలక్ట్రానిక్ టెండర్ల ద్వారా ప్రభుత్వ కాంట్రాక్టులు ఇవ్వడం, ప్రభుత్వ వ్యయాన్ని 90శాతం పైగా తగ్గించడం వంటివి వీటిలో కీలకమైనవి. ఉద్యోగుల కోసం బయోమెట్రిక్ హాజరు. తనిఖీలు, పన్నుల ఎగవేతపై కఠిన చర్యలతో పాటు ప్రభుత్వం అనుసరించిన పొదుపుచర్యలు అక్కడి 1.27 లక్షల మంది ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను పెంచింది. ❞**

ఖాన్‌ను వ్యతిరేకించే పాకిస్తాన్‌కు చెందిన ఇతర ప్రధాన రాజకీయ పార్టీల మద్దతుతో ఆ పదవిని చేపట్టారు. ఈ చర్య ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసిందని పిఓకె సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మంజూర్ గిలాని వ్యాఖ్యానించారు. సీనియర్ జర్నలిస్టు ఆరిఫ్ బహర్ పిఓకెని పూర్తిగా భద్రతా దృక్కోణం నుండి చూశారని, నాయకత్వంలోని రాజీ ధోరణి, ఇతర సమస్యలకు దారి తీసిందని వ్యాఖ్యానించారు. ఆయన వాదన ప్రకారం రిమోట్ నియంత్రిత నాయకత్వ వ్యూహం విఫలమైంది. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జెఎఎసి) ఉద్యమం దీనినే రుజువు చేసింది.

అన్వర్-ఉల్-హక్ ప్రభుత్వం పాలనాపరమైన అనేక సంస్కరణలను తీసుకువచ్చింది. రహస్య నిధులను రద్దు చేయడం, ఎలక్ట్రానిక్ టెండర్ల ద్వారా ప్రభుత్వ కాంట్రాక్టులు ఇవ్వడం, ప్రభుత్వ వ్యయాన్ని 90శాతం పైగా తగ్గించడం వంటివి వీటిలో కీలకమైనవి. ఉద్యోగుల కోసం బయోమెట్రిక్ హాజరు. తనిఖీలు, పన్నుల ఎగవేతపై కఠిన చర్యలతో పాటు ప్రభుత్వం అనుసరించిన పొదుపుచర్యలు అక్కడి 1.27 లక్షల మంది ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను పెంచింది. విశ్వసనీయత, ప్రజల మద్దతు లేకపోవడంతో సంస్కరణలను అమలు చేయడం కష్టంగా మారింది. పాకిస్తాన్ గూఢాచార సంస్థ ఐఎస్ఐ మాజీ అధిపతి, లెఫ్టినెంట్ జనరల్ అసద్ దురానీ ఈ పరిస్థితిని వివరిస్తూ 'ప్రజల్లో విశ్వసనీయత, ఆమోదం లేని ప్రభుత్వాలు సబ్సిడీలు తగ్గించడం, విద్యుత్ ఛార్జీలను పెంచడం వంటి సంస్కరణలను అమలు చేయలేవు. అన్వర్ ప్రభుత్వ వైఫల్యం దీనినే తెలియచేస్తోంది. ప్రజల నమ్మకాన్ని పొందినప్పుడు మాత్రమే సంస్కరణలను ఉత్తమంగా అమలు చేయగలం' అని పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్ డెమోక్రటిక్ పార్టీ నాయకురాలు, న్యాయవాది నబీలా ఇర్షాద్ మాట్లాడుతూ స్థానికంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల పదవీ కాలం విషయంలో పాకిస్తానీ ప్రభుత్వాలు కొన్ని నిర్దిష్ట లక్ష్యాలతో జోక్యం చేసుకున్న విషయం నిజమేనని చెప్పారు. అలా జోక్యం చేసుకోవడం తీవ్ర పరిణామాలకు దారి తీసిందని కూడా ఆమె అన్నారు. 'అంతకుముందు ప్రజలు కులం, మతం, ప్రాంతీయ అనుబంధాల ఆధారంగా అర్హత లేని వ్యక్తులకు ప్రాతినిధ్యం కల్పించారు. అది వారి బలహీనత. ఆ అసమర్ధ నాయకత్వం ఫెడరల్ ప్రభుత్వాన్ని జాతీయ ప్రయోజనాలను గుర్తించేలా చేయడంలో విఫలమైంది. దానికి బదులుగా వ్యక్తిగత ప్రయోజనాలపై వారు దృష్టి పెట్టారు' అని ఆమె వివరించారు. నిజమైన ప్రజాస్వామ్య సూత్రాలను అమలు చేయడం, సమర్ధవంతమైన నాయకత్వాన్ని ప్రోత్సహించడం, ప్రజలందరికి సమానంగా సేవలందించడం మాత్రమే ప్రస్తుతం ముందున్న మార్గమని ఆమె వివరించారు. ఈ ప్రాంతానికే చెందిన మరో రాజకీయ నాయకురాలు మరియా ఇక్బాల్ తరాని మాట్లాడుతు ప్రస్తుతం జరుగుతున్న నిరసనలు చోటుచేసుకుంటున్న మార్పునకు సంకేతం అని చెప్పారు. ఇస్లామాబాద్‌లోని ఫెడరల్ ప్రభుత్వం ద్వారా ఆర్థిక కష్టాలు, వివక్ష పెరుగుతోందన్న అంశాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని , వారిలో పెరుగుతున్న అసంతృప్తే దీనికి నిదర్శనమని అన్నారు. జెఎఎసి డిమాండ్లు ప్రజల్లో విస్తృతంగా నెలకొన్న నిరాశను, ప్రాథమిక మార్పుకోసం వారు పడుతున్న ఆరాటాన్ని తెలియచేస్తున్నాయని ఆమె చెప్పారు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ మానవహక్కుల విభాగం ప్రధాన కార్యదర్శి కూడా అయిన తరానా మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఉన్న ప్రభుత్వం పేరుకి మాత్రమే పరిమితమని చెప్పారు. శాసన వ్యవస్థ మద్దతుతో పనిచేసే ప్రధానమంత్రి ఉన్నట్లు కాగితాల్లో ఘనంగా ఉనప్పటికీ ఇస్లామాబాద్ పాలకులు రోజువారి వ్యవహారాల్లో సైతం జోక్యం చేసుకుంటున్నారని అన్నారు. '2019లో భారత ఆధీనంలో ఉన్న కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తరువాత పాక్ ఆధీనంలో

డిప్యూటీ కమిషనర్ ప్రయత్నించడంతో వారు ఆయనపై దాడికి దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మరునటిరోజు ఆందోళనకారులు ముజఫరాబాద్‌కు కవాతు చేశారు.

**ప్ర: ఆర్థిక అంశాలు కాకుండా ప్రజలను ప్రభావితం చేసిన ఇతర అంశాలేమైనా ఉన్నాయా?**

జ: ప్రధానంగా పాక్ పాలనలోని కాశ్మీర్‌కు, పాకిస్తాన్ ప్రభుత్వానికి మధ్య నిర్మాణాత్మకమైన సమస్యలు ఉన్నాయి. రాజ్యాంగబద్ధమైన యంత్రాంగం కింద వాటిని క్రమబద్ధీకరించినప్పుడు సమస్యలు పరిష్కారమవుతాయి. నా అభిప్రాయం ప్రకారం పాకిస్తాన్ ప్రభుత్వం ఇక్కడ చేసే ప్రతిపనికి రాజ్యాంగబద్ధత ఉండాలి. అప్పుడు మాత్రమే పాకిస్తాన్ పార్లమెంటు, సుప్రీంకోర్టుకు కొంతైనా జవాబుదారి తనం ఉంటుంది. పాకిస్తాన్ రాజ్యాంగం ప్రకారం నియంత్రణ యంత్రాంగం ఉండాలి.

**ప్ర: భారతదేశం వైపు కాశ్మీర్ మాదిరి పిఓకె ప్రజానీకంలో రాజకీయంగా చురుకుదనం లేదు. ఎందుకు?**

జ: భారత్ వైపు మాదిరి సర్దార్ ఇబ్రహీం ఖాన్, సర్దార్ క్యూమ్‌ఖాన్, కె.హెచ్ కుర్షీద్ వంటి నేతల నాయకత్వం ఇక్కడ లేదు. ఇక్కడ ఉన్న నాయకత్వపు గొంతు జాతీయ స్థాయిలో వినిపించదు. ముజఫర్‌బాద్‌లోని ప్రభుత్వాలు పాకిస్తాన్ బ్యూరోక్రసి ఒత్తిడికి తలగ్గుతున్నాయి. మరోకారణం, 45 అసెంబ్లీ సెగ్మెంట్లలో మూడింట ఒకవంతు నాన్ రెసిడెంట్ జాతీయులకు రిజర్వు చేశారు. భారతదేశం వైపు ఉన్న కాశ్మీర్‌నుండి శరణార్థులుగా వచ్చిన వారిగా వీరిని సాధారణంగా భావిస్తారు. నిజానికి వారు పాక్ పాలన కింద ఉన్న కాశ్మీర్‌లో నివసించరు. స్థానికంగా వారి పాత్ర ఏమీ

> **‘మా కరెంటు మాకు అందుబాటులో లేదు. ముందు అది మీకు, ఆ తరువాత సెంట్రల్ పవర్ పర్చేజ్ కమిటీకి, ఆ తరువాత కరెంటు బోర్డులకు ఇస్తున్నారు. ఆ తరువాత వారు నష్టాలను మా ఖాతాల్లో రాస్తున్నారు. ప్రతి ఏడాది జూన్ నెలలో మీరు 600 మిలియన్ రూపాయలు లోటులో ఉన్నట్లు మాకు చెబుతారు. ఆ మొత్తాన్ని మీరు చెల్లించలేకపోతున్నందున సెంట్రల్ బడ్జెట్‌లోని మా వాటా నుండి తగ్గిస్తారు’ అని హక్ చెప్పారు.**

ఉన్న కాశ్మీర్‌ను పాకిస్తాన్‌లో కలిపివేస్తారన్న ఆదోళనలు తలెత్తాయి. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న ఆందోళనలు ప్రధానంగా ఆర్థిక అంశాలకు, స్థానిక రాజకీయ డిమాండ్లకు సంబంధించినవి.’ అని ఆమె వివరించారు. పిఓకె చట్టబద్ధంగా పాకిస్తాన్‌లో విలీనం కాలేదని, అదే సమయంలో సార్వభౌమ రాజ్యంగా గుర్తింపునకూ నోచుకోలేదని చెప్పారు. సున్నితమైన ప్రాంతంలో శాంతిని పునరద్ధరించడానికి, ఆర్థిక ఉపశమనం, రాజకీయ న్యాయం కోసం ఇస్తున్న పిలుపులను పాక్ ప్రభుతం పట్టించుకోవాలని ఆమె సూచించారు.

**కీలకాంశాలు**

ఆహారం, ఇంధనం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో హింసాత్మక నిరసనలు చెలరేగాయి.

.ఇస్లామాబాద్‌లోని ఫెడరల్ ప్రభుత్వం ఈ ప్రాంతంపై చూపుతున్న వివక్షపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది.

.2021 సార్వత్రిక ఎన్నికల నుండి నాలుగు సంవత్సరాల్లో పిఓకె ముగ్గురు ప్రధానమంత్రులను చూసింది.

. ప్రజల్లో విశ్వసనీయత లేకపోవడంతో ఆర్థిక సంస్కరణలు అమలు చేయడం ప్రభుత్వానికి కష్టంగా మారింది. సాంప్రదాయ రాజకీయ నాయకులు ప్రజల అభిప్రాయాలను అర్థం చేసుకుని నాయకత్వం వహించడంలో విఫలం కావడంతో, తమను తాము జాతీయవాదులుగా చెప్పుకుంటున్న కొందరు కీలకపాత్ర పోషించే పరిస్థితి ఏర్పడింది.

. స్వయం ప్రకటిత జాతీయ వాదులు 1947కు ముందు ఉన్న సరిహద్దుల ఆధారంగా స్వతంత్ర జమ్మూ-కాశ్మీర్ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతిస్తున్నారు.

**పిఓకె ప్రధానమంత్రి నిరాశ**

ఆందోళనలు వికృత రూపం దాల్చడానికి చాలా కాలం పిఓకె ప్రధానమంత్రి (పాక్ రాజ్యాంగం ప్రకారం పిఓకె కూడా ప్రధానమంత్రి ఉంటారు) అన్వర్-ఉల్-హక్ పాకిస్థాన్ సెనెట్‌కు చెందిన ఒక స్టాండింగ్ కమిటీతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పాకిస్తాన్ పట్ల ప్రేమను, అభిమానాన్ని చూపే కాశ్మీరీయుల చివరి తరానికి చెందిన వ్యక్తిగా తనను తాను చెప్పుకున్నాడు. (పిఓకెలో నివసించే వారు సైతం తమను కాశ్మీరీయులుగా చెప్పుకుంటారు) సోషల్ మీడియాలో బాగా వైరల్ అయిన ఈవీడియోలో పాకిస్తానీ నాయకత్వం ఈ ప్రాంతం పట్ల వ్యవహరిస్తున్న తీరుతో కొత్త తరం ఎలా విసుగు చెందిందో ఆయన వివరించడం చూడవచ్చు. తన ప్రెజేంటేషన్‌లో తమ ప్రాంతం 2,600 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని, అయితే, 350 మెగావాట్లను మాత్రమే వినియోగిస్తోందని ఆయన చెప్పారు. మిర్పూర్‌లోని మంగళ డ్యామ్ వద్ద ఉత్పత్తి చేసే ధరకే విద్యుత్‌ను అందించాలన్నారు. ఈ డ్యామ్ వద్ద మూడు నుండి నాలుగు పాకిస్తాన్ రూపాయలకే యూనిట్ విద్యుత్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. అక్కడి నుండి జాతీయగ్రిడ్‌కు ఇతర వినియోగ సంస్థలకు విద్యుత్ సరఫరా అవుతుందని చెప్పారు. జాతీయ గ్రిడ్ ప్రభుత్వానికి యూనిట్ విద్యుత్‌ను 30 పాకిస్తానీ రూపాయలకు విక్రయిస్తోందని తెలిపారు.

‘మా కరెంటు మాకు అందుబాటులో లేదు. ముందు అది మీకు, ఆ తరువాత సెంట్రల్ పవర్ పర్చేజ్ కమిటీకి, ఆ తరువాత కరెంటు బోర్డులకు ఇస్తున్నారు. ఆ తరువాత వారు నష్టాలను మా ఖాతాల్లో రాస్తున్నారు. ప్రతి ఏడాది జూన్ నెలలో మీరు 600 మిలియన్ రూపాయలు లోటులో ఉన్నట్లు మాకు చెబుతారు. ఆ మొత్తాన్ని మీరు చెల్లించలేకపోతున్నందున సెంట్రల్ బడ్జెట్‌లోని మా వాటా నుండి తగ్గిస్తారు’ అని హక్ చెప్పారు. ప్రతి ఏడాది జూన్ మాసంలో తమ ప్రభుత్వం బడ్జెట్ రూపొందించి నిధుల కోసం ఎదురుచూస్తుంటుందని, అదే సమయంలో కేంద్రం వద్దే భారీ మొత్తంలో కోత పెడుతున్నట్లు

ఉండదు. కానీ, వారు ఫలితాలను ప్రభావితం చేస్తారు. ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషిస్తారు. దీంతో స్థానిక ప్రజల్లో రాజకీయాలపై అంత ఆసక్తి కనిపించదు.

**ప్ర: పిఓకె రాజకీయ నిర్మాణం ఎలా ఉంటుంది?**

జ: ఈ ప్రాంతానికి ఒక శాసనసభ ఉంటుంది. ఇది స్థానిక వ్యవహారాలకు బాధ్యత వహిస్తుంది. శాసనసభకు ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు. సింబాలిక్‌గా రాష్ట్రపతి లేదా ప్రెసిడెంట్ కూడా ఉంటారు. దీనితో పాటు మరో వ్యవస్థ కూడా ఉంటుంది. దానిని ఆజాద్ జమ్మూ కాశ్మీర్ కౌన్సిల్ (ఎజెకె) అని పిలుస్తారు. ఎజెకెకి పాకిస్తాన్ ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు. ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే పాలనా పరమైన అన్ని నిర్ణయాలను ఎజెకె కౌన్సిల్ తీసుకుంటుంది. ఈ ఎజెకె కౌన్సిల్ ప్రజలు ఎన్నుకున్న సంస్థ కాదు. పైగా పూర్తిగా పాకిస్తాన్ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

పాకిస్తాన్ ప్రభుత్వం తీసుకునే అన్ని నిర్ణయాలకు ఎజెకెకు కూడా వర్తిస్తాయి. భారత దేశంలో మాదిరి మాకు పాకిస్తాన్ పార్లమెంటులో ప్రాతినిధ్యం లేదు. అదే సమయంలో పాకిస్తాన్‌లో పనిచేస్తున్న అన్ని రాజకీయ పార్టీలకు ఎజెకెలో ప్రాతినిధ్యం ఉంటుంది. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుంటే ఇస్లామాబాద్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పార్టీయే ముజఫర్‌బాద్‌లో కూడా అధికారంలో ఉంటుందన్న సంగతి సులభంగానే అర్థమవుతుంది.

**ప్ర: భారత్‌లో 370 ఆర్టికల్ రద్దుతో, మీ భూభాగాన్ని పాకిస్తాన్‌లో కలుపుకుంటారన్న ఆందోళన ఏమైనా ఉందా?**

జ: రాజ్యాంగపరమైన ఏర్పాటుతో సహా ఈ ప్రాంతంతో పాటు గిల్గిత్, బాల్టిస్థాన్‌లు

> ❝ సాంప్రదాయ రాజకీయ నాయకులు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడంలోనూ, అభిప్రాయాలను పట్టించుకో వడంలోనూ వెనకబడటంతో స్వయం ప్రకటిత జాతీయ వాదులు ప్రధాన వేదికగా మారారు. ఈ సమూహాలు తమను తాము భారతదేశం, పాకిస్తాన్ రెండింటిని ప్రత్యర్థులుగా చెప్పుకుంటూ, 1947కు ముందున్న సరిహద్దుల ఆధారంగా స్వతంత్ర జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌కు మద్దతు ప్రకటిస్తున్నాయి. ❞

తమకు సమాచారం అందుతుందని ఆయన వివరించారు. పాకిస్తాన్ ప్రభుత్వం ఒక డ్యామ్ కట్టాలని నిర్ణయించినప్పుడు పిఓకే తన భూభాగాన్ని వదులుకుందని, మీర్పూర్ వంటి పెద్ద నగరాలను కూడా త్యాగం చేసిందని ఆయన తెలిపారు. అదే సమయంలో తమ ప్రజలు కోరుకుంటున్న కాలాబాగ్ డ్యామ్‌ను ఎందుకు నిర్మించలేకపోతున్నారని ఆయన పాక్ రాజకీయ నాయకులను ప్రశ్నించారు. పాకిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాల (ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, సింధ్) ప్రజలు ఈ డ్యామ్ నిర్మాణానికి ఎందుకు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. పాకిస్తాన్ కోసం తమ భూభాగాలను తాము త్యాగం చేసిన విధంగానే త్యాగం చేయాలన్న ఉత్సాహం వారికి ఎందుకు లేదని ప్రశ్నించారు. పాక్ ఆధీనంలో ఉన్న కాశ్మీర్‌లోని ప్రభుత్వాలు ఊపిరికూడా పీల్చుకోలేనంత ఒత్తిడికి గురవుతున్నాయని ఆయన చెప్పారు. పాకిస్తాన్ పట్ల ప్రేమ, అభిమానం చూపే వారిలో తమ తరమే చివరిదవుతుందని అన్నారు. 'రోజురోజుకు సంబంధాలు బలహీన పడుతున్నాయి, మా స్థలం మరింత ఇరుకుగా మారుతోంది. మేం గళం విప్పితే పాకిస్తాన్‌కు వ్యతిరేక జాతీయవాదులుగా ముద్రవేస్తున్నారు,' అని చెప్పారు.

కాశ్మీర్ లోయ జనాభాకు భిన్నంగా పిఓకె జనాభా సంక్లిష్టంగా ఉంటుంది. ఈ ప్రాంతం కులం లేదా బారాదారి వ్యవస్థ ద్వారా విభజించబడి ఉంటుంది. ఇది ఎన్నికల సమయంలో ఓటింగ్ తీరును కూడా ప్రభావితం చేస్తుంది. గుజ్జర్లు, సుధాన్‌లు, జాట్‌లు, రాజ్‌పుత్‌లు, మొఘలులు, అవాన్‌లు, ధుండ్‌లు కాశ్మీరీ జాతికి చెందిన చిన్న సమూహాలు. వీరి ప్రధాన భాష పహారీ. ఇది హింద్కో, పంజాబీలకు దగ్గరగా ఉంటుంది. భారతదేశం వైపు భూభాగంలో ఆధిపత్యం చలాయించే కాశ్మీరీ మాట్లాడే జనాభా పాకిస్తాన్ వైపు కేవలం 5శాతం మాత్రమే ఉన్నారు. ( మొత్తం జమ్మూ-కాశ్మీర్‌లో 52.46శాతం, కాశ్మీర్ లోయలో 86శాతం)

### ప్రజల్లోనూ తీవ్ర నిరాశ

వివిధ ఆర్థిక అంశాలపై జరుగుతున్న పోరాటాల పట్ల పాక్ పాలకులు అనుసరిస్తున్న ధోరణి ఇక్కడి ప్రజానీకంలో తీవ్ర నిరాశకు దారితీసిందన్న అభిప్రాయం పరిశీలకుల్లో వ్యక్తమవుతోంది. శాంతి భద్రతల సాకుతో పొరుగున ఉన్న ఖైబర్ పఖ్తున్ ఖ్వా, పంజాబ్‌లలో పిఓకెని విలీనం చేయడానికి పాకిస్తాన్ ప్రయత్నిస్తోందన్న ఆందోళనను ఇక్కడి ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే ఈ ప్రాంతం యొక్క ప్రత్యేక సాంస్కృతిక, రాజకీయ గుర్తింపు ప్రశ్నార్ధకమౌతుంది. తమను తామ కాశ్మీరీలుగా చెప్పుకునే హక్కు కూడా కోల్పోతామని వీరు భావిస్తున్నారు. ఈ సంక్షోభం పరిష్కారానికి పాకిస్తాన్ తీసుకునే చర్యలు పిఓకె భవిష్యత్తును నిర్ణయించడం మాత్రమే కాకుండా, అంతర్జాతీయ వేదికపై ఆ దేశ దౌత్యనీతికి, వ్యూహాత్మక వైఖరికి నిదర్శనంగా నిలుస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సాంప్రదాయ రాజకీయ నాయకులు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడంలోనూ, అభిప్రాయాలను పట్టించుకోవడంలోనూ వెనకబడటంతో స్వయం ప్రకటిత జాతీయ వాదులు ప్రధాన వేదికగా మారారు. ఈ సమూహాలు తమను తాము భారతదేశం, పాకిస్తాన్ రెండింటిని ప్రత్యర్థులుగా చెప్పుకుంటూ, 1947కు ముందున్న సరిహద్దుల ఆధారంగా స్వతంత్ర జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌కు మద్దతు ప్రకటిస్తున్నాయి. భారత్ ఆధీనంలో ఉన్న జమ్మూ-కాశ్మీర్ భూభాగంలో వీరికి ఉన్న పట్టు తక్కువే. అయినప్పటికీ ఈ ప్రాంతం అనేక రాజకీయ సంఘటనలకు, మలుపులకు కేంద్రంగా ఉంది. కీలకమైన ఈ ప్రాంతంలో స్థిరత్వం భారత్, పాక్ రెండు దేశాలకు ఎంతో ముఖ్యం. అందువల్ల పిఓకెలో జరుగుతున్న పరిణామాలను శ్రీనగర్‌తో పాటు ఢిల్లీలో కూడా అత్యంత నిశితంగా పరిశీలిస్తున్నారు. ❋

---

ప్రతివిషయంలోనూ పాకిస్తాన్‌తో కలిసిపోయాయి. స్వతంత్ర కాశ్మీర్ కోసం అప్పుడప్పుడు వినిపించే కొద్దిపాటి స్వరాలు మినహా, ఇక్కడి ప్రజలు మిగిలిన ప్రాంతాలకు దూరమైనట్లు భావించడం లేదు.

**ప్ర: చాలా మంది భారతీయ నాయకులు పిఓకెని తిరిగి స్వాధీనం చేసుకుంటామని చెబుతున్నారు. ఇండియన్ యూనియన్‌లో చేరడానికి ఉద్యమం చేపట్టాలని కూడా ప్రజలకు పిలుపునిస్తున్నారు. వాస్తవ పరిస్థితి ఏమిటి?**

జ: నా దృష్టిలో రాచరిక రాజ్యాలకు, బ్రిటిష్ ప్రభుత్వానికి మధ్య కుదిరిన అన్ని ఒప్పందాలు 1947 ఆగస్టు 15న ముగిశాయి. అప్పటి నుండి జమ్మూ కాశ్మీర్ సాంకేతికంగా విముక్తి పొందింది. ఈ రాజ్యంలోని కొన్ని ప్రాంతాలను స్థానిక డోగ్రా పాలకునికి చెందిన సైన్యం నుండి ప్రజలు 1947 అక్టోబర్ 24న విముక్తి చేశారు. మహారాజా హరిసింగ్ భారత్‌లో చేరినప్పుడు అతని వద్ద మిగిలిన భాగంతో మాత్రమే వచ్చాడు. అతని నుండి స్వేచ్ఛ పొందిన ప్రాంతం ఇక్కడే ఉంది. ఆ ప్రాంతలో ఏర్పడిన ప్రభుత్వం 1948 ఏప్రిల్‌లో జరిగిన కరాచి ఒప్పందం ద్వారా తన సార్వభౌమాధికారిన్ని పాకిస్తాన్‌కు అప్పగించింది. చట్టపరమైన, వాస్తవ పరిస్థితి ఇది!

**(అనువాదం : పొగడ దొరువు)**

# ఆర్‌ఎస్‌ఎస్ నాటకాలు

ఎ కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు ఎడిటోరియల్ బాధ్యులు

18వ లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. గతంలో 303 స్థానాలున్న ఆ పార్టీని 240 స్థానాలకే పరిమితం చేశారు. అయినప్పటికీ ఎన్‌డిఎ కూటమిగా ఎక్కువ స్థానాలలో విజయం సాధించటంతో మోడి నాయకత్వంలోనే బిజెపి తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఐదు సంవత్సరాలు పాలించిన వైసిపి ఈ ఎన్నికలలో మొత్తం 175 స్థానాలను ఎందుకు సాధించరాదనే ప్రచారం ప్రారంభించగా, ప్రజలు దానిని కేవలం 11 స్థానాలకే పరిమితం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఊహించినన్ని స్థానాలు సాధించలేదు. 10 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించిన బిఆర్‌ఎస్ ఒక్క పార్లమెంటు స్థానంలో కూడా విజయం సాధించలేదు. తెలంగాణలో బిజెపి ఎనిమిది స్థానాలలో విజయం సాధించింది.

పార్లమెంటు ఎన్నికలలో వచ్చిన ఫలితాలు ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిలకు ఏ మాత్రం మింగుడు పడకుండా ఉన్నాయి. బిజెపి తమ కూటమికి 400 లకు పైగా స్థానాలు వస్తాయని ఎన్నికలలో ప్రచారం చేయగా ప్రజలు మాత్రం కనీసం అత్తెసరు మెజారిటీని కూడా ఇవ్వకుండా కేవలం 240 స్థానాలు, అంటే సాధారణ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి అవసరమైన వాటి కన్నా 33 స్థానాలను తక్కువగా ఇచ్చారు. ఎన్‌డిఎ లో భాగస్వాములుగా ఉన్న టి డి పి, జెడి(ఎస్)ల దయాదాక్షిణ్యాలతో కొత్తగా కేంద్రంలో ఏర్పడిన బిజెపి ప్రభుత్వం మనుగడ సాగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

అంతేకాదు. అయోధ్యలో రామ మందిరం నిర్మించామని, తామే హిందువులకు ప్రతినిధులమని విర్రవీగుతూ, ఎన్నికలలో ప్రచారం చేసుకున్న బిజెపికి అయోధ్య నియోజకవర్గంలోని ప్రజలే శృంగభంగం చేశారు. అయోధ్య పార్లమెంటు స్థానంలో బిజెపి ఓడిపోవటమే కాక, వారణాసిలో పోటీ చేసిన మోడి మెజారిటీ కూడా తగ్గింది. ఆర్‌ఎస్‌ఎస్‌కు ప్రాబల్యం ఉన్న హింది రాష్ట్రాలలో బిజెపి ఓటముల నెదుర్కొన్నది. ఆ పార్టీ అధికారాన్ని సాధించటంలో ప్రధానకేంద్రంగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో మెజారిటీ స్థానాలను గెలుచుకోవటంలో విఫలమైంది.

ఎన్నికల ఫలితాల నుండి గుణపాఠాలు నేర్చుకోవటం కాకుండా మసిపూసి మారేడుకాయ చేయటానికి ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిలు ప్రయత్నం చేస్తున్నాయి. బిజెపి నాయకులు అహంకారంతో వ్యవహరించటంతో ఈ విధమైన ఫలితాలు వచ్చాయని, ఆర్‌ఎస్‌ఎస్ సరైన విధంగా ఆలోచిస్తూ లోపాలను సరిదిద్దటానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా నటిస్తున్నారు. నిజమైన సేవకుడు ఎప్పుడూ అజ్ఞానంతో మాట్లాడడని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్ చాలక్ మోహన్ భగవత్ అన్నారు. మోడి, ఆయనతో పాటు బిజెపి నాయకులు పచ్చిగా ముస్లింలపై విద్వేష ప్రచారం చేస్తూ మతోన్మాదాన్ని పెంచటానికి ప్రయత్నం చేస్తే, బిజెపి, ప్రతిపక్షాలు ఉభయులూ ప్రచారంలో తీవ్రంగా వ్యవహరించాయని మోహన్ భగవత్ అన్నారు. తద్వారా మోడి, బిజెపి నాయకులు చేసిన విద్వేష ప్రచారాన్ని కప్పిపుచ్చటానికి పూనుకున్నారు. అతి విశ్వాసంతో ఉన్న బిజెపి నాయకత్వానికి వాస్తవ పరిస్థితులను అర్థమయేలా ఫలితాలు చేస్తాయని ఆర్గనైజర్‌లో రాసుకున్నారు. వీధులలో ప్రజలు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను వినిపించుకోలేదని, 543 స్థానాల నుండి మోడియే పోటీ చేస్తున్నట్లుగా ప్రచారం చేసుకున్నారని, స్థానిక కార్యకర్తలను పట్టించుకోకపోవటంతో బలమైన స్థానాలలో కూడా ఓడిపోయారని ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. ఈ విధంగా మోహన్ భగవత్‌తో పాటు అనేకమంది ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కూడా మోడితో పాటు బిజెపి నాయకులకు కూడా నీతి సూత్రాలు బోధిస్తున్నట్లు ఫోజులు పెడుతూ బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌ల మధ్య పెద్ద వైరుధ్యం ఉన్నట్లుగా చూపటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

వాస్తవం ఏమిటంటే విధానపరంగా బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ మధ్య ఎటువంటి వైరుధ్యాలు లేవు. గత పది సంవత్సరాల కాలంలో ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను మోడి ప్రభుత్వం తు.చ.తప్పకుండా అమలు చేసింది. మోడి గాని లేదా ఆయన ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నవారు గాని ఏనాడూ ఆర్‌ఎస్‌ఎస్ విధానాలకు విరుద్ధమైన విధానాలను అనుసరించలేదు. రాజ్యాంగాన్ని నీరుగార్చటంలో, ప్రభుత్వరంగాన్ని విధ్వంసం చేయటంలో, ముస్లింలపై ద్వేషాన్ని పెంచటం ద్వారా మతపరంగా మెజారిటీ ప్రజలను సమీకరించటానికి ప్రయత్నాలు చేయటం తదితరాలు వేటిలోనైనా ఆర్‌ఎస్‌ఎస్ విధానానికి వ్యతిరేకంగా మోడి ప్రభుత్వం వ్యవహరించిందా? ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా అమలులో భాగంగానే జమ్మూకాశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 అధికరణాన్ని రద్దుచేశారు. సిఎఎ, ఎన్‌ఆర్‌సిలను ఆమోదించారు.

ఎన్నికల ప్రచారంలో మోడి, నడ్డా, ఇతర బిజెపి నాయకులు ముస్లింలపైనా, ప్రతిపక్ష నాయకులపైనా పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తుంటే ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఎవరూ నోరు మెదపలేదు. పార్లమెంటు నుండి ప్రతిపక్షాలను బయటికి పంపి, ముఖ్యమైన బిల్లులను, చట్టాలను ఆమోదిస్తున్నప్పటికీ పల్లెతు

**❝ ఎన్నికలలో బిజెపి సాధించిన సీట్లు, ఓట్లను పరిశీలిస్తే ఈ మాత్రం విజయా నికున్న పరిమితులు కూడా స్పష్టమౌ తాయి. 2019 ఎన్నికలలో బిజెపి స్వంతంగా 303 పార్ల మెంటు స్థానాలలో విజయం సాధించింది. 2024 ఎన్నికలలో 240 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. అంటే ఆనాడు గెలిచిన స్థానాలలో 63 స్థానాలను ఆ పార్టీ కోల్పో యింది. ఉత్తరప్రదేశ్ 80 స్థానాలకు గాను బిజెపి 33 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. ❞**

మాటకూడా మాట్లాడలేదు. రాజ్యాంగాన్ని మారుస్తామని, అందుకోసం 400లకు పైగా స్థానాలు ఇవ్వమని ప్రచారం ప్రారంభించింది ఆర్ఆస్ఎస్ నాయకులే. రైతుల భూములను, వ్యవసాయాన్ని కార్పొరేట్ల పరం చేసే మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిన మోడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు దేశవ్యాపితంగా సంవత్సరంకు పైగా పోరా టం చేసి, మూడు నల్ల చట్టాలను రద్దుచేయిస్తే ఒక్క ఆర్ఎస్ఎస్ నాయకుడు కూడా రైతులకు మద్దతుగా మాట్లాడలేదు. మోడి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక చర్యలలో ఒక్కదానిని కూడా ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించ లేదు. ఇంత ఉమ్మడిగా కలిసిపోతున్న ఆర్ఎస్ఎస్-బిజెపి ల మధ్య విభేధాలకు ఆస్కారం ఎక్కడ? ఇపుడు ఎన్నికలలో ఎదురైన ఓటమి భారాన్ని బిజెపిపై రుద్ది, తాము సచ్చీలురుగా బయటపడటానికి, ప్రజలను మభ్యపెట్టటానికి ఆర్ఎస్ఎస్ నాయకత్వం కలిసికట్టుగా ఆడుతున్న విబేధాల నాటకం మినహా ఇది మరేమీకాదు.

ఇపుడు ఆర్ఎస్ఎస్ నాయకులు నీతి సూత్రాలు వల్లిస్తున్నారు కాబట్టి నైతికతకు సంబందించిన కొన్ని ప్రశ్నలు అడగవలసి ఉంది. దేశానికి పతకాలు సాధించిపెడుతున్న మల్లయోధులైన మహిళలు ఫెడరేషన్ నాయకులు తమను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నారని నెలల తరబడి ఢిల్లీలో పోరాటం సాగిస్తే ఆర్ఎస్ఎస్ నాయకులు ఎందుకు నోరు మెదపలేదు? మణిపూర్‌లో మహిళలను సామూహికంగా మానభంగాలు, హత్యలు చేయటం, నగ్నంగా ఊరేగించటం చేస్తుంటే ఎందుకని సంవత్సరం పాటు మాట్లాడలేదు? అతిపెద్ద అవినీతి కుంభకోణమైన ఎన్నికల బాండ్లలో బిజెపి వేలకోట్ల రూపాయలు కాజేయటం ఆర్ఎస్ఎస్ నైతికతకు ఏ మాత్రం విరుద్ధం కాదా? మరి ఒక్కమాట కూడా మాట్లాడలేదు! సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మొసలి కన్నీరుకారుస్తున్న మోహన్ భగవత్ ఆర్ఎస్ఎస్ నాయకుల కనుసన్నలలో నడుస్తున్న సోషల్ మీడియా గ్రూపులలో మహిళలను అవమానిస్తూ ప్రచారం చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవటం లేదు? పచ్చి అబద్ధాలను నిజాలుగా ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. కేవలం అబద్ధాలను ప్రచారం చేయటం కోసమే వేలకోట్ల రూపాయలను ఖర్చు చేస్తూ, వేలాది మంది సిబ్బందితో సోషల్ మీడియా యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. ఇవన్నీ నైతికంగా సమర్థనీయ మేనా? ఇటువంటి వారికి ఎన్నికలలో దెబ్బతిన్న తర్వాత ఒక్కసారిగా నైతికత, రాజకీయ పార్టీలు వ్యవహరించాల్సిన తీరు గుర్తుకొచ్చినట్లు నటిస్తున్నారు. ప్రజలు తాము అమాయకులం కాదని, తమకు పరిణితి ఉన్నదని ఎన్నికలలో రుజువు చేశారు. బిజెపి-ఆర్ఎస్ఎస్‌లు తమ విధానాలను మార్చుకోకపోతే పరిణితి చెందిన ప్రజలు ఆర్ఎస్ఎస్-బిజెపిలకు ఇంతకన్నా పెద్ద గుణపాఠం చెబుతారు.

### బిజెపికి గుణపాఠం

ఎన్నికలలో బిజెపి సాధించిన సీట్లు, ఓట్లను పరిశీలిస్తే ఈ మాత్రం విజయా నికున్న పరిమితులు కూడా స్పష్టమౌతాయి. 2019 ఎన్నికలలో బిజెపి స్వంతంగా 303 పార్లమెంటు స్థానాలలో విజయం సాధించింది. 2024 ఎన్నికలలో 240 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. అంటే ఆనాడు గెలిచిన స్థానాలలో 63 స్థానాలను ఆ పార్టీ కోల్పోయింది. ఉత్తరప్రదేశ్ 80 స్థానాలకు గాను బిజెపి 33 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. 2019లో 62 స్థానాలలో గెలించింది. ఎస్‌పి, కాంగ్రెస్ కూటమి 43 స్థానాలలో విజయం సాధించింది. మహారాష్ట్ర 48కి గానూ 2019లో 23 స్థానాలలో గెలవగా ఇపుడు 9 స్థానాలలో గెలిచింది. పశ్చిమబెంగాల్‌లో 2019లో 18 స్థానాలలో గెలవగా, ఇపుడు 12 స్థానాలలో మాత్రమే గెలిచింది. బీహార్‌లో గతంలో 17 స్థానాలలో గెలవగా ఇపుడు 12 స్థానాలకు పరిమితమైంది. కర్ణాటక 2019లో 25 గెలవగా ఇపుడు 17 స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. రాజస్థాన్ 2019లో 25కు 24 గెలవగా ఇపుడు 14, హర్యానా 2019లో 10కి 10 స్థానాలలో విజయం సాధించగా ఇపుడు 5 స్థానాలలో మాత్రమే బిజెపి విజయం సాధించింది. పంజాబ్‌లో 2019లో 2 స్థానాలలో గెలవగా ఇపుడు ఒక్కటీ రాలేదు. ఈ విధంగా బిజెపికి పునాదిగా ఉన్న హిందిప్రాంతం, బలమైన రాష్ట్రాలలో 2019లో 181 స్థానాలలో విజయం సాధించింది. 2024 ఎన్నికలలో 104 స్థానాలలో మాత్రమే గెలిచింది. అంటే బిజెపి తనకు బలమైన రాష్ట్రాలలో 2019లో గెలిచిన 181స్థానాలలో 77 స్థానాలను-42 శాతంకు పైగా- 2024లో కోల్పోయింది.

బిజెపికి 2019లో 37.36 శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 2019లో 19.49 శాతం ఓట్లు రాగా, 2024లో 21.19 శాతంకు పెరిగాయి. బిజెపికి వచ్చిన ఓట్లు 0.8 శాతం మాత్రమే తగ్గాయి. కాంగ్రెస్‌కు 1.7 శాతం పెరిగాయి. అయితే లోతుగా పరిశీలిస్తే బిజెపి ఎంత గట్టి దెబ్బ తిన్నదన్నది స్పష్టమౌతుంది. ఉత్తరాదిలో తనకు పునాదిగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో 8.61, రాజస్థాన్ 9.23, హర్యానా 12.1, హిమాచల్‌ప్రదేశ్‌లో 12.67, జార్ఖండ్‌లో 6.36, కర్ణాటకలో 5.32, ఉత్తరాఖండ్ 4.2, ఢిల్లీ 2.21, మహారాష్ట్ర 1.66, బీహార్ 1.06 శాతం ఓట్లను బిజెపి కోల్పోయింది. కేరళ, ఒడిశా, తమిళనాడు, పంజాబ్, ఆంధ్ర, తెలంగాణ, త్రిపురలలో బిజెపి ఓట్లు పెరగటంతో ఆ పార్టీ ఓట్ల శాతం కొద్ది మేరకు మాత్రమే తగ్గినట్లు కన్పిస్తున్నది. 2014 ఎన్నికల నాటికి ఉన్నట్లుగా ప్రభుత్వసంస్థలు ఇడి, సిబిఐ, ఐటి, ఎన్ఐఎ, ఎన్నికల కమిషన్ తదితరాలు, మీడియా స్వతంత్రంగా పనిచేయటం, అధికారులు, ప్రభుత్వ అధికారంగాలు స్వతంత్రంగా పని చేసే వాతావరణంలో ఎన్నికలు జరిగితే బిజెపికి వచ్చిన స్థానాలు మరింతగా తగ్గేవి. మతాన్ని, రాముడ్ని అడ్డం పెట్టకున్నా, భాషా, ప్రాంతీయ దురభిమానాలను రెచ్చగొట్టినా బిజెపి

పతనాన్ని అడ్డుకోవటం సాధ్యం కాదని ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

**కొత్త ప్రభుత్వం రాష్ట్ర హక్కుల కోసం పోరాడాలి**

ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి ప్రభుత్వం ఏర్పడింది. పార్లమెంటు స్థానాలలో కూడా అత్యధికం టిడిపి కూటమి గెలుచుకుంది. నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తాను చేసిన వాగ్దానాలను నెరవేరుస్తానంటూ ఆయా ఫైళ్ళపై సంతకాలు చేశాడు. కేంద్రంలో మోడి నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వంలో టిడిపి కూడా భాగస్వామి అయింది. రాష్ట్రంలో ఒకరి పొడ మరొకరికి గిట్టనంతగా పరస్పరం వ్యతిరేక ప్రచారం చేసుకున్న వైసిపి కూడా టిడిపితో పాటు కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ప్రకటించింది. టిడిపి ఎన్‌డిఎలో భాగస్వామిగా ప్రభుత్వంలో పాల్గొంటుండగా, వైసిపి బయటి నుండి ప్రభుత్వానికి మద్దతు ప్రకటించింది.

రాష్ట్ర ప్రజలు ప్రధానాంశాలుగా భావిస్తున్న రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ఫ్యాక్టరి ప్రైవేటీకరణను విరమించుకోవటం అన్న అంశాలపై టిడిపి ఇప్పటి వరకు నోరు మెదపలేదు. కేంద్రంలో మోడి ప్రభుత్వం నిధుల కేటాయింపులో రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నది. చట్ట ప్రకారం రావలసిన నిధులను కూడా ఇవ్వకుండా ఇబ్బందులు కల్పిస్తున్నది. బిజెపి పాలిత రాష్ట్రాలకు ఎక్కువ నిధులు, ప్రాజెక్టులను కేటాయిస్తున్నది. ప్రతిపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలకు నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులో అన్యాయం చేస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలన్నిటి పట్ల ఇదే విధంగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రం అభివృద్ధిని సాధించాలంటే నిధులతో పాటు రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులను కూడా సాధించాలి. రాష్ట్రానికి గతంలో వాగ్దానం చేసిన కడప ఉక్కుఫ్యాక్టరి, కృష్ణపట్నం పోర్టు తదితరాలు గత ఐదు సంవత్సరాలలో అడుగు కూడా ముందుకు సాగలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఎటువంటి సహకారమూ అందించలేదు.

ఇటువంటి పరిస్థితులలో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులను సాధించాలంటే కేంద్ర ప్రభుత్వానికి కీలక మద్దతు అందిస్తున్న టిడిపి గట్టిగా బేరసారాలు జరిపి, రాష్ట్ర ప్రయోజనాలను సాధించటానికి పూనుకోవాలి. అవసరమైతే నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులో అన్యాయానికి గురవుతున్న ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఆందోళనకు పూనుకోవాలి. కేంద్ర ప్రభుత్వానికి ఇస్తున్న మద్దతును ఉపయోగించుకొని, రాష్ట్ర హక్కులను, నిధులను, ప్రాజెక్టులను సాధించుకోవటానికి అన్ని మార్గాలను ఉపయోగించుకోవాలి. మోడి, బిజెపి లకు రాష్ట్రాభివృద్ధి పట్ల ఏ మాత్రం శ్రద్ధ లేదని గత పది సంవత్సరాల అనుభవం స్పష్టం చేస్తున్నది. అందువలన బిజెపి ప్రభుత్వాన్ని కదిలించటానికి, రాష్ట్ర హక్కులను సాధించుకోవటానికి రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు, వివిధ సంస్థలు, సంఘాలను కలుపుకొని, రాష్ట్ర ప్రజలను కదిలించి పోరాడాలి. ఆ విధంగా పోరాటం చేయటం ద్వారానే రాష్ట్ర హక్కులను కాపాడుకోవటం సాధ్యమౌతుంది.

**“ఇటువంటి పరిస్థితులలో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులను సాధించాలంటే కేంద్ర ప్రభుత్వానికి కీలక మద్దతు అందిస్తున్న టిడిపి గట్టిగా బేరసారాలు జరిపి, రాష్ట్ర ప్రయోజనాలను సాధించటానికి పూనుకోవాలి. అవసరమైతే నిధులు, ప్రాజెక్టుల కేటాయింపులో అన్యాయానికి గురవుతున్న ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఆందోళనకు పూనుకోవాలి.”**



ఎన్డీఏలో కీలక భాగస్వామ్య పార్టీల నాయకులు చంద్రబాబు నాయుడు, నితిష్ కుమర్‌తో మోడీ

తనకు 25 పార్లమెంటు స్థానాలు ఇస్తే ప్రత్యేకహోదా, ఇతరాలను సాధిస్తామని గతంలో జగన్‌మోహన్ రెడ్డి చెప్పాడు. ప్రజలు 22 స్థానాలు ఇచ్చినప్పటికీ ఐదేళ్ళ కాలంలో మోడి భజన చేయటం మినహా రాష్ట్రానికి చేసింది లేదు. బిజెపికి పూర్తి మెజారిటీ వచ్చింది కాబట్టి ఏం అడిగినా ప్రయోజనం లేదని చెప్పారు. ఇపుడు బిజెపి మైనారిటీ స్థానాలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాబట్టి ఇపుడైనా రాష్ట్ర హక్కుల కోసం ఆ పార్టీ పట్టు పట్టాలి. కాని స్పీకర్ ఎన్నికలో బిజెపికి బేషరతుగా మద్దతు ఇవ్వటం ద్వారా ఇకముందు కూడా గతంలో లాగానే వ్యవహరిస్తామన్న సంకేతాలు ఇచ్చింది.

ఐదు సంవత్సరాలు మోడి భజన చేస్తూ రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోకపోవటంతో ప్రజలు వైసిపికి ప్రతిపక్ష హోదా కూడా దక్కనంతటి ఘోరమైన ఓటమిని కట్టబెట్టారు. అంతకు ముందు టిడిపి కూడా ఇదే విధంగా వ్యవహరించి, ఎన్నికల ముందు కళ్ళు తెరచి, రాష్ట్ర ప్రయోజనాలు అంటూ నాటకం ఆడినా ప్రజలు ఓడించారు. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, ఇప్పుడైనా టిడిపి రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. ❋

సామాజికాంశం

# సంఖ్యలు కూడా అబద్ధాలు చెపుతాయి



రచయిత ప్రముఖ జర్నలిస్టు. వర్తమాన రాజకీయ, సామాజికాంశాలపై విస్తృంగా రాస్తున్నారు.

టికె రాజాలక్ష్మి

ఒక వైపు దేశం సార్వత్రిక ఎన్నికల హడావుడిలో ఉండగా, మే మాసం మధ్యలో, ప్రధానమంత్రి ఆర్థిక సలహా సంఘం ప్రచురించిన ఒక పత్రం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా చక్కర్లు కొట్టింది. ఈ 67 పేజీల పత్రం, "మైనారిటీ మతస్థుల భాగం : దేశవ్యాప్త విశ్లేషణ (1950–2015)", రచయితలు , శమీక రవి, అబ్రహం జోస్, అపూర్వ్ కుమార్ మిశ్ర. వీరు భారతదేశంలో మైనారిటీలు కేవలం రక్షించబడడమే కాదు, వృద్ధి చెందుతున్నారు కూడా అని నిర్ధారించారు. గత 65 సంవత్సరాల కాలంలోని జనాభా లెక్కలు ఆధారం చేసుకుని ఈ వాదన చేశారు.

ఈ పత్రంలో భారతదేశంలో హిందూ జనాభా ఎలా తగ్గుతూ వస్తున్నదో, ముస్లిం జనాభా ఎలా పెరుగుతూ పోతున్నదో ఎత్తి చూపుతూ, అందుకు విచారాన్ని వ్యక్తపరిచారు. నిజానికి ఈ విశ్లేషణే పక్షపాత వైఖరితో కూడుకుని ఉంది.

ఈ పత్రానికి ఆధారంగా వారు 2019 దేశాల మత స్వరూపాలు తెలియచేసే ప్రాజెక్ట్ పై ఆధారపడ్డారు. ఇవి మెజారిటీ హిందువుల జనాభా గల దేశ జనాభాలో వారి సంఖ్య తగ్గిపోతున్నదని, కానీ మెజారిటీ ముస్లింలు గల 38 దేశాలలో 25 దేశాలలో వారి సంఖ్య పెరిగిందని, అదే సమయంలో 35 ఒ ఇ సి డి (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్మెంట్) దేశాల్లో మెజారిటీ మతస్థులు తగ్గుతున్నారని , 94 క్రిస్టియన్లు మెజారిటీ గల దేశాలలో కూడా మెజారిటీ మతస్థుల జనాభా తగ్గుతున్నది అని తెలియచేస్తున్నాయి.

అయితే, మైనారిటీ మతస్థులపై దేశవ్యాప్తంగా పరిశీలన జరిపిన సమైక్య రవి బృందం అధ్యయనం, ప్రధానంగా దృష్టి పెట్టినది మాత్రం భారతదేశంపైనే. భారతదేశంలో హిందువుల జనాభా 7.82 శాతం తగ్గిందనీ, (84.68 నుండి 78.06కి) ఇది గమనించదగ్గ తరుగుదలనీ అంటోంది. ప్రధానంగా, దక్షిణ ఆసియా దేశాలన్నిటా మెజారిటీ మత జనాభా పెరుగుతున్న సందర్భంలో దీని ప్రాధాన్యత మరింత ఎక్కువ ఉందని అభిప్రాయం వ్యక్తపరిచింది. అదే సమయంలో హిందువుల జనాభా మైనారిటీగా ఉన్న బాంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, ఆఫ్ఘనిస్తాన్లో తగ్గడం ఆందోళన కలిగిస్తున్నదని రాసారు. "పరిశీలించగా కష్టకాలంలో మైనారిటీలు భారతదేశానికి వలసలు వస్తున్నారని తేటతెల్లమవుతున్నదని" తేల్చింది. అంటే మైనారిటీలకు భారతదేశం స్వర్గంలాగా ఉన్నదన్నమాట!

ఈ పత్రంలో, ఒక్క మాల్దీవులను మినహాయిస్తే ఇతర ముస్లిం దేశాలలో మెజారిటీ మతస్థుల భాగస్వామ్యం పెరిగింది. బాంగ్లాదేశ్లో 18, పాకిస్తాన్లో హనఫీ ముస్లింలు 3.75 %, మొత్తం ముస్లింలు 10% పెరిగారు. ఇది కూడా 1971లో బంగ్లాదేశ్ అవిర్భవించినప్పటికీ , అంతకు ముందు కూడా పరిగణనలోకి తీసుకోదాన్ని గమనించాలి.

కానీ, ముంబైలోని గోవండిలో ఉన్న అంతర్జాతీయ జనాభా శాస్త్ర సంస్థ 2018 నాటి స్థితిని పరిశీలించి నిర్ధారించిన ప్రకారం ప్రపంచ జనాభాలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది . దీని తరువాత చైనా, అమెరికా, ఇండోనేసియా ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక జనాభా గల పది దేశాల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉంటే, పాకిస్తాన్ అయిదో స్థానంలో, బంగ్లాదేశ్ ఎనిమిదో స్థానంలో ఉన్నాయి. ప్రపంచ జనాభాలో 17.76 % జనాభా భారతదేశంలో ఉన్నారు. పాకిస్తాన్లో 2.99%, బంగ్లాదేశ్ లో 2.17 % ఉన్నారు.

ముస్లిమేతర దేశాలలో మైనారిటీ మతస్తుల జనాభా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నది. ఒక్క మయన్మార్, నేపాల్, భారతదేశంలోనే తగ్గుతున్నది. నేపాల్లో హిందువుల జనాభా 4% తగ్గింది (1950 లో 84% ఉండగా 2015 లో 80% ఉంది) బౌద్ధుల జనాభా 3% తగ్గింది. ముస్లిం జనాభా మాత్రం 2% పెరిగింది. క్రిస్టియన్ జనాభా 0% నుండి 2%కి పెరిగింది. శ్రీలంక , భూటాన్ లలో హిందూవుల జనాభా 5 నుంచి 12% తగ్గింది. శ్రీలంకలో థీరవేదా బౌద్ధుల, టిబెటన్ బౌద్ధుల జనాభా పెరిగింది.

**మైనారిటీ మతస్తుల జనాభా**

పైన చెప్పుకున్న పత్ర రచయితలు జనాభా మత పొందిక సంక్లిష్టమైనవి అని, అందుకు అనేక కారణాలు ఉంటాయి అంటూనే, "ఈ మార్పులకు కారణాలు ఏమిటనే వాస్తవ పరిశీలన చేయకుండా, కేవలం మైనారిటీ మతస్థుల సంచయన అభివృద్ధి కి కారణం మరింత సౌకర్యవంతమైన

జీవితాలను అనుభవిస్తూ ఉండడం అనే నిర్ధారణకు వచ్చారు. దానికి కారణం 'ఒక సమాజంలో జనాభా అభివృద్ధి చెందడానికి కారణం వారు నివసించడానికి అనువైన ప్రదేశంగా ఉండడం' అని చెపుతున్నారు. దేశ జనాభాలో లింగ సమానత్వం మహిళల సామాజిక స్థితిని తెలియజేసినట్లు , ప్రజల జీవనం వారి వృద్ధిని బట్టి నిర్ధారించవచ్చని అంటున్నారు. ఈ పత్రమంతా హిందువుల జనాభా పట్ల పక్షపాతంతో విశ్లేషించింది. ఉదాహరణకి బంగ్లాదేశ్‌లో (ఇది 1971 లో రూపొందింది) హిందువుల జనాభా 1950లో 23 % ఉండగా 2015 లో 8% నికి పడిపోయిందని, అదే సమయంలో మైనారిటీలు 22 % పెరిగారు అంటుంది. "ఇది బంగ్లాదేశ్‌లో హిందూ జనాభా ఎదుర్కొనే కష్టాలను తెలియచేస్తుంది అని , 1950-2015 మధ్య కాలంలో హిందూ జనాభా ఎటువంటి కష్ట కాలంలో ఉన్నారో ఈ అధ్యయనం తెలుపుతుందని" అంటారు. ఈ కాలంలోనే బౌద్ధుల జనాభా అదే స్థితిలో ఉండగా క్రిస్టియన్ల జనాభా మూడింతలు పెరిగింది అని గమనించాలని అంటుంది . ఈ కాలంలోనే భూటాన్‌లో హిందూ జనాభా తగ్గిపోవడానికి కారణం నేపాల్ హిందువులను భూటాన్ తరిమి కొట్టడం. శ్రీలంకలో బౌద్ధుల జనాభా 67 % నికి పెరగగా, హిందువుల జనాభా 20 % నుండి 15 % నికి పడిపోయింది. అదేవిధంగా పాకిస్థాన్‌లో హిందూ జనాభా 1950 లో 13% ఉండగా 2015 కి 2 % నికి దిగజారింది. కానీ భారతదేశంలో హిందువుల జనాభా 7.82 % తగ్గింది. ముస్లింల జనాభా 9. 84 % నుంచి 14. 09 % నికి పెరిగింది. క్రిస్టియన్లు, సిక్కులు బౌద్ధులు కూడా పెరిగారు. జైనులు, పార్సీలు మాత్రమే తగ్గారు. అందువలన ఈ పరిశీలన భారతదేశంలో మైనారిటీలు ఎంతగా రక్షించబడుతున్నారంటే, రాజ్యాంగం వారి కి కల్పించిన హక్కుల వలన స్థితంగా ఉండటమే కాదు, పెరిగారు కూడా అని నిర్ధారణకు వచ్చారు.

ఆ పత్రం :భారతదేశం తన చిరకాల నాగరికతకు అనుగుణంగా "వంచితులకు ఆశ్రయం కల్పిస్తున్నందుకు" ప్రశంసించాలన్నారు. చైనా నుంచి వచ్చే టిబెటన్ బౌద్ధులను బంగ్లాదేశ్ నుండి వచ్చే, మాథియాస్‌లకు, శ్రీలంక, పాకిస్తాన్, మయన్మార్,

> **"జనాభా తీరుతెన్నులను పరిశీలించిన ఈ పత్రం వివిధ ప్రాంతాలలో సంతానోత్పత్తి రేటులో ఉండే వ్యత్యాసాలు ఇది పరిశీలించలేదు. విద్య, ఆర్థిక వృద్ధి స్థాయి, స్థితి జనాభాను ప్రభావితం చేస్తాయన్న విషయం అందరికి తెలిసినదే. ముస్లింలు సంతృప్తికరంగా జీవిస్తునందువలనే వారి జనాభా పెరిగిందనుకుంటే, అది షెడ్యూల్డ్ కులాలు, తెగల విషయంలో కూడా నిజమవ్వాలి. ప్రణాళిక సంఘం షెడ్యూల్డ్ కులాలు 1961-2011 మధ్య కాలంలో 14.7 % నుంచి 16.6 % కి పెరిగిందని చెప్పారు."**

ఆఫ్ఘనిస్తాన్ నుండి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్నదని రాశారు.

జనాభా తీరుతెన్నులను పరిశీలించిన ఈ పత్రం, సంతానోత్పత్తి రేటుపై కూడా దృష్టి పెట్టింది. వివిధ ప్రాంతాలలో సంతానోత్పత్తి రేటులో ఉండే వ్యత్యాసాలు ఇది పరిశీలించలేదు. విద్య, ఆర్థిక వృద్ధి స్థాయి, స్థితి జనాభాను ప్రభావితం చేస్తాయన్న విషయం అందరికి తెలిసినదే. ముస్లింలు సంతృప్తికరంగా జీవిస్తునందువలనే వారి జనాభా పెరిగిందనుకుంటే, అది షెడ్యూల్డ్ కులాలు, తెగల విషయంలో కూడా నిజమవ్వాలి. ప్రణాళిక సంఘం షెడ్యూల్డ్ కులాలు 1961-2011 మధ్య కాలంలో 14.7 % నుంచి 16.6 % కి పెరిగిందని చెప్పారు. అలాగే షెడ్యూల్డ్ తెగలు-గిరిజనులు కూడా 6 9 % నుండి 8.6 % నికి పెరిగారు అని తెలియచేస్తుంది. .

పాపులేషన్ ఫౌండేషన్ అఫ్ ఇండియా అనే సంస్థ అధికారి పూనమ్ మూత్రేజ. ఆమె ఉన్న గణాంకాలలో అక్కడక్కడా సమాచారాన్ని తీసుకుని మనకు ఇష్టమైన నిర్ధారణలు చేసుకోవడం తప్పని అంటారు. నిజానికి భారతదేశంలో గత మూడు దశాబ్దాల కాలంలో 1981-1991 దశాబ్దంలో ముస్లిం జనాభా 32.9 % ఉండగా 2001-2011 దశాబ్దంలో అది 24 .6% నికి పడిపోయింది. అయితే, ఈ కాలంలోనే హిందూ జనాభా కూడా 22 .7 % నుండి 16. 8 % నికి పడిపోయింది. అంటే అన్ని మత సమూహాల జనాభా తగ్గుకొస్తున్నది. అయితే, ముస్లింలు 1% తగ్గితే హిందువులు. 7 % తగ్గారు. అంటే జనాభాలో పునరుత్పత్తి రేటు పడిపోయింది. స్వయం రాజకీయ ప్రయోజనాల కోసం జనాభా లెక్కలను వినియోగించుకోవడం దారుణం అంటారు ఆమె. ఇది దేశంలో విభజన, తప్పుడు సంకేతాలు ఇస్తుందని, కొన్ని సమూహాలను అణచివేసేందుకు ఉపయోగపడుతుందని అన్నారు.

మత ఆధిపత్యాలు పెరగడం, తరగడం ప్రభావం సమాజంలో ఎలా ఉంటుందని ప్రశ్నిస్తే, 'అభివృద్ధి అంశాలు పునరుత్పత్తి పై ప్రభావం చూపిస్తాయని అన్నారు. చదువు, ఉద్యోగితలపై పునరుత్పత్తి రేటు ఆధారపడి ఉంటుందనీ, ఆరోగ్యం, విద్య అందుబాటులో ఉన్న కేరళ, తమిళనాడు లాంటి రాష్ట్రాలలో అన్ని మతాలలో కూడా పునరుత్పత్తి రేటు తక్కువగా ఉంటుంది. బీహార్ ముస్లిం మహిళల పునరుత్పత్తి రేటు కన్నా కేరళలో ముస్లిం మహిళల పునరుత్పత్తి రేటు తక్కువగా ఉండటానికి అదే కారణం.

అంటే, ముస్లిం మైనారిటీలు సుఖప్రదమైన జీవితాలు గడుపుతుండటం వలన వారి జనాభా పెరుగుతున్నదనడం తప్పు. మొదటగా ముస్లింల పట్ల విద్వేషపూరితంగా ఉండడం వల్లనే నరేంద్ర మోడీ ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ముస్లింలను చొరబాటుదారులు గాను, ఎక్కువమంది పిల్లలు కానేవారిగాను చూపడాన్ని అందరూ తప్పుపడుతున్నారు .కాంగ్రెస్ ముస్లిములను మచ్చిక చేసుకోవడానికి, వారికి రేజర్వేషన్లు కేటాయించి, ఎస్ సి, ఎస్ టి రిజర్వేషన్‌లు తీసేస్తారని మోడీ పదేపదే అంటున్నారు. ఇటువంటి సమయంలో ఈ పత్రం ప్రకటించడం వల్ల ఇప్పటి వరకు ఉన్న సహృద్భావ వాతావరణం కలుషితం అవుతుంది. ఈ పత్రం కేవలం బీజేపీకి రాజకీయ ప్రచారం చేసుకోవడానికి అనువుగా మైనారిటీలను లక్ష్యం చేసుకుని ప్రచురించినది. అయితే, చూడగా అదేం పని చేసినట్టు లేదు.

**(అనువాదం: కె. ఉషారాణి)**

# మోడీ నిరంకుశత్వానికి ప్రజా తిరస్కరణ

(7వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ తర్వాత మూడవ పెద్ద పార్టీగా సమాజ్‌వాది పార్టీ రావటం. పిడిఎ( యాదవులు, యాదవులు కాని వెనుకబడిన తరగతులకు దగ్గర కావటం), దళితులు, అల్పసంఖ్యాకుల– ముస్లింలు, మైనారిటీలు– సమస్యలు తీసుకోవటం, కూటమిలో జూనియర్ పార్టనర్‌గా పనిచేయటానికి కాంగ్రెస్ సిద్ధం కావటం ఈ విజయానికి కారణాలు. వీటితో పాటు మాయావతి కొన్నిసార్లు బహిరంగంగా, కొన్నిసార్లు నిశ్శబ్దంగా బిజెపికి ఇచ్చిన మద్దతు ఈసారి వికటించింది. దళితుల ఓట్లు ఎస్‌పి–కాంగ్రెస్ కూటమికి పడ్డాయి.

ఫైజాబాద్‌లో ఓటమి స్పష్టం చేస్తున్నట్లుగా రామాలయం విషయం బిజెపికి ఏ మాత్రం ఎన్నికల లబ్ది చేకూర్చలేదు. ఓపెన్ కేటగిరిలో ఉన్న ఫైజాబాద్ స్థానంలో సమాజ్‌వాది పార్టీ దళిత అభ్యర్థిని పెట్టటం కలిసివచ్చింది. రామ మందిరం కోసం ఇళ్ళు, షాపులను కూలగొట్టటంతో అయోధ్య ఓటర్లు కోపంతో రగిలిపోతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బుల్‌డోజర్లతో రామ మందిరాన్ని కూలుస్తుందంటూ మోడి చేసిన ప్రచారాన్ని ప్రజలు స్వీకరించలేదు. మతపరంగా విభజన చేయటానికుద్దేశించిన మోడి ప్రసంగాలు ఓటర్లలో విముఖతను కలిగించాయి. రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో 'చొరబాటుదారులని', 'ఎక్కువ మంది పిల్లలను కనేవారని' ముస్లింలపై మోడి ప్రారంభించిన విషపుదాడి వికటించిన విధంగానే ఇక్కడా జరిగింది. ఇండియా కూటమితో ఉన్న కొత్త పార్టీ భారత్ ఆదివాసి పార్టీ అభ్యర్థి చేతిలో ఇక్కడ బిజెపి అభ్యర్థి 2.47 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయాడు.

**బిజెపిని పెద్దదెబ్బ కొట్టిన ఓటర్లు**

తన ప్రధానమైన సైద్ధాంతిక పథకాలకు సంబంధించిన ప్రతి అంశాన్నీ పునరాలోచించుకోవాలని బిజెపికి ప్రజలు చెప్పటమే ఈ తీర్పు సారంశం. ఇది తీవ్రమైన దెబ్బ. తాను రాజు కావటానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్న వాతావరణం సృష్టించటానికి మోడి ప్రయత్నించాడు. సాంప్రదాయానికి భిన్నంగా తన మూడవ దఫా పాలనలో 100 రోజులలో చేయాల్సిన పనులపై ప్రణాళిక రూపొందించాలని ప్రతి మంత్రిత్వశాఖలోని అధికారులను ఎన్నికలకు ముందే ఆదేశించాడు. వివిధ సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌లో ఎన్‌డిఎకు 350 నుండి 401 స్థానాల వరకు వస్తాయని ప్రకటించిన తర్వాత –అవన్నీ తప్పనితేలింది–ఈ ప్రణాళికలపై సమీక్ష చేయటానికి అధికారుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మోడి చెప్పాడు.

ప్రస్తుతం ఇద్దరు అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులు జెడి(యు) నితీశ్‌కుమార్, టిడిపి నాయకుడు చంద్రబాబునాయుడులపై మోడి ఆధారపడి ఉన్నాడు. తన పథకాలను మోడి రద్దుచేయవచ్చు. ఒక్క శివసేన మినహా ఎన్‌డిఎ భాగస్వాములలో హిందుత్వను బలపరచేవారు ఎవరూ లేరు. ఏకరూప సివిల్ కోడ్‌ను డీప్‌ఫ్రీజ్‌లో పెట్టవచ్చు. ఒకేదేశం, ఒకే ఎన్నికను కూడా అదే విధంగా చేయవచ్చు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని చంద్రబాబునాయుడు, నితీశ్‌కుమార్‌లు తమ స్వంత ఎజెండాలను నెరవేర్చుకోవటానికి ప్రయత్నం చేస్తారు.

టిడిపి నాయకుడు కొన్ని మంత్రిత్వ శాఖలు, లోక్‌సభ స్పీకర్ పదవి, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కోరుతూ ఒక కోర్కెల జాబితాను అందజేశారు. వచ్చే సంవత్సరం జరగనున్న శాసనసభ ఎన్నికలలో తన స్థితిని బలపరచుకోవటం కోసం నితీశ్‌కుమార్ ముఖ్యమైన క్యాబినెట్ మంత్రిత్వశాఖలతో పాటు బీహార్‌కు ప్రత్యేక ప్యాకేజి, నిధులు ఇవ్వాలని డిమాండ్ చేయవచ్చు.

తాను అధికారంలోకి వచ్చినట్లైతే పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దుచేస్తానని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. ప్రతిపక్ష సభ్యులు పెద్దసంఖ్యలో ఉన్నారు కాబట్టి ఇండియా కూటమి ఇందుకోసం గట్టిగా కృషి చేయాలి. విశ్రాంతి తీసుకోవటానికి, దీర్ఘకాలం వాయిదా వేయటానికి ఇది సమయం కాదు. హర్యానా, మహారాష్ట్ర, బీహార్ లాంటి రాష్ట్రాలలో ఈ సంవత్సరం, వచ్చే సంవత్సరాలలో జరిగే శాసనసభ ఎన్నికలు లోక్‌సభలో చేసిన కృషికి పరీక్షగా ఉంటాయి. పోయిన తన ప్రతిష్ఠను తిరిగి పొందటానికి బిజెపి తప్పనిసరిగా ప్రయత్నం చేస్తుంది. అది తక్షణమే ఎన్నికల కార్యక్రమంలోకి వెళ్ళవచ్చు.

**సంకీర్ణ రాజకీయాల దశ**

గత దశాబ్దకాలంలో జరిగిన ఏకపార్టీ పాలన, అది ప్రోత్సహించిన నిరంకుశ పాలనకు భిన్నంగా భారతదేశం తిరిగి సంకీర్ణ రాజకీయాల దశలోకి వచ్చింది. సంకీర్ణ రాజకీయాలకు సహజమైన విభేధాలు, ఘర్షణలు, రాజీలు తదితరాలన్నీ ఉంటాయి. పెద్దనోట్ల రద్దు కోసం నిర్ణయం తీసుకున్న పద్ధతి, వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిన విధానం, జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ను రద్దుచేయటం, ఆ రాష్ట్రం స్థాయిని దిగజార్చి రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా చేయటం సంకీర్ణ ప్రభుత్వంలో జరగడం కష్టం. సంకీర్ణ ప్రభుత్వాలు వినాశనాన్ని తీసుకొస్తాయనేది కట్టుకథ మాత్రమే. సంకీర్ణ ప్రభుత్వాలు జాతీయస్థాయిలో చర్చలు జరగటానికి దోహదం చేస్తాయి. భారతదేశంలో సమాఖ్య విధానాలను ముందుకు తీసుకుపోవటానికి ఇదే మార్గం.

మోడి, షాలు సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపటానికి ఇప్పటి వరకు చూపించని నైపుణ్యాలను ప్రదర్శిస్తారా అన్నది చూడవలసి ఉంది. బిజెపి పరాజయానికి ఎవరు బాధ్యత వహిస్తారన్నది అస్పష్టంగా ఉంది. మహారాష్ట్రలో ఎన్‌డిఎ పేలవమైన ప్రదర్శనకు బాధ్యత వహించి, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావటం కోసం తనను ప్రభుత్వ బాధ్యతల నుండి తప్పించాలని ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కోరాడు. చాలాకాలం నుండి పక్కన పెట్టబడిన రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరి, శివరాజ్‌సింగ్ చౌహాన్ లాంటి వారు పార్టీ సమావేశాలలో మరింత గట్టిగా మాట్లాడవచ్చు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి మధ్య రగులుతున్న విభేధాలు బహిరంగం కావచ్చు. మొదటి ప్రధాని గొప్పదనం కోసం అర్రులు చాస్తున్న వ్యక్తికి " మోడి తర్వాత ఎవరు" అనేది ఒక ప్రశ్నగా ముందుకురావచ్చు. కానీ నెహ్రూను అడిగిన పరిస్థితులకు భిన్నంగా ఈనాడు ఆ ప్రశ్న ఉంటుంది.

భారతదేశ ఓటర్లు తప్పుడు ప్రచారాలకు మోసపోకుండా తెలివిగా ఆలోచిస్తారని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. రాజ్యాంగాన్ని వాస్తవాలకు సంబంధం లేనిదానిగా చూడటం లేదని, నిజ జీవితానికి ఉపయోగపడే మార్గదర్శిగా చూస్తున్నారని నిరూపించుకున్నారు. పాలకపార్టీకి చెక్ పెట్టటానికి బలమైన ప్రతిపక్షం ఎంత అవసరమో వారికి తెలుసు. భారతదేశ ఓటర్లు గొంతెత్తారు. వారు ప్రజాస్వామ్యం కోసం గొంతెత్తారు.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# కేరళ స్పార్టకస్ అయ్యంకాళీ

(2వ పేజీ తరువాయి)

బీళ్లు గా మారిపోతాయి", అని హెచ్చరించాడు. అంతేకాదు పొలంలో పనిచేసే దళితులందరినీ సంఘటితపరిచి సమ్మె చేయించాడు. ఈ సమ్మె ఆణగ దొక్క బడుతున్న, అస్పృశ్యులుగా చూడబడుతున్న, దళితుల పిల్లలను పాఠశాలలో చేర్చుకోవాలని డిమాండ్‌తో చేసింది. అస్పృశ్యతకు వ్యతిరేకం గా చేసిన ఈ పోరాటం గొప్ప ఫలితాలను ఇచ్చింది. ఈ సమ్మె చాలా కాలం సాగింది. ఈ అణగారిన దళితులు, సభ పెట్టుకోవడానికి ప్రయత్నిస్తే పోలీసులు అనుమతి ఇవ్వలేదు. అయినా అయ్యం కాళీ ఊరుకోలేదు. సమీపం లోని సముద్రంలోనీ పడవలన్నింటినీ ఒకచోట కు చేర్చి సభ నిర్వహించిన గొప్ప ఉద్యమ వ్యూహకర్త అయ్యం కాళీ. దేశ చరిత్రలోనే మొట్టమొదటి కూలీల సమ్మెను నిర్వహించిన ఘనత అయ్యంకాళీకే దక్కుతుంది. ఆయనది సాహసోపేతమైన సామాజిక ఉద్యమం. దానితో అగ్రవర్ణాలు దిగిరాక తప్పలేదు. సుదీర్ఘ పోరాటం తర్వాత మార్చి1, 1910లో ట్రావెన్ కోర్ ప్రభుత్వం పులయ కులానికి సంబంధిం చిన పిల్లలకు, ఇతర దళిత పిల్లలకు, అందు బాటులో ఉన్న అన్ని పాఠశాలల్లో చేర్చు కోవాలని ఆదేశాలు జారీ చేసింది. అయినప్ప టికీ ఈ అమలు అంత తేలికగా జరగలేదు. ఒక అమ్మాయిని బడిలో చేర్చడానికి వెళితే ఆధిపత్య కులాల వారు దాడి చేశారు. దానిని అయ్యం కాళీ, తన అనుచరులు ప్రతిఘటిం చారు. ఇలాంటి అనేక ఘర్షణలు జరిగాయి. ధైర్యంతో ఎదుర్కొన్నాడు అయ్యం కాళీ. ఆ దాడులను ఎదిరించి నిలిచి వివక్ష లేకుండా పిల్లలందరికీ చదువు అందించాలనే తన కలను 1910లో సాకారం చేశాడు అయ్యాం కాళీ. చివరకు తనను హత్య చేయటానికి అగ్రవర్ణాలు వారు పన్నిన కుట్రలను ఛేదించుకొని బయట పడ్డాడు కూడా.

1916లో ఆయన "తీయంకర పులయ పాఠశాల" పేరుతో మానర్ కాడ్‌లో రాత్రి పాఠశాలను ప్రారంభించాడు. వెంగనూరులో ఒక ప్రాథమిక పాఠశాలను అనేక ఇతర సంస్థలను స్థాపించాడు. సాధుజన పరిపాలన సంఘపు కార్యాలయాలను కూడా పాఠశాల లుగా మార్చి విద్యాభివృద్ధికి, రాజకీయంగా, సామాజికంగా ఎదగడానికి తోడ్పడ్డాడు.

అయ్యం కాళీ చేపట్టిన మరొక విప్లవాత్మ కమైన సాంస్కృతిక ఉద్యమం స్త్రీల గురించి. అగ్రవర్ణాల పురుషులు దళిత స్త్రీల మీద లైంగిక అత్యాచారాలకు పాల్పడే వాళ్లు. ఆ రోజుల్లో దళిత స్త్రీలు జాకెట్లు ధరించకూడదు. వక్షస్థలం మీద ఎలాంటి ఆచ్ఛాదనా ఉండరాదు. రొమ్ము లు బయటకు కనపడుతూ ఉండాలి. రొమ్ము లను కప్పుకోవడానికి కేవలం రాళ్ల పూసల దండలు మాత్రమే వేసుకోవాలి. ఇది అగ్రవర్ణా ల నియమం. ఈ నియమాన్ని ఛేదించడానికి వేలాదిమంది స్త్రీలను ఒక చోట సమావేశ పరిచాడు అయ్యంకాళీ. వాళ్ల మెడలోని రాళ్ళ పూసల దండలను తెంచి వేయమని పిలుపు నిచ్చాడు. వెంటనే వేలాది మంది స్త్రీలు పూసల దండలను తెంచివేసి రవికెలను వేసుకోవడం మొదలుపెట్టారు. దళిత స్త్రీలు రవికెలు వేసు కోవటంతో సహించలేని సవర్ణులు వారి మీద దాడి చేశారు. స్త్రీలంతా సంఘటితమై ఉ వ్వెత్తున ఎగిసిపడి ఎదురుదాడి చేసి తరిమి కొట్టారు. ఈ వికృత ఆచారానికి స్వస్తి పలు కుతూ చేసిన పోరాటంతో ఆ సమస్య పూర్తిగా ఆనాటికి సమసి పోకున్నా స్త్రీలలో ఒక సాంస్కృతిక చైతన్యానికి నాంది పలికింది. ఈ స్త్రీల్లో వచ్చిన తిరుగుబాటు వల్ల 1895లో అయ్యం కాళీ భార్య చెల్లమ్మ, అతని కోడలు కుట్టియమ్మ, పై బట్టలు అంటే రవికలు ధరించి బహిరంగంగా రహదారి వెంట నడిచి వెళు తున్నప్పుడు, నాయర్ల గుంపు వారిపై దాడి చేసి వారి బట్టలను చింపేసి కొట్టారు. అయ్యం కాళీ స్త్రీలను రక్షించడానికి పరిగెత్తుకుని వెళ్లి దుండగులతో పోరాడారు. ఈ సంఘటన ట్రావెన్‌కోర్ అంతట నిరసనలకు, ఘర్షణలకు దారితీసింది. వేలాదిమంది దళిత మహిళలు తమ రొమ్ములను కప్పుకోవటంపై నిషేధాన్ని ధిక్కరించారు. ఈ తిరుగుబాటు రెండు దశాబ్దా లకు పైగా కొనసాగింది. 1916లో ట్రావెన్ కోర్ మహారాజు కుల మతాలకు అతీతంగా స్త్రీలందరూ పైదుస్తులు ధరించటానికి అనుమతించే ప్రకటనను జారీ చేయటంతో ఆ ఉద్యమం విజయవంతం అయింది.


ఆలయ ప్రవేశం గురించి 1924లో జరిగిన వైకోం సత్యాగ్రహం కన్నా ముందే 1907లో దళితుల దేవాలయ ప్రవేశం కోసం అయ్యం కాళీ పోరాటం చేశాడు. అయ్యం కాళీ 1895 నుండి బలరామపురం ఆలయంలో పూజలు చేయడానికి దళితుల బృందానికి నాయకత్వం వహించి ఆలయ ప్రవేశం కోసం పోరాడాడు. కానీ ఆనాటి సనాతన పురోహి తుల నుండి గట్టి వ్యతిరేకత ఎదుర్కొన్నాడు. తమ దేవాలయాల్ని కలుషితం చేసే వ్యక్తిగా అయ్యం కాళీపై దుష్ప్రచారం చేశారు. అయినప్ప టికీ తన ప్రయత్నాలను కొనసా గించాడు. నారాయణ గురు వంటి ఇతర గొప్ప సంస్కర్తల నుండి మద్దతు కూడా సాధించాడు. నాలుగు దశాబ్దాల తర్వాత "మహారాజా చితిర తిరు నాల్ బలరాం వర్మ" 1936 నవంబర్ 12న ప్రజలందరూ దేవాలయాల్లో ప్రవేశించవచ్చు నని ఒక చారిత్రాత్మక ప్రకటన జారీ చేశారు. దీనితో ప్రజలందరూ తమ మత స్వేచ్ఛ, ఆత్మగౌరవం కాపాడుకోవటం కోసం అయ్యం కాళీ నాయకత్వంలో చేసిన పోరాటం విజయ వంతమైంది.

అంటరానితనం, వివక్ష అడుగడుగునా అణచివేత, స్వేచ్ఛ రాహిత్యం రాజ్యమేలుతున్న రోజుల్లో ఒక చదువురాని, పేద అట్టడుగు స్థాయి నుంచి వచ్చిన నిమ్న కులస్తుడు, భూస్వామ్య వ్యవస్థకు, అగ్రవర్ణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడి నిలబడగలటం సామాన్యమైన విషయం కాదు. అయ్యం కాళీది అద్వితీయమైన, అసాధా రణమైన వ్యక్తిత్వం. అసాధారణమైన ఆత్మవి శ్వాసం. సామాజిక న్యాయం, సమానత్వం పై ఆయన కృషి లేకుంటే కేరళలో దళితుల పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. అయ్యం కాళీది ఉ ద్విగ్న భరిత పోరాటం. ఉత్తేజ కరమైన సందే శం. 1912లో అయ్యం కాళీ "శ్రీ మూలం పాపులర్ అసెంబ్లీ"లో సభ్యుడిగా నామినేటి చేయబడ్డాడు. అతను మరణించే వరకు ఆ పదవులోనే ఉన్నాడు. బ్రిటిష్ వలస పాలనలో భారతదేశంలో శాసనసభకు నామినేట్ చేయబడిన మొదటి దళితుడు అయ్యం కాళి. అసెంబ్లీలో ఆయన నిరంతరం అణగారిన కులాల వారి అభ్యున్నతికి పాటుపడ్డాడు.

అయ్యం కాళీ స్మృతి ఉత్సవాల సందర్భం గా కేరళ వామపక్ష ప్రభుత్వ మాజీ ముఖ్యమంత్రి కీ॥శే॥ ఇకె నయనార్ ఆయన విగ్రహాన్ని ఆవిష్క రించారు. ఆ సందర్భంగా కౌల్దారులకు భూమి కేటాయింపు, ఎస్సీ,ఎస్టీ, బీసీలకు పెన్షన్ తప్పనిసరి చేస్తూ ఆయనకు ఘనమైన నివాళు లర్పించారు. కేరళలోని తిరువనంతపురం "విక్టోరియా జూబ్లీ టౌన్ హాల్" కు 2019లో ప్రస్తుత కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అయ్యాంకాళీ పేరు పెట్టారు. ఈ టౌన్ హాల్ ఇప్పటికీ సాంస్కృతిక సమావే శాలకు నిల యంగా విలసిల్లుతున్నది. అయ్యం కాళీ 1941లో 78 ఏండ్ల వయసులో మరణించాడు. అతను ఆధునిక కేరళలో అత్యంత ముఖ్యమైన దళిత నాయకుడుగా పరిగణించ బడుతున్నాడు. దేశంలోని సామాజిక ఉద్యమంలో అయ్యంకాళీ పోషించిన పాత్రను గుర్తిస్తూ తపాలా శాఖ ఆగస్టు 12, 2002న అయ్యంకాళీ స్మారక తపాల బిళ్ళను విడుదల చేసింది. మహాత్మా గాంధీ అయ్యంకాళీని "పులయ రాజు" అని పిలిచారు. ప్రజలందరికీ ప్రాథమిక హక్కులు, ఆత్మగౌరవం కోసం పరిత పించి పోరాడిన అయ్యం కాళి జీవితం ఆదర్శప్రాయం. ఆయన జయంతిని ఆగస్టు 28న కేరళలో ప్రజలందరూ జరుపుకుంటారు.

❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2024-26, Marxistu Monthly Magazine, Volume 20, issue: 2 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36




## 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలుకున్న సీట్లు

బిజెపి–240 । టిడిపి–16 । జెడి(యు): 12 । శివసేన (ఎక్‌నాథ్ షిండే) 7 । లోక్ జన శక్తి పార్టీ (రామ్ విలాస్ పాశ్వాన్): 5 । జెడి(ఎస్): 2 । రాష్ట్రీయ లోక్ దళ్: 2 । జనసేన పార్టీ: 2 । హిందుస్థానీ అవామీ మోర్చా (సెక్యులర్): 1 । యునైటెడ్ పీపుల్స్ పార్టీ (లిబరల్):1 । అస్సాం గణ పరిషత్: 1 । ఆల్ ఝార్ఖండ్ స్టూడెంట్ యూనియన్ పార్టీ–1 । అప్నా దళ్ (ఎస్)–1 । ఎన్‌సిపి (అజిత్ పవార్ వర్గం)–1 । సిక్కిం క్రాంతికార్ మోర్చా–1

## సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి సీట్లు

కాంగ్రెస్ పార్టీ–99 । సమాజ్‌వాదీ పార్టీ–37 । తృణమూల్ కాంగ్రెస్–29 । డిఎంకె–22 । శివసేన (యుబిటి)–9 । ఎన్‌సిపి (శరద్ పవార్)–8 । సిపిఐ(ఎం)–4 । ఆర్‌జెడి–4 । ఆమ్ ఆద్మీ పార్టీ–3 । జెఎంఎం–3 । ఐయుఎంఎల్–3 । నేషనల్ కాన్ఫరెన్స్–2 । సిపిఐ–2 । సిపిఐ (ఎంఎల్)–2 । విసికె–2 । ఆర్‌ఎస్‌పి–1 । ఎండిఎంకె–1 । కెరళ కాంగ్రెస్ జోసఫ్–1, ఆర్‌ఎల్‌పి–1, భారత ఆదివాసీ పార్ట–1 ।

## ఇతరులు

స్వతంత్రులు–7, వైఎస్‌ఆర్ సిపి–4 । ఎఎస్‌పి (కెఆర్)–1, ఎంఐఎం–1 । అకాలీ దళ్–1, ఓట్‌పిపి–1, జెడ్‌పిఎం–1

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా రూ. **180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా** **పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు ........................................................

వీధి

..................................................................................

గ్రామం

...............................................................................

మండలం లేదా పట్టణం ............................................

email : marxistap@gmail.com
: venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.